


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




క్యాన్సర్‌కు

**జన్యు పరీక్షలు..**

22న వైద్య మంత్రి సత్యకుమార్ చేతులమీదుగా ప్రారంభం

- వివరాలు 12 లో..

## పర్యావరణ హిత నిర్మాణాలు జరగాలి

- అమరావతిని నగరాన్ని అలాగే తీర్చిదిద్దుతున్నాం
- ప్రకృతితో మమేకమైన అభివృద్ధికే భవిష్యత్
- గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు అడుగులు పడాలి
- ప్రతి భవనం వనరులను సృష్టించేలా ఉండాలి
- అభివృద్ధి ఆగకూడదు...పర్యావరణ నష్టం జరగొద్దు
- భవన నిర్మాణాల్లో నెట్‌జీరో విధానం అవలంబించాలి
- ప్రతి పైకప్పును ఒక పవర్ ప్లాంటుగా మార్చవచ్చు
- బెంగళూరు ది ఎర్త్ సెంటర్ ప్రారంభంలో సీఎం చంద్రబాబు
- కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో కలిసి ప్రారంభోత్సవం

2





ప్రకృతికి ప్రాధాన్యమిస్తూ భవిష్యత్ తరాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌లో ఆదివారం ది ఎర్త్ సెంటర్ భవనాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పాల్గొన్నారు. సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ కాంక్రీట్ జంగిల్స్ నుంచి పర్యావరణ హిత నిర్మాణాల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు అడుగులు వేయాలని సూచించారు. స్వచ్ఛమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకు నేలా భవనాలను రూపొందించాలని సూచించారు. వ్యవసాయం లో జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తు న్నామ ని, అదే స్ఫూర్తి పట్టణాభివృద్ధిలోనూ అవసరమని తెలిపారు. అమరావతిని పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

## నైతిక విలువలతో ఎదగాలి


- తల్లిదండ్రులు, దేశానికి గర్వకారణంగా నిలవాలి
- మన కుటుంబ వ్యవస్థకు విలువలే పునాది
- అందుకే ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా గౌరవం
- క్లాస్‌రూం నుంచే సమాజంలో మార్పు సాధ్యం
- ప్రభుత్వ కృషికి నైతిక విలువలు తోడైతే...
- దేశంలోనే నెంబర్ 1గా ఏపీ విద్యావ్యవస్థ
- త్యాగధనులే మార్గదర్శకులు.. వారి బాటలో నడుద్దాం
- చిన్న సమస్యలకే కుంగిపోవద్దు... ఎదురొడ్డి పోరాడాలి
- భారతీయం కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ సందేశం
- గొప్ప కార్యక్రమం ఏర్పాటు చేసిన చాగంటికి ధన్యవాదాలు

4




నైతిక విలువలకు పుట్టినిల్లు మన దేశం.. మన కుటుంబ వ్యవస్థకు అవే పునాది.. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు అంటే గౌరవంగా చూస్తారు.. పెద్దవాళ్లు మనకు ఇచ్చిన ఆస్తి అదే.. అందుకే నైతిక విలువలతో కూడిన విద్య అందిస్తున్నాం.. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని మంత్రి నారా లోకేష్ తెలిపారు. కాకినాడ రూరల్ తిమ్మాపురంలో చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన భారతీయం దేశభక్తి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని సందేశమిచ్చారు. గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన చాగంటిని అభినందించారు. నైతిక విలువలు, అమ్మప్రేమ ఉన్న పుణ్యభూమి మన భారతదేశం.. గడిచిన రెండేళ్లలో విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చాం. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకురావడం టార్గెట్‌గా పెట్టుకున్నామని తెలిపారు.

## ఎల్‌నినోకు ముందస్తు యాక్షన్ ప్లాన్



- రైతులను ఆదుకోవడం.. ధరల తగ్గింపే లక్ష్యం
- హైరిస్క్ ఆర్‌ఎస్కేల పరిధిలో నష్టం జరగొద్దు
- పంట నష్టం సంభవిస్తే బీమా అందేలా చూడాలి
- కంటింజెన్సీ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలుచేయాలి
- ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

3

ఎల్‌నినో పరిస్థితులపై ముఖ్యమంత్రి చంద్రబాబు టెలీ కాన్ఫరె న్స్ ద్వారా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో విపత్తు కాలంలో రైతులను ఆదుకోవడం... ధరలు తగ్గింపే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు ధరలను నియంత్రించాలని ఆదేశించారు. హైరిస్క్ ఆర్‌ఎస్కే పరిధిలోని హార్టికల్చర్ పంటలను ఆదుకునేందుకు ఇచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

11



స్వర్ణకాంతుల్లో శ్రీ వేంకటాద్రిశుని

## దివ్య విహారం

## క్రీడాకారుల కష్టాన్ని రాజకీయాలకు వాడొద్దు




- మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటాపై దుష్ప్రచారం వద్దు
- 'ఫేక్' సర్టిఫికెట్ల ఆరోపణలు అవాస్తవం.. ఆధారాలతోనే మాట్లాడాలి
- క్రీడా ప్రతిభ, అర్హతల పరిశీలన తర్వాతే నియామకాలు
- డీఎస్సీ స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల రౌండ్ టేబుల్ సమావేశం

- వివరాలు 7 లో..

స్వాతంత్ర్య సంగ్రామం చరిత్ర కాదు...

## మన వారసత్వ సంపద

- స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందిద్దాం
- వారు నడయాడిన ప్రదేశాలను సందర్శిస్తే దేశభక్తి పెరుగుతుంది
- త్యాగధనుల జీవితం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి
- 'భారతీయం'లో ఆధ్యాత్మికవేత్త, ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు పిలుపు




- వివరాలు 5 లో..

# పర్యావరణ హిత నిర్మాణాలు జరగాలి



- ప్రకృతితో మమేకమైన అభివృద్ధికే భవిష్యత్
- గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు అడుగులు పడాలి
- ప్రతి భవనం వనరులను సృష్టించేలా ఉండాలి
- అభివృద్ధి ఆగకూడదు... పర్యావరణ నష్టం జరగొద్దు
- భవన నిర్మాణాల్లో నెట్‌జీరో విధానం అవలంభించాలి
- ప్రతి పైకప్పును ఒక పవర్ ప్లాంటుగా మార్చవచ్చు
- బెంగళూరు ది ఎర్త్ సెంటర్ ప్రారంభంలో సీఎం చంద్రబాబు
- కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో కలిసి ప్రారంభోత్సవం

బెంగళూరు(చైతన్యరథం): ప్రకృతికి ప్రాధాన్య మిస్తూ భవిష్యత్ తరాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి సాగాలని ముఖ్య మంత్రి చంద్రబాబు సూచించారు. బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌లో ఆదివారం ది ఎర్త్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి ది ఎర్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభించారు. ప్రకృతి, సాంకేతికత, ఆధునిక పని వాతావరణాన్ని సమన్వయం చేస్తూ ది ఎర్త్ సెంటర్‌ను రూపొందిం చారు. సుస్థిర నిర్మాణం, ప్రకృతి అనుసంధానం, రీ-సైకిల్ చేసిన పదార్థాల వినియోగం వంటి అంశాలకు ఈ భవనంలో ప్రాధాన్యం ఇచ్చారు. ఈ భవన ప్రారం భోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడు తూ కాంక్రీట్ జంగిల్స్ నుంచి పర్యావరణ హిత నిర్మాణాల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు అడుగులు వేయాలని సూచించారు. వనరులను అధికంగా వినియోగించే భవనాలు కాకుండా.. వనరు లను తెలివిగా వినియోగించేలా నిర్మాణాలు చేపట్టా లని తెలిపారు. భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పర్యావరణాన్ని పరిరక్షిస్తూ అభివృద్ధి సాగా లని స్పష్టం చేశారు. అభివృద్ధి ఆగకుండా, పర్యావర ణానికి గాయం చేయకుండా వినూత్న ఆలోచనలతో ప్రతిఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.



### విద్యుత్ ఉత్పత్తి భవనాలను రూపొందించాలి

వాతావరణ మార్పులతో కలిగే దుష్పరిణామాలు భవిష్యత్తులో ఎదురయ్యే సమస్య కాదని.. ఇప్పటికే మన ముందున్న సవాల్ అని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతగా గుర్తించాలని సూచించారు. భవన నిర్మాణాల్లో నెట్‌జీరో విధానాన్ని అవలంభించాలని, సోలార్ విద్యుత్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని, నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. చెత్తను కంపోస్టుగా మార్చడంతో పాటు రీ-యూజ్ విధానాన్ని విస్తృతంగా అమలు చేయాలని చెప్పారు. వీటితోనే స్వచ్ఛ భారత్, స్వచ్ఛ కర్ణాటక, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లక్ష్యాలను సాధించగలమన్నారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ది ఎర్త్ సెంటర్ నిర్మాణం జరిగిందని చెప్పారు. ఇలాంటి పర్యావరణ హిత భవనాలకే భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చే క్రమంలో ప్రకృతి పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఇప్పుడు నిర్మించే భవనాలే రాబోయే దశాబ్దాల్లో నగరాల వాతావరణాన్ని నిర్దేశిస్తాయనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. దశాబ్దాలుగా నగరాల అభివృద్ధి గ్రే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆధారంగా సాగిందని పేర్కొన్నారు. ఇకపై గ్రీన్ గ్రోత్, సర్క్యులర్ గ్రోత్, రీజెనరేటివ్ గ్రోత్ విధానాలు అవసరమన్నారు. స్వచ్ఛమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునేలా భవనాలను రూపొందించాలని సూచించారు. ప్రతి పైకప్పు ఒక పవర్ ప్లాంట్‌గా మార్చవచ్చు.. ప్రతి నీటి చుక్కను తిరిగి వినియోగించవచ్చు.. ప్రతి వ్యర్థ ప్రవాహాన్ని ఒక వనరుగా మార్చవచ్చు అని వివరించారు. నీటిని, నేలను కాపాడటం అంటే సంపదను సృష్టించడమేనని చెప్పారు.



### వ్యవసాయంలోనే కాదు... అభివృద్ధిలోనూ ప్రకృతికే ప్రాధాన్యం ఇవ్వాలి

వ్యవసాయంలో జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తున్నామని, అదే స్ఫూర్తి పట్టణాభి వృద్ధిలోనూ అవసరమ ని తెలిపారు. 2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ విద్యుత్ సామర్థ్యాన్ని సాధించాలనే జాతీయ లక్ష్యంలో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామిగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 165 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని ప్రణాళిక చేస్తున్నామని చెప్పారు. అమరావతిని పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు సైబరాబాద్‌ను అభివృద్ధి చేశానని గుర్తుచేశారు. ఇప్పుడు మరోచక్కటి నగరాన్ని నిర్మించే అవకాశం తనకు దేవుడు ఇచ్చారని చెప్పారు. ప్రకృతి, సాంకేతికత, ఆధునిక మౌలికవసతులతో అమరావతిని భవిష్యత్ తరాలకు అనువైననగరంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను గుర్తిస్తూ... పర్యావరణాన్ని పరిరక్షిస్తూ ఈ ప్రాజెక్టును రూపొందించిన రఘువీర్ వీరమాచనేని, ప్రవీణ్ కుమార్, విస్టా స్పేసెస్ బృందం, వెంకటరమణన్ అసోసియేట్స్ ప్రతినిధులను అభినందించారు.







# ఎల్‌నినోకు ముందస్తు యాక్షన్ ప్లాన్


- రైతులను ఆదుకోవడం.. ధరల తగ్గింపే లక్ష్యం
- హైరిస్క్ ఆర్ఎస్కేల పరిధిలో నష్టం జరగొద్దు
- పంట నష్టం సంభవిస్తే బీమా అందేలా చూడాలి
- కంటింజెన్సీ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలుచేయాలి
- ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి(చైతన్యరథం): ఎల్‌నినో ప్రభావం, యాక్షన్ ప్లాన్ అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్లు, అధికార యంత్రాంగంతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశా నిర్దేశం చేశారు. ఎల్‌నినో విపత్తు కాలంలో రైతులను ఆదుకోవడం... ధరలు తగ్గింపే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు ధరలను నియంత్రించాలని ఆదేశించారు. హైరిస్క్ ఆర్ఎస్కే పరిధిలోని హార్టికల్చర్ పంటలను ఆదుకు నేందుకు ఇచ్చేనిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిమాండ్ ఆధారిత పంటల సాగుపై ఫోకస్ పెట్టాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేలా తాత్కాలిక, మధ్యంతర ప్రణాళికలతో వెళ్లాలని సూచించారు. ఎల్‌నినోకు ముందస్తు యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రతిఒక్కరూ పనిచేయాలని స్పష్టం చేశారు. పంటల బీమా చేయించాం... పంట నష్టం సంభ విస్తే బీమామొత్తం రైతులకు దక్కేలా చేయాలని ఆదేశించారు. గోడౌన్లలో బియ్యం నిల్వలుఎంతమేరకు ఉన్నాయో పరిశీలించాలి. బియ్యం ధరలను అదుపు లో ఉంచేందుకు బియ్యం నిల్వలను మార్కెట్‌లోకి వదిలేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రస్తుతం ఉల్లి ధరలను కంట్రోల్ చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి ఉల్లిని కొనుగోలు చేస్తున్నాం. రానున్న కాలంలో ఉల్లికి ఉన్న డిమాండ్‌కు అను గుణంగా ఉల్లి సాగును ప్రోత్సహించాలని సూచించారు. ఇక పామాయిల్, కందిపప్పు ధరలను అదుపులో పెట్టేలా ఇప్పటికే తీసుకున్న నిర్ణయాలను త్వరితగతిన అమలు చేయాలని స్పష్టం చేశారు.

## కిచెన్ గార్డెన్లను ప్రోత్సహించండి...

స్వయం సహాయక బృందాల ద్వారా కిచెన్ గార్డెన్ల ద్వారా కూరగాయలు పండించేలా చూడాలి. కిచెన్ గార్డెన్లను ప్రోత్సహిం చి వ్యవస్థీకృతం చేయగలిగితే కూరగాయల ధరలు అదుపులో ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం కొన్ని పంటలకు కనీస మద్దతు ధర అందిస్తుంది...దీనిపై కేంద్రంతో సమన్వయం చేసుకోవాలి. ఎల్ నినో విపత్తును సవాల్‌గా స్వీకరించాలి. ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం, రైతు, సాగునీటి సంఘాలు సమన్వయం తో పనిచేయాలి. వర్షాధార పంటలు, ప్రకృతి వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. కొన్ని ప్రాంతాల్లో ఉద్యాన పంట లపై హై రిస్క్ ఉంది... ఈ ఉద్యాన పంటలను కాపాడేందుకు రూ.190 కోట్లు కేటాయించాం.. ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఆదేశించారు.



## పశుగ్రాసం అందేలా చూడాలి

ప్రతిఒక్కరికీ తాగునీటిని అందించాలి. పశువులకు నీటిని అందించడంతో పాటు పశుగ్రాసం అందేలా చూడాలి. డిమాండ్ కు అనుగుణంగా పంటలను సాగు చేయడం.. పశుగ్రాసం పెంచడం.. మల్చింగ్ కోసం విత్తనాలు జల్లడం వంటివి చేయాలి. వీబీ జీ రామ్ జీ పనులను అనుసంధానం చేసుకుంటూ జలధార కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టాలి. రాష్ట్ర వ్యాప్తంగా 50.7 శాతం మేర లోటు వర్షపాతం నమోదైంది. ప్రకాశం, అన్నమ య్య, సత్యసాయి జిల్లాల్లో అత్యధిక లోటు వర్షపాతం కన్పిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్లో 30.84 లక్షల హెక్టార్లల్లో సాగు చేయాల్సి ఉండగా... ఎల్‌నినో కారణంగా 79 శాతం భూము ల్లోనే సాగు పనులు మొదలుపెట్టారు. పప్పు ధాన్యాల సాగు మెరుగ్గా ఉన్నా... నూనె గింజల సాగు తక్కువగా ఉంది. కర్నూ లు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లోని పంటలపై ఎల్ నినో ప్రభావం ఎక్కువగా కన్పిస్తోంది. ఇప్పటికే సిద్ధం చేసుకున్న కంటింజెన్సీ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.

## ఖరీఫ్ కంటింజెన్సీకి రూ.60 కోట్లు సిద్ధం

5.21 లక్షల హెక్టార్లకు పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, పచ్చిరొట్ట ఎరువులు సరఫరా చేశాం. 1.31 లక్షల క్వింటాళ్ల విత్తనాలను 80 శాతం సబ్సిడీతో సరఫరా చేశాం. ఖరీఫ్ కంటింజెన్సీ ప్రణాళిక కోసం రూ.60 కోట్లు సిద్ధం చేసుకున్నాం. అధికారులు క్రమం తప్పకుండా క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలి. స్థానిక ఎన్నికలు ఉన్నప్పటికీ ప్రజా ప్రతినిధులు ఎల్ నినో అంశంపై గ్రామాల్లో ఎక్కువగా పర్యటించి రైతుల్లో అవగాహన పెంచాలని సూచించారు. సంప్రదాయేతర ప్రాంతాల్లో కూడా ఉల్లి, మిరప సాగును చేపట్టాలి. ఇప్పటికే తీసుకున్న నిర్ణయాలతో కరవు ప్రభావిత ప్రాంతాలకు నీటిని పంపగలు గుతున్నాం. హంద్రీ-నీవా ద్వారా చివరి భూములకు నీరందిం చాం.. ఇప్పుడు తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం ముందస్తుగా తీసుకున్న చర్యల వల్లే ఎల్ నినో వంటి సమయాల్లో కూడా హంద్రీ-నీవా కాల్వల్లో నీరు వస్తుంది. రూ.3,500 కోట్ల ఖర్చుతో 100 రోజుల్లో హంద్రీ-నీవా కాల్వల్లో నీటిని పారించగలిగాం. 2014-19 మధ్య కాలంలో ఇరిగేషన్ నిమిత్తం రూ.65 వేల కోట్లు ఖర్చు పెట్టాం. 2019-24 మధ్యన నాటి ప్రభుత్వం కేవలం రూ.22 వేల కోట్లే ఖర్చు పెట్టింది. ప్రాజెక్టులు పూర్తి అయ్యుంటే ఎల్‌నినో వంటి విపత్తు వచ్చినా ఇబ్బంది ఉండేది కాదని తెలిపారు.



# ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ఉంటుంది

**- పోలీస్ ఉద్యోగాల పెంపుపై చర్చిస్తాం**

**- నిరుద్యోగులకు మంత్రి నారా లోకేష్ భరోసా**

కాకినాడ రూరల్(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో ఎస్సై, కానిస్టేబుళ్ల పోస్టుల సంఖ్యను మరింత పెంచాలని కోరుతూ పోలీస్ ఉద్యోగాల అభ్యర్థులు మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఏళ్ల తరబడి పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న తమకు మరిన్ని అవకాశాలు కల్పించాలని వారు మంత్రిని కోరారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ఉంటుందని మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఇందులో భాగంగానే పోలీస్ రిక్రూట్‌మెంట్‌ను ప్రకటించామని చెప్పారు. ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువ తకు ఉద్యోగాలు కల్పించి వారికి బంగారు భవిష్యత్ అందించడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. నిరుద్యోగ యువత సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వరుసగా భర్తీ చేస్తున్నా మని పేర్కొన్నారు. పోలీస్ ఉద్యోగాలు పెంచాలన్న అభ్యర్థుల విజ్ఞప్తిని కూడా పరిగణనలోకి తీసుకుని చర్చిస్తామని భరోసా ఇచ్చారు. ప్రతి ఏడాది క్రమ పద్ధతిలో పోస్టుల భర్తీ ఉంటుందని తెలిపారు. ఉద్యోగాల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న యువతకు అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# రాజమండ్రిలో లోకేష్‌కు ఘనస్వాగతం

*కాకినాడ రూరల్‌లో భారతీయం కార్యక్రమానికి వెళుతున్న మంత్రి నారా లోకేష్‌కు రాజమహేంద్రవరంలో కూటమి ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలో భారతీయం కార్యక్ర మానికి బయలుదేరి వెళ్లారు. చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థుల్లో దేశభక్తి, నైతిక విలువలు పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.*













చైతన్యరథం

# నైతిక విలువలతో ఎదగాలి...

- తల్లిదండ్రులు, దేశానికి గర్వకారణంగా నిలవాలి
- మన కుటుంబ వ్యవస్థకు విలువలే పునాది
- అందుకే ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా గౌరవం
- క్లాస్‌రూం నుంచేసమాజంలో మార్పుసాధ్యం
- ప్రభుత్వ కృషికి నైతిక విలువలు తోడైతే... దేశంలోనే నెంబర్ 1గా ఏపీ విద్యావ్యవస్థ
- త్యాగధనులే మార్గదర్శకులు.. వారి బాటలో నడుద్దాం
- చిన్న సమస్యలకే కుంగిపోవద్దు... ఎదురొడ్డి పోరాడాలి
- భారతీయం కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ సందేశం
- గొప్ప కార్యక్రమం ఏర్పాటు చేసిన చాగంటికి ధన్యవాదాలు

కాకినాడ రూరల్(చైతన్యరథం): ప్రభుత్వ కృషికి నైతికవిలువలు తోడైతే...మన ఏపీ మోడల్‌ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ దేశంలోనే నెంబర్ 1గా మారుతుందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. భారతదేశ చరిత్ర లో తొలిసారిగా ప్రభుత్వపాఠశాలల్లో చదివిర్యాంకులు తెచ్చుకున్న పిల్లల ఫొటోలతో పత్రికలు, టీవీల్లో ప్రక టనలు ఇచ్చాం..ఈఏడాది 1.10 లక్షలమంది స్టూడెం ట్స్ ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఇంటర్‌లో కూడా 10వేల అడ్మిషన్స్‌పెరిగాయి.. విద్యా ర్థులు, తల్లిదండ్రులు, టీచర్ల సహకారంతోనే ఈ ఫలి తాలు సాధించామని తెలిపారు. కాకినాడ రూరల్ తిమ్మాపురం ఆకుండి లక్ష్మీ స్మారక గోశాల ప్రాంగణం లో భారతీయం పేరుతో పాఠశాల విద్యాశాఖ,ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో భారతీయం పేరుతో నిర్వహించిన దేశభక్తి కార్యక్రమా నికి లోకేష్ ముఖ్యఅతిథిగా హాజరై సందేశం ఇచ్చారు. చాగంటిగారి ప్రవచనం వినపడని ఇల్లురెండు తెలుగు రాష్ట్రాల్లో ఉండదు. ఆయనను ఎప్పుడు కలిసినా ఒక పాజిటివ్ ఎనర్జీ వస్తుంది.'భారతీయం'అనే గొప్ప కార్య క్రమాన్ని ఏర్పాటు చేసిన గురువుగారికి ధన్యవాదాలు. నాది భారతదేశం...నేను భారతీయుడిని, మన భారత దేశం... మన గౌరవం, మన సనాతన ధర్మం మన బలం. నైతిక విలువలకు పుట్టినిల్లు మనదేశం. మాన వత్వం మన వారసత్వం. నైతిక విలువలే కుటుంబ వ్యవస్థ మనపునాది. వైద్యంలో చరకుడు, రాజనీతిలో చాణుక్యుడు,గణితంలో ఆర్యభట్ట,యోగాలో పతంజలి, ఆయుర్వేదంలో ధన్వంతరి పురాతనకాలంలోనే భారతీ యుల సత్తా ప్రపంచానికి చూపించారని పేర్కొన్నారు.

## నైతిక విలువల వల్లే భారతీయులంటే గౌరవం

ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు అంటే గౌరవంగా చూస్తారు. అదే పెద్దవాళ్లు మనకు ఇచ్చిన





ఆస్తి. విలువలతో కూడిన సమాజం, కుటుంబ వ్యవస్థ. యూనిటీ ఇన్ డైవర్సిటీ ఈజ్ ద స్ట్రెంత్ ఆఫ్ అవర్ నేషన్. ఇంత గొప్ప ఆస్తిని కాపాడు కోవడమే కాదు భావితరాలకు అందించాలి. అందుకే నైతిక విలు వలతో కూడిన విద్య అందిస్తున్నాం. నైతిక విలువలు అనగానే గుర్తొచ్చే మొదటి పేరు చాగంటి కోటేశ్వరరావు.అందుకే మనముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనను నైతిక విలువల సలహాదారుగా నియమిం చారు. ఆయన రూపొందించిన పుస్తకాలు విద్యార్థుల కు అందిస్తున్నాం. చిన్నతనం నుండే పెద్దలను, మహి ళలను గౌరవించడం నేర్పిస్తున్నాం. గెలుపు – ఓటమి రెండింటినీ సమా నంగా తీసుకునేలా తయారుచేయడ మే లక్ష్యం. 6 ఏళ్ల లోపే పిల్లల్లో 90శాతం బ్రెయిన్ డెవలప్ అవుతుంది. ఆ స్టేజ్‌లోనే పిల్లలకు చదువు, గేమ్స్‌తో పాటు నైతిక విలువలు కూడా నేర్పించాలి. అప్పుడే మనం దేశానికి బెస్ట్ సిటిజన్స్‌ని అందించగలం.

## సమాజంలో మార్పు విద్య ద్వారానే సాధ్యం

సమాజంలో మార్పు విద్య ద్వారానే సాధ్యమని నమ్మి విద్యా శాఖ ఎంచుకున్నా. చాగంటి గారి ద్వారా విలువల విద్యకు ప్రాధా న్యం ఇస్తున్నాం. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం విద్యార్థి కేంద్రంగా ఉండాలి. బాపట్ల మొదటి పీటీఎంలో పిల్లలకు పెట్టే భోజనమే ముఖ్యమంత్రి తిన్నారు..క్వాలిటీ పెంచాలని చెప్పారు. సమాజంలో మార్పు క్లాస్‌రూం నుంచే ప్రారంభం అవుతుంది. క్షణికావేశంతో తీసుకునే నిర్ణయాలు విధ్వంసానికి దారి తీస్తాయి. నేను అమెరికా స్టాన్‌ఫోర్డ్ లో చదివాను. రెండేళ్ల ఎంబీఏ పరీక్షల్లో ఎప్పుడూ ఇన్విజిలేటర్లను చూడలేదు. ఆ రకమైన క్రమశిక్షణ మన వద్ద కూడా రావాలి. ప్రపంచంలో ఎన్నో దేశాలు తమ దేశ అభ్యున్నతికి రెండుతరాలు కష్టపడ్డాయి. ఒకపుడు మత్స్యకార గ్రామం సింగపూర్ అలాగే అభి వృద్ధి చెందింది. ప్రధాని మోదీ నేతృత్వంలో ఇప్పుడు భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతోంది. నమ్మిన సిద్ధాంతాలు సాధించే వరకు ప్రతిఒక్కరూ కృషిచేయా లి. మన రాష్ట్రం ఈ స్థాయికి రావడం వెనుక ఎంతో మంది కష్టం దాగి ఉంది. దేశ సరిహద్దుల్లో కాపలా కాసే సైనికులు లేకపోతే ఇప్పుడు మనం ప్రశాంతం గా ఉండేవారం కాదు.సైనికులు కనపడితే విద్యార్థులు సెల్యూట్ కొట్టండి. ఒక్కొక్కరికి దేవుడు ఒక్కో పరీక్ష పెడతాడు. ఎదుర్కొనే శక్తి కూడా ఇస్తాడు. మార్కులు తక్కువ వచ్చాయని ఇప్పటికిప్పుడు సాధించలేకపోయా మని ఆత్మహత్య వంటి తీవ్రమైన నిర్ణయం తీసుకో వద్దు. నేను ఈస్థాయికి చేరడం వెనుక నా తల్లి కష్టం, త్యాగం ఉన్నాయి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల త్యాగం వల్లే మనం ఉన్నత స్థానాలకు చేరుకుంటాం. నైతిక విలువలు, అమ్మప్రేమ ఉన్న పుణ్యభూమి మన భారతదేశం.

## రాజకీయాలకు దూరంగా విద్యావ్యవస్థ ఉండాలి

అందరూ వద్దన్నా విద్యాశాఖను ఛాలెంజ్‌గా తీసుకున్నా. గడిచిన రెండేళ్లలో అనేక సంస్కరణలు తీసుకొచ్చాం. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకురావడం టార్గెట్‌గా పెట్టుకున్నాం. చిన్నపిల్లల మనసు చాలా సున్నితంగా ఉంటుంది. అందుకే నేను మంత్రి అయిన వెంటనే తీసుకున్న మొదటి నిర్ణయం నో పాలిటిక్స్ ఇన్ స్కూల్స్. యూనిఫాం, బుక్స్, బ్యాగ్స్, బెల్ట్స్, షూస్ ఎక్కడా నో పొలిటికల్ పార్టీ కలర్స్. ఎక్కడా ముఖ్యమంత్రి, నా ఫొటో ముద్రించలేదు.

## నైతిక విలువలతో ప్రపంచ విజేతలమవుతాం

అటమిక్ ఎనర్జీతో విద్యుత్ వెలుగులు ఇవ్వొచ్చు. అదే ఆటమ్ బాంబ్ విధ్వంసం కూడా చేస్తుంది. ఒక మొక్క నాటిన తర్వాత పెద్ద చెట్టు అవ్వాలంటే సంవ త్సరాలు పడుతుంది. ఆచెట్టు నీడ ఇస్తుంది..కాయలు ఇస్తుంది. అదే చెట్టుని 5 నిమిషాల్లో కొట్టేయొచ్చు. అదే నిర్మాణం–విధ్వంసం మధ్య తేడా. పిల్లల్లో ఆలో చనా శక్తి పెరిగేలా చేయడమే నైతిక విలువల లక్ష్యం. ఏది మంచి, ఏది చెడు తెలిసేలా చేయాలి. మనం ఏఐ, రోబోటిక్స్ గురించి మాట్లాడుతున్నాం. వాటికి భారతీయం నైతికవిలువలు తోడవ్వాలి.అప్పుడే మనం ప్రపంచ విజేతలం అవుతాం. గురువు గారు చాగంటి కోటేశ్వరరావు పిల్లలకు చెప్పిన ఒకమాట నాకు బాగా గుర్తుండిపోయింది. అమ్మకు చెప్పలేని పని చేయొద్దు అని ఆయన అన్నారు. నేను ఎక్కడికి వెళ్లినా ఈమాట చెబుతున్నాను. వినడానికి చాలా సింపుల్‌గా ఉంది. కానీ అర్థం చేసుకుంటే చాలా పవర్ ఫుల్ మెసేజ్ ఉంది. ఇదే మన భారతీయం – అమ్మ గొప్పతనం. ఎప్పుడూ తప్పు చేయకూడదు అనే గొప్ప పాఠం.

## త్యాగధనుల స్ఫూర్తే మనకు మార్గదర్శకం

కష్టపడి చదివారు. విలువలతో పెరిగారు. గొప్ప పదవులు పొందారు. దేశం కోసం అన్నీ త్యాగం చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు కూడా లెక్కచేయలేదు. అటువంటి వారి త్యాగాలు గుర్తు చేసుకోవడం మన బాధ్యత. దేశభక్తికి, గుండె ధైర్యానికి మానవ రూపం టంగుటూరి ప్రకాశం పంతులు. 1928లో సైమన్ గో బ్యాక్ అంటూ ఉద్యమం చేశారు. బ్రిటిష్ వాళ్లు కాల్చే స్తాం అని బెదిరించారు. ఆయన భయపడలేదు... గుండెను చూపించి ధైర్యం ఉంటే కాల్చండి అని సింహంలా గర్జించారు. అందుకే ఆయనకు ఆంధ్రకేసరి అనే బిరుదు వచ్చింది. మద్రాస్ రాష్ట్రంలో తెలుగువారికి జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించారు పొట్టి శ్రీరాములు. 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేశారు. ఆయన త్యాగం వలనే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది.

## దేశం కోసం పోరాడిన సైనికులే నిజమైన హీరోలు

మనం సినిమాలు చూస్తాం. అందులో ఫైట్స్, డాన్సులు చూసి హీరోలు అంటాం. కానీ నిజమైన హీరోలు మన సైనికులు. మన భారతీయం వేదికపై అటువంటి హీరో ఉన్నారు. కార్గిల్ యుద్ధ వీరుడు డి.కిరణ్‌కుమార్. బోర్డర్‌లో శత్రువులతో పోరాడారు. బాడీలో బుల్లెట్స్ దిగాయి. కంటి చూపు పోయింది. అయినా వెనక్కి తగ్గకుండా పోరాడారు. ఇప్పటికీ ఆయన బాడీలో బుల్లెట్ ఉంది. ఆయన దేశభక్తి గెలిచింది..బుల్లెట్ ఓడిపోయింది. మరో ఉదాహరణ ఆర్మీ జవాన్ మురళీనాయక్. ఆపరేషన్ సిందూర్ టైం లో చనిపోయారు. నేను సత్యసాయి జిల్లాలో ఉన్న మురళీనాయక్ ఇంటికి వెళ్లి ఆయన తల్లిదండ్రులను కలిశాను. చిన్నప్పటి నుంచి మురళీనాయక్‌కి ఆర్మీలో జాయిన్ కావాలని కోరిక. వాళ్ల ఇంట్లో ఒప్పుకోలేదు. వాళ్ల అమ్మ, నాన్న ఒక్కటే అన్నారు. నీకు ఏమైనా అయితే మేము ఏం కావాలని అడిగారు. నేను యుద్ధంలో చనిపోతే దేశం మొత్తం మీకోసం నిలబడు తుంది అని మురళీనాయక్ చెప్పడంతో తల్లిదండ్రులు కన్నీరు పెట్టుకున్నారు. మురళీనాయక్ చెప్పినట్టే దేశం కోసం ఆయన ప్రాణ త్యాగం చేశాడు. దేశం మొత్తం ఆ కుటుంబానికి అండగా నిలిచింది. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మురళీనాయక్ లాంటి వారు మన హీరోలు. వారి త్యాగాలను గౌరవించడం, స్మరించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత.

## విజయానికి షార్ట్‌కట్ లేదు...

సక్సెస్‌కి షార్ట్ కట్స్ ఉండవు. హార్డ్‌వర్క్‌తోనే మనం మంచి పొజిషన్‌కి వెళ్లగలం. అందుకు నేనే ఒక ఉదాహరణ. కార్నెగీ మెల్లన్ యూనివర్సిటీ, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నా ను. ప్రజలకు సేవ చేయాలి అనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చాను. 2019లో పోటీచేసి ఓడిపోయాను. తొలిసారి ఫెయిల్ అయ్యాను. నిరాశ చెందలేదు. ఫెయిల్ అంటే ఫస్ట్ అటెంప్ట్ ఇన్ లెర్నింగ్ అనుకున్నాను. ఐదేళ్లు కష్టపడి ప్రజలకు దగ్గరయ్యాను. కట్‌చేస్తే 2024లో స్టేట్‌లోనే 3వ అతిపెద్ద మెజారిటీతో గెలిచాను. చాలామంది మంగళగిరి టీడీపీ సీట్ కాదు. టీడీపీకి కంచుకోట లాంటి సీట్లకి వెళ్లండి అని సలహా ఇచ్చారు. నథింగ్ డూయింగ్ నేను పడిపోయిన చోటే నిలబడతా అని ఛాలెంజ్ చేశాను.. చేసి చూపించాను. రోడ్ లెస్ ట్రావెల్ చేసినప్పుడే విజయం వరిస్తుంది.

## సమస్యలకు ఎదురొడ్డి పోరాడండి...

ఈ మధ్య జరుగుతున్న కొన్ని సంఘటనలు చూస్తుంటే నాకు చాలా బాధ వస్తుంది. జూలై 24న మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించుకున్నాం. మన ముఖ్యమంత్రి రంపచోడవరంలో జరిగిన కార్యక్రమం లో పాల్గొన్నారు. కార్యక్రమం అద్భుతంగా జరిగింది. ఆ ప్రోగ్రాంలో శివాని అనే 10వ క్లాస్ స్టూడెంట్ మాట్లాడింది. చాలా అద్భుతంగా మాట్లాడింది. వేరే విద్యార్థి షైనింగ్ స్టార్ అవ్వడం చూసి తను కూడా షైనింగ్ స్టార్ అవ్వాలని కష్టపడి చదివింది. స్పీచ్ అయ్యాక నేను ముఖ్యమంత్రి గారి దగ్గరికి తీసుకెళ్లి ఫొటో కూడా తీయించాను. ఆ కార్యక్రమం తర్వాత రెండురోజులకే శివాని ఆత్మహత్య చేసుకుంది. నేను చాలా బాధపడ్డాను. ఇంట్లో ఏదో సమస్య ఉందని శివాని ఆత్మహత్య చేసుకుంది. దేవుడు మనకి పరీక్ష పెడతాడు... ఆ పరీక్ష ఎదుర్కొనే శక్తి కూడా మనకి ఇస్తాడు. చిన్నచిన్న సమస్యల కోసం అటువంటి నిర్ణ యం తీసుకోవ డం కరెక్ట్ కాదు. ఇంట్లో చెప్పుకోలేని సమస్య ఏదైనా ఉంటే మీ టీచర్‌కి చెప్పండి. వాళ్లు మీకు సహాయం చేస్తారు.

## తల్లిదండ్రులను గర్వపడేలా ఎదగాలి

తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి మిమ్మల్ని చదివిస్తున్నారు. వారు తలదించుకునేలా ఎప్పుడూ ప్రవర్తించవద్దు. వారు తల ఎత్తుకునేలా చేయండి. మీకు నచ్చిన రంగంలో ఎదగండి. ఆటలు, పాటలు, చదువు ఏదైనా పర్వాలేదు కానీ కష్టపడండి. ఊరికే గొప్ప వారు అవ్వరు. గురువర్యులు చాగంటి కోటేశ్వరరావుగారిని చూడండి. ఆయన నిత్య విద్యార్థి. ఎప్పుడూ ఖాళీగా ఉండరు. ఒక ఊరు నుంచి ఇంకో ఊరు వెళ్లేటప్పుడు కూడా పుస్తకాలు చదువుతూ ఉంటారు. దేశభక్తి, దైవభక్తి, పెద్దలు అంటే గౌరవం, మహిళలను గౌరవించడం, సమాజం పట్ల బాధ్యత ఇవన్నీ ఉంటే మీరు విజేతలు అవుతారు. మనదేశ ప్రధాని నరేంద్ర మోదీ కోరుకున్నట్టు వికసిత్ భారత్, మన ముఖ్యమంత్రి చంద్రబాబు కోరుకున్నట్టు స్వర్ణాంధ్ర మీతోనే సాధ్యం. ఫైనల్‌గా ఒక్కటి చెబుతా ను తల్లిదండ్రులను ఎంత ప్రేమిస్తామో భారతదేశాన్ని అంత ప్రేమించాలని పిలుపునిచ్చారు.

## స్వాతంత్ర్య సంగ్రామం చరిత్ర కాదు...

# మన వారసత్వ సంపద

- స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందిద్దాం
- వారు నడయాడిన ప్రదేశాలను సందర్శిస్తే దేశభక్తి పెరుగుతుంది
- త్యాగధనుల జీవితం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి
- 'భారతీయం'లో ఆధ్యాత్మికవేత్త, ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరావు పిలుపు



కాకినాడ రూరల్ (చైతన్య రథం): దేశ స్వాతంత్ర్య సంగ్రామం గత చరిత్ర కాదు... అది మన భారతీయుల వారసత్వ సంపదని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ఏపీ ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు అన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు కాకినాడ రూరల్ తిమ్మాపురంలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలలో 'భారతీయం' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ... "ఒక తండ్రి తన జీవితాంతం కష్టపడి ఇల్లు, పొలం, డబ్బు, బంగారం, ఆస్తులు సంపాదిస్తాడు. తాను వాటిని తనతో తీసుకెళ్లలేనని తెలిసినా, తన పిల్లలు వాటిని సద్వినియోగం చేసుకుని తనకంటే గొప్పస్థాయికి ఎదగాలని కోరుకుంటాడు. అదే సమయంలో, ఆ సంపద వెనుక ఉన్న తన కష్టం, శ్రమ, విలువలు పిల్లలకు తెలియాలని కూడా కోరుకుంటాడు. లేదంటే తాము సంపాదించినదంతా కోల్పోయి, పిల్లలు తిరిగి మొదటి స్థితికి చేరుకుంటారని భయపడతాడు. మన దేశ స్వాతంత్ర్య సంగ్రామం కూడా అలాంటిదే. ఎందరో మహనీయులు తమ జీవితాలను త్యాగం చేసి మనకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను అందించారు. ఆ సంపదను అనుభవించడం మాత్రమే కాదు... దాని విలువను తెలుసుకుని, కాపాడుకోవడం మన బాధ్యత. మన వంశం గురించి మనం తెలుసుకున్నట్టే, మన దేశం కోసం త్యాగం చేసిన మహనీయుల గురించీ తెలుసుకోవాలి. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ జీవించాలి. దేశభక్తి అంటే కేవలం జాతీయ జెండాను ఎగురవేయడం కాదు. "నేను భారతీయుడిని" అని గర్వంగా చెప్పుకోగలిగే స్వేచ్ఛ వెనుక ఎందరో చేసిన త్యాగాలను గుర్తుంచుకోవడం అన్నారు.

### స్వాతంత్ర్య సమయంలో పుట్టిన పదం భారతీయం

"భారతీయం అనే మాట ఇప్పుడు పుట్టింది కాదు. భారతదేశం స్వాతంత్ర్యోద్యమ సమయంలో పుట్టిన మాట భారతీయం. సైమన్ కమిషన్ వచ్చినప్పుడు "భారతదేశం గురించి నిర్ణయాలు భారతీయులే తీసుకోవాలి" అంటూ దేశవ్యాప్తంగా నిరసనలు జరిగాయి. "సైమన్ గో బ్యాక్" అంటూ నల్లజెండాలతో ప్రజలు ఉద్యమించారు. ఎందరో జైళ్లకు వెళ్లారు. "భారతీయం లేని సైమన్ మాకు వద్దు" అని నిరసనలు తెలిపారు. అప్పుడు పుట్టిందే "భారతీయం". భారతీయం గురించి ఎప్పుడూ చర్చిస్తూ ఉండాలి. అప్పుడే పిల్లలకు స్వాతంత్ర్యం గురించి తెలుసుకొని దేశభక్తి పొంది ఉంటారు. లేదంటే దేశభక్తి, నైతిక విలువలు నశించిపోతాయి" అని హితవు పలికారు.

### త్యాగాల స్ఫూర్తితో దేశభక్తి భావనను పెంపొందిద్దాం

"అండమాన్‌లోని కాలాపాని జైలు గురించి చదివితే స్వాతంత్ర్య సమర యోధులు అనుభవించిన కష్టాలు మనసును కదిలిస్తాయి. ఇరుకైన గదులు, ఒంటరితనం, శారీరక హింస... అయినా వారి సంకల్పం మాత్రం చెదరలేదు. గాంధీజీ, నెహ్రూ, లాలా లజపతిరాయ్, టంగుటూరి ప్రకాశం పంతులు, పొట్టి శ్రీరాములు వంటి అనేకమంది మహనీయుల జీవితాలను చదివితే స్వాతంత్ర్యం ఎంతటి త్యాగాల ఫలితమో అర్థమవుతుంది. టంగుటూరి ప్రకాశం పంతులు బ్రిటిష్ పోలీసుల తుపాకీకి ఎదురు నిలిచి చూపిన ధైర్యం కారణంగానే ఆయనకు "ఆంధ్రకేసరి" అనే బిరుదు వచ్చింది. రైతులకు నీరు అందించాలనే ఆకాంక్షకు ప్రతీకగా నిలిచిన ప్రకాశం బ్యారేజీ కూడా ఆయన పేరును గుర్తుచేస్తుంది. ఘంటసాల వెంకటేశ్వర రావు కేవలం గాయకుడిగా మాత్రమే కాకుండా స్వాతంత్ర్య ఉద్యమంలో కూడా పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు అంతిమయాత్రలో పాల్గొని దేశభక్తి గీతాలు పాడుతూ చివరి వరకు వెంట ఉన్నారు. కళను కూడా దేశసేవకు ఉపయోగించిన మహనీయుడు ఆయన. బంకించంద్ర ఛటర్జీ రచించిన "ఆనందమఠం" వంటి రచనలు దేశభక్తి, క్రమశిక్షణ, దేశంపట్ల బాధ్యత వంటి భావాలను ప్రజల్లో బలపరిచాయి. "వందేమాతరం" కూడా అదే భావజాలానికి ప్రతీకగా నిలిచింది. మనకు దేవాలయాలు ఎంత పవిత్రమో, స్వాతంత్ర్య సమరయోధులు జీవించిన జైళ్లు, స్మారకాలు, పోరాట ప్రదేశాలు కూడా అంతే ముఖ్యమైన చారిత్రక ప్రదేశాలు. వాటిని సందర్శించినప్పుడు ఆసక్తి పెరుగుతుంది. వాటి గురించి తెలుసుకున్నప్పుడు చరిత్ర అర్థమవుతుంది. చరిత్ర అర్థమైనప్పుడు దేశభక్తి మరింత బలపడుతుంది. అందుకే పిల్లలకు పుస్తకాలు బహుమతిగా ఇవ్వండి. స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను చదివించండి. అండమాన్ వంటి చారిత్రక ప్రదేశాలకు తీసుకెళ్లండి. మనకు లభించిన స్వేచ్ఛ వెనుక ఉన్న త్యాగాలను వారికి తెలియజేయండి. ఎందుకంటే వారి త్యాగాలను తెలుసుకోవడమే మన వారసత్వాన్ని తెలుసుకోవడం. ఇలాంటి కార్యక్రమాల ద్వారా స్వాతంత్ర్యం మనకు సాధారణంగా రాలేదు, ఎందరో త్యాగాల ఫలితంగా వచ్చింది, ఆ త్యాగాలకు మనమే వారసులమని పిల్లలకు అర్థమవుతుంది. భారతదేశం మనది. ఈ దేశాన్ని గౌరవించడం, కాపాడడం మన బాధ్యత. దేశ సంగ్రామం గత చరిత్ర కాదు... అది మన వర్తమానానికి పునాది, మన భవిష్యత్తుకు వారసత్వ సంపద" అని పేర్కొన్నారు.

### దేశభక్తి ఉన్న లోకేష్ విద్యా మంత్రి కావడం విద్యార్థుల అదృష్టం

"పిల్లల్లో దేశభక్తి, నైతిక విలువలు, చరిత్రపట్ల గౌరవం పెంపొందించాలనే ఉద్దేశంతో "భారతీయం" కార్యక్రమం నిర్వహించాలనే ఆలోచనను మంత్రి నారా లోకేష్ ఇంటికి వెళ్ళి చెప్పగానే, ఆయన వెంటనే స్పందించి కార్యక్రమానికి వస్తానని చెప్పారు. ఆయనతో మాట్లాడి తిరిగి వెళుతుంటే నా కారు వద్దకు వచ్చి పెద్దాయన జాగ్రత్త అని నా కారు డ్రైవర్‌కు చెప్పి మరీ వెళ్ళారు. కార్యక్రమం మొదలు సమయాన్ని చెప్పిన దానికంటే ముందుగానే వచ్చి కార్యక్రమంలో పాల్గొనడం ఆయన దేశం, చరిత్రపట్ల చూపిన ఆసక్తికి నిదర్శనం. ఇటువంటి దేశభక్తి ఉన్న లోకేష్ వంటి నాయకుడు రాష్ట్ర విద్యామంత్రి కావడం విద్యార్థుల అదృష్టం" అని మంత్రి లోకేష్‌ను చాగంటి కోటేశ్వరరావు అభినందించారు.







# విద్యార్థుల్లో స్ఫూర్తినింపిన భారతీయం

## 108 మంత్రాలతో భారతమాతకు పుష్పాంజలి, హారతులు

కాకినాడ రూరల్ (చైతన్య రథం): కాకినాడ జిల్లా తిమ్మాపురంలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలలో ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన 'భారతీయం' కార్యక్రమంలో విద్యా మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదపండితులు మంత్రికి ఆశీర్వచనాలు అందించారు. సత్సంగంలో మంత్రి నారా లోకేష్‌కు చాగంటి కోటేశ్వరరావు వేద ఆశీర్వచనం అందించారు. కంచి కామకోటి పీఠం 68వ పీఠాధిపతి చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామి (కంచి పరమాచార్య) రచించిన 'దేవుని స్వరం' పుస్తకాలను ఈ సందర్భంగా లోకేష్‌కు బహుకరించారు.

అనంతరం సత్సంగం సభ్యులతో మంత్రి ముచ్చటించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికతతో పాటు దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందించే కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత భాగస్వామ్యం కావాల్సిన అవసరాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

### వినూత్నంగా భారతమాతకు హారతులు

కార్యక్రమంలో భారతమాతకు 108 మంత్రాలతో పుష్పాంజలి సమర్పించారు. భారతీయతను ప్రతిబింబించే శబ్దాలను, స్వరాలను మేళవించి 'వందేమాతరం' గీతాలాపనతో వినూత్నంగా భారతమాతకు హారతులు ఇచ్చారు.





### సైనిక సేవలను విద్యార్థులతో పంచుకున్న మాజీ సైనికుడు

కార్యక్రమంలో మాజీ సైనికుడు కిరణ్ కుమార్ భారత సైన్యంలో తాను అందించిన సేవలు, తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. దేశ రక్షణ కోసం ఆయన అందించిన సేవలను అభినంది స్తూ మంత్రి లోకేష్.. కిరణ్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులకు మంత్రి నారా లోకేష్ మెమెంటోలు అందజేసి సత్కరించారు. భారతీయ సంస్కృతి, దేశభక్తి, సేవాభావం, సైనికుల త్యాగాలపట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించేలా 'భారతీయం' కార్యక్రమం కొనసాగింది.


















# మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటాపై దుష్ప్రచారం వద్దు

- క్రీడాకారుల కష్టాన్ని రాజకీయాలకు వాడొద్దు
- 'ఫేక్' సర్టిఫికెట్ల ఆరోపణలు అవాస్తవం.. ఆధారాలతోనే మాట్లాడాలి
- క్రీడా ప్రతిభ, అర్హతల పరిశీలన తర్వాతే నియామకాలు
- అర్హతలపై అనుమానాలుంటే అధికారికంగా విచారణ చేయాలి
- డీఎస్సీ స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల రౌండ్ టేబుల్ సమావేశం

విజయవాడ (చైతన్య రథం): మెగా డీఎస్సీ-2025లో స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు సంబంధించిన అంశాలపై జరుగుతున్న ప్రచారంపై వాస్తవాలను ప్రజలకు వివరించేందుకు స్పోర్ట్స్ కోటా అభ్యర్థులు ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. స్థానిక మొగల్రాజపురంలోని అమ్మ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మెగా డీఎస్సీ-2025కు సంబంధించి వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు, అభ్యర్థుల్లో నెలకొన్న సందేహాలు, స్పోర్ట్స్ కోటా ఎంపిక ప్రక్రియకు సంబంధించిన వాస్తవాలను ఈ సమావేశంలో అభ్యర్థులు వివరించారు. స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశాలను రాజకీయ ఆరోపణలకు వేదికగా మార్చకుండా, వాస్తవాలను ఆధారాలతో ప్రజల ముందుంచాలనే ఉద్దేశంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ సమావేశంలో పలువురు స్పోర్ట్స్ కోటా అభ్యర్థులు, సంబంధిత రంగానికి చెందిన ప్రతినిధులు మాట్లాడారు. మెగా డీఎస్సీ నియామక ప్రక్రియపై తమ అభిప్రాయాలు, ఎదుర్కొన్న పరిస్థితులు, తమకు సంబంధించిన అంశాలపై స్పష్టతను వారు వెల్లడించనున్నారు.

### క్రీడాకారుల కష్టాన్ని రాజకీయాలకు వాడొద్దు : పి. శివారెడ్డి



దేశం, రాష్ట్రం తరపున ఎన్నో ఏళ్లుగా క్రీడల్లో కొనసాగుతూ సాధించిన విజయాలను, క్రీడాకారుల కష్టాన్ని రాజకీయ విమర్శలకు వాడుకోవడం సరికాదని పి. శివారెడ్డి అన్నారు. మన రాష్ట్రం తరపున 40 జాతీయ ఖో-ఖో పోటీల్లో పాల్గొన్నానని, దేశం తరపున జరిగిన ఖో-ఖో పోటీల్లో మూడు సార్లు స్వర్ణ పతకాలు సాధించానని తెలిపారు. కులమతాలకు అతీతంగా అందరినీ ఏకం చేసే క్రీడలను రాజకీయాలకు వేదికగా మార్చవద్దని శివారెడ్డి కోరారు. క్రీడాకారులు తమ జీవితాల్లో ఎన్నో కష్టాలను ఎదుర్కొని, దేశం, రాష్ట్రం కోసం చెమటోడ్చి సాధించిన విజయాలను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. అలాంటి క్రీడాకారులను అవమానించేలా మాట్లాడటం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడాకారుల కష్టాన్ని గుర్తించి కూటమి ప్రభుత్వం మూడు శాతం రిజర్వేషన్ కల్పించడం చారిత్రక నిర్ణయమని శివారెడ్డి పేర్కొన్నారు. ఈ నిర్ణయం కేవలం తమకు మాత్రమే కాకుండా భవిష్యత్ తరాల క్రీడాకారులకు కూడా ఉపయోగపడేలా ఉండాలని ఆకాంక్షించారు. జీవితాలను క్రీడలకే అంకితం చేసిన వారికి ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం సంతోషకరమైన విషయమన్నారు. ప్రభుత్వం తమ కష్టాన్ని గుర్తించి అవకాశం కల్పించిందన్న సంతోషం కూడా లేకుండా తమపై అసత్య ప్రచారాలు చేయడం బాధాకరంగా ఉందన్నారు. తమపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలతో తీవ్ర అవమానానికి గురవుతున్నామని, నిరాధార ఆరోపణల కారణంగా మానసిక క్షోభను అనుభవిస్తున్నామని తెలిపారు. క్రీడాకారుల కష్టాన్ని తేలిక చేసి మాట్లాడటం సరికాదని, వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని శివారెడ్డి కోరారు.

### క్రీడల్లో కష్టపడ్డా.. ప్రభుత్వ ఉద్యోగమూ పొందా.. ఇప్పుడు ఫేక్ అంటారా? : గిడ్ల హర్ష చిన్ని



ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న ఇష్టంతోనే ఎనిమిదేళ్లుగా కానిస్టేబుల్‌గా పనిచేస్తూ వచ్చానని గిడ్ల హర్ష చిన్ని తెలిపారు. చిన్న వయస్సు నుంచే కష్టపడి వివిధస్థాయిల్లో రాష్ట్రం తరపున క్రీడా పోటీల్లో పాల్గొన్నానని చెప్పారు. తనకు గత ప్రభుత్వ హయాంలోనే ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందని హర్ష చిన్ని తెలిపారు. ఇప్పుడు తన క్రీడా అర్హతలను 'ఫేక్' అంటూ ఆరోపణలు చేస్తే.. గత ప్రభుత్వ హయాంలో జరిగిన నియామకం కూడా తప్పేనని భావించాలా? అని ప్రశ్నించారు. తనఅర్హతలు ఫేక్ అని ఆరోపిస్తున్న వారు, గత ప్రభుత్వ హయాంలో తనకు ప్రభుత్వ ఉద్యోగం ఎలా వచ్చిందో కూడా చెప్పాలన్నారు. తాను చిన్న వయస్సు నుంచే క్రీడల్లో కష్టపడి వివిధ స్థాయిల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించానని తెలిపారు. క్రీడాకారుల అర్హతలు, వారి సాధనలను రాజకీయ ఆరోపణలకు ముడిపెట్టడం సరికాదని పేర్కొన్నారు. తమపై వస్తున్న ఆరోపణల వెనుక ఉన్న వాస్తవాలను ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

### కష్టపడి సాధించిన సర్టిఫికెట్లను 'ఫేక్' అనడం సమంజసం కాదు : షైక్ యాసిన్

చిన్ననాటి నుంచి ఎన్నో కష్టాలు ఎదుర్కొని క్రీడల్లో రాణించి సాధించిన సర్టిఫికెట్లను 'ఫేక్' అంటూ ప్రచారం చేయడం ఏమాత్రం సమంజసం కాదని షైక్ యాసిన్ అన్నారు.



ఆంధ్రప్రదేశ్ నుంచి జిమ్నాస్టిక్స్‌లో తొలిసారిగా ప్రాతినిధ్యం వహించానని తెలిపారు. తన తండ్రి దినసరి కూలీగా పనిచేసేవారని, ఆయన కష్టపడితేనే కుటుంబానికి పూట గడిచేదని యాసిన్ తెలిపారు. ఇంటికి దూరంగా ఉంటూ, ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ తినితినక చదువుతో పాటు క్రీడలను సమతుల్యం చేసుకున్నానని చెప్పారు. ఎన్నో ఏళ్లపాటు కష్టపడి జాతీయ స్థాయిలో వివిధ పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించానని తెలిపారు. క్రీడల కోసం చేసిన త్యాగాలు, శ్రమను గుర్తించకుండా తమ సర్టిఫికెట్లను ఫేక్ అంటూ ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. తమపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలతో తీవ్ర అవమానానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

### కేంద్ర ప్రభుత్వమే గుర్తించిన సర్టిఫికెట్లను 'ఫేక్' అనడం దుర్మార్గం : అట్ల శివనాగిరెడ్డి



ఆసియా ఖో-ఖో ఛాంపియన్ షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన క్రీడాకారుడినని, చిన్న వయసు నుంచే పసిడి పతకం కోసం ఎంతో శ్రమించానని అట్ల శివనాగిరెడ్డి తెలిపారు. తాను సాధించిన స్వర్ణ పతకం ఆధారంగానే ఇండియన్ రైల్వేస్‌లో ఉద్యోగం వచ్చిందని శివనాగిరెడ్డి చెప్పారు. అదే క్రీడా ప్రతిభతో ఆదాయ పన్ను శాఖ, తపాలా శాఖల్లోనూ ఉద్యోగ అవకాశాలు లభించాయని తెలిపారు. తన క్రీడా ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం మూడు శాఖల్లో ఉద్యోగాలకు తనను ఎంపిక చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వమే గుర్తించి ఉద్యోగ అవకాశాలు కల్పించిన తన క్రీడా సర్టిఫికెట్లను ఇప్పుడు 'ఫేక్' అంటూ ఆరోపించడం దుర్మార్గమని శివనాగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లపాటు కష్టపడి, రక్తం ధారపోసి పతకాలు సాధించిన నిజమైన క్రీడాకారులను అవమానిస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. క్రీడాకారుల శ్రమ, ప్రతిభను గౌరవించాలని కోరారు.

- (మిగతా వివరాలు 8లో)

# మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటాపై దుష్ప్రచారం వద్దు




*(7వ పేజీ తరువాయి)*

### ఒకే కుటుంబంలో ఇద్దరికి ప్రభుత్వ ఉద్యోగాలు రాకూడదని ఎక్కడైనా నిబంధన ఉందా? : చిల్లా యోగేశ్వరరావు

ఒకే కుటుంబంలో ఇద్దరు ప్రతిభతో ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడంలో తప్పేముందని చిల్లా యోగేశ్వరరావు ప్రశ్నించారు. ఒకే కుటుంబంలో ఇద్దరికి ప్రభుత్వ ఉద్యోగాలు రాకూడదని ఎక్కడైనా నిబంధన ఉందా? అని నిలదీశారు. పేద వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన తాము ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని, రాత్రింబవళ్లు శ్రమించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించామని యోగేశ్వరరావు తెలిపారు. సొంతంగా కష్టపడి ప్రభుత్వ ఉద్యోగం సాధించిన వారికే ఆ శ్రమ, త్యాగం విలువ తెలుస్తుందన్నారు. పత్రికలు, యూట్యూబ్ ఛానళ్లలో తమపై ఇష్టానుసారంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత ఉద్యోగం సాధించామన్న ఆనందాన్ని కూడా ఆస్వాదించకుండా నిత్యం తమపై బురదజల్లుతున్నారని అన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా చేస్తున్న ఈ అసత్య ప్రచారాలకు అడ్డుఅదుపు లేకుండా పోయిందని పేర్కొన్నారు. క్రీడాకారుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే పనిగా పెట్టుకున్న వారు ముందుగా వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని యోగేశ్వరరావు సూచించారు. ఒకే ఇంట్లో ఇద్దరు తమ ప్రతిభతో ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైతే గర్వించాల్సింది పోయి, తమను క్షోభకు గురిచేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు.



### 1994 నుంచి అహర్నిశలు శ్రమిస్తేనే ఆ స్వర్ణ పతకం సాధించాను : సత్యవాణి బలుసు

రాష్ట్రం తరపున ఖో-ఖోలో స్వర్ణ పతకం సాధించిన తొలి మహిళా క్రీడాకారిణిని తానేనని సత్యవాణి బలుసు తెలిపారు. 32వ జాతీయ క్రీడల్లో పాల్గొని ప్రతిభ చాటానని చెప్పారు. 1994 నుంచి అహర్నిశలు శ్రమించిన ఫలితంగానే తనకు స్వర్ణ పతకం దక్కిందని సత్యవాణి తెలిపారు. ఎన్నో ఏళ్ల నిరంతర శ్రమ, త్యాగాల ఫలితంగానే ఆ పతకాన్ని సాధించానన్నారు. తన క్రీడా జీవితంలో 30 సార్లు జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించానని చెప్పారు. ఆ రోజుల్లో క్రీడా పోటీలకు వెళ్లేందుకు రైళ్లలో సరైన సౌకర్యాలు కూడా ఉండేవి కావని,బాత్రూంల దగ్గరే పడుకుని ఎన్నో వ్యయప్రయాసలతో ప్రయాణించేవాళ్లమని సత్యవాణి గుర్తుచేశారు. క్రీడల్లో రాణించేందుకు ఎదురైన కష్టాలను వివరించారు. 'ఆడపిల్లకు ఆటలు ఎందుకు?' అంటూ సమాజం వేసిన ఎన్నో నిష్టూరాలు, ప్రశ్నలను తన తల్లిదండ్రులు తట్టుకుని తనను ప్రోత్సహించారని సత్యవాణి తెలిపారు. క్రీడాకారులు సాధించిన విజయాల వెనుక ఎన్నో ఏళ్ల శ్రమ, కుటుంబ సభ్యుల త్యాగం ఉంటుందని చెప్పారు. ఆ త్యాగాల వెనుక ఉన్న అసలైన వాస్తవాలను తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని కోరారు.



### కష్టపడి సాధించిన క్రీడా సర్టిఫికెట్లతోనే ఉద్యోగం వచ్చింది : మంగ

బాక్సింగ్‌ను చూసి స్ఫూర్తి పొంది, 2004 నుంచి వివిధ పోటీల్లో ఎంతో ఆసక్తితో పాల్గొంటూ వచ్చానని మంగ తెలిపారు. గెలుపు వచ్చినా, ఓటమి ఎదురైనా వెనకడుగు వేయకుండా క్రీడల్లో కొనసాగానని చెప్పారు. చుట్టుపక్కల వారు 'ఆడపిల్లకు బాక్సింగ్ ఎందుకు?' అంటూ ప్రశ్నించేవారని, అయినప్పటికీ మనోధైర్యంతో ముందుకు సాగానని మంగ తెలిపారు. ఎన్నో ఏళ్లపాటు కష్టపడి సాధించిన క్రీడా సర్టిఫికెట్ల ఆధారంగా కూటమి ప్రభుత్వం తనకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించి కొత్త జీవితాన్ని అందించిందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించేందుకు తాను ఎంతో కష్టపడ్డానని మంగ తెలిపారు. గతంలో ప్రతిపక్ష నాయకులు డీఎస్సీ నిర్వహిస్తామని హామీలు ఇచ్చి మాటలకే పరిమితమయ్యారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం హామీ ఇవ్వడంతో పాటు దానిని అమలు చేసి చూపించిందని అన్నారు. క్రీడాకారులపై వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను ఇకనైనా మానుకోవాలని మంగ కోరారు. క్రీడాకారులు ఎన్నో ఏళ్లుగా పడిన కష్టాన్ని, సాధించిన విజయాలను గౌరవించాలని సూచించారు.



### జగన్ ప్రభుత్వమే ఇచ్చిన సర్టిఫికెట్‌ను ఇప్పుడు 'ఫేక్' అంటారా? : మాల్యాద్రి

తన తండ్రి ప్రభుత్వ ఉద్యోగి అని, అలాంటి పరిస్థితుల్లో తాను డబ్బులు ఇచ్చి ఉద్యోగం కొనుగోలు చేస్తే అది తన తండ్రి ఉద్యోగానికే మచ్చ తెచ్చినట్లవుతుందని మాల్యాద్రి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగం అంటే అంగట్లో దొరికే వస్తువు కాదని, ఎవరు పడితే వారు డబ్బులు ఇచ్చి కొనుక్కుని వెళ్లేందుకు అవకాశం ఉండదని వ్యాఖ్యానించారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే తాను ఉపాధ్యాయ అర్హత పరీక్ష రాసి 105 మార్కులు సాధించానని మాల్యాద్రి తెలిపారు. అయినప్పటికీ తాను ఉపాధ్యాయ అర్హత పరీక్ష రాయకుండానే స్పోర్ట్స్ కోటా ఉద్యోగం కొనుగోలు చేశానంటూ ప్రచారం చేయడం వాస్తవాలకు విరుద్ధమన్నారు. తనకు సంబంధించిన ధ్రువపత్రాలన్నింటినీ పరిశీలించిన తర్వాతే నియామక ప్రక్రియ జరిగిందని తెలిపారు. అయినప్పటికీ స్పష్టత లేకుండా పదేపదే తమపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాల్ బ్యాడ్మింటన్‌లో తాను పాల్గొన్న పోటీలకు సంబంధించిన ధ్రువపత్రాన్ని 2022లో అప్పటి జగన్‌రెడ్డి ప్రభుత్వమే జారీ చేసిందని మాల్యాద్రి తెలిపారు. అప్పటి ప్రభుత్వమే జారీ చేసిన ధ్రువపత్రాలను ఇప్పుడు 'ఫేక్' అంటూ ఆరోపించడం ఎంతవరకు సమంజసమో ఆరోపణలు చేస్తున్నవారే ఆలోచించుకోవాలని అన్నారు.



### అర్హతలపై అధికారికంగా విచారణ చేయండి.. అసత్య ప్రచారాలు వద్దు : గాయత్రి

తన స్పోర్ట్స్ కోటా నియామకంపై తప్పుడు ప్రచారం చేస్తే ఇంతగా బాధపడేదాన్ని కాదని, అయితే తాను బీఈడీ, ఉపాధ్యాయ అర్హత పరీక్షల్లో అర్హత సాధించలేదంటూ ప్రచారం చేయడం బాధాకరంగా ఉందని గాయత్రి అన్నారు. తన ధ్రువపత్రాలన్నింటినీ విజయవాడ బెంజిసర్కిల్ వద్ద పరిశీలన చేయించుకున్న తర్వాతే కళాశాలలో చేరి, ప్రతిరోజూ కళాశాలకు వెళ్లి చదువుకున్నానని గాయత్రి తెలిపారు. కళాశాలకు వెళ్లకుండా పరీక్షలు రాసి పొందిన చదువులు తనవి కావని స్పష్టం చేశారు. తాను రాసిన ప్రతి పరీక్షలోనూ ప్రథమ శ్రేణి మార్కులతో ఉత్తీర్ణత సాధించానని చెప్పారు. 2018లో జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్షలో కేవలం 0.4 మార్కుల తేడాతో అర్హత సాధించలేకపోయానని గాయత్రి తెలిపారు. అయినప్పటికీ తన విద్యార్హతలు, క్రీడా అర్హతలపై నిరాధార ప్రచారం చేయడం సరికాదన్నారు. తాను సాధించిన ప్రభుత్వ ఉద్యోగం తన ఆత్మగౌరవానికి, తన తల్లిదండ్రుల గౌరవానికి సంబంధించిన అంశమని గాయత్రి పేర్కొన్నారు. తనను 'ఫేక్' అంటూ ప్రచారం చేస్తున్న వారు అధికారికంగా విచారణ చేసే సంబంధిత అధికారుల వద్దకు వచ్చి తమ ఆరోపణలను నిరూపించుకోవచ్చని అన్నారు. అయితే ఎవరు పడితే వారు ఫోన్ చేసి ఇష్టానుసారంగా మాట్లాడటం, తనను ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నం చేయడం మాత్రం సహించబోనని గాయత్రి స్పష్టం చేశారు. ఆరోపణలు ఉంటే అధికారిక మార్గంలో ఆధారాలతో ముందుకు రావాలని సూచించారు.



### స్పోర్ట్స్ కోటా ఉద్యోగాలపై దుష్ప్రచారం మానుకోవాలి : రవికుమార్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష లేకుండానే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు ఇచ్చారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని రవికుమార్ తెలిపారు. ఉపాధ్యాయ ఉద్యోగానికి అవసరమైన అర్హతలు లేకుండా ఉద్యోగాలు పొందడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. 2018 నుంచి వివిధ ప్రభుత్వ శాఖల్లో క్రీడా కోటా నియామకాలు జరుగుతున్నాయని రవికుమార్ తెలిపారు. గతంలోనూ ఇదే విధానంలో నియామకాలు జరిగాయని, ఇప్పుడు జరుగుతున్న ప్రచారం ప్రకారం అప్పట్లోనూ నియామకాలు అక్రమంగానే జరిగాయా? అని ప్రశ్నించారు. తాము కుటుంబాలకు దూరంగా ఉంటూ ఎన్నో కష్టాలు పడి చదువుకుని అర్హతలు సాధించామని రవికుమార్ చెప్పారు. తమ విజయాల వెనుక కుటుంబ సభ్యుల సహకారం, ప్రోత్సాహం కూడా ఉందన్నారు. ఎన్నో ఏళ్ల శ్రమ తర్వాత ఉద్యోగం సాధించామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన మెగా డీఎస్సీ-2025లో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోలేదని రవి కుమార్ తెలిపారు. నియామక ప్రక్రియపై ఆరోపణలు చేసే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని కోరారు. రాజకీయ లబ్ధి కోసం క్రీడాకారులపై బురదజల్లే కార్యక్రమాలను వైసీపీ నాయకులు ఇకనైనా మానుకోవాలని రవికుమార్ సూచించారు.



- (మిగతా వివరాలు 9లో)

చైతన్యరథం

# పీఎంఏవై-యూ కింద కొండపి నియోజకవర్గానికి 229 ఇళ్లు

- త్వరలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు
- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



తూర్పు నాయుడుపాలెం (చైతన్య రథం): ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ మథకం కింద కొండపి నియోజకవర్గానికి మంజూరైన ఇళ్ల లబ్ధిదారులకు త్వరలో మంజూరు పత్రాలు అందజేయాలని సాంఘిక సంక్షేమ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం తూర్పు నాయుడుపాలెం క్యాంప్ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ పథకం కింద కొండపి నియోజకవర్గానికి మంజూరైన 229 ఇళ్ల లబ్ధిదారులకు త్వరలో మంజూరు పత్రాలు అందజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ అనుమతి అనంతరం కొండపి నియోజకవర్గానికి మరో 140 ఇల్లు మంజూరు అవుతాయని మంత్రి తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ పథకం కింద ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.1.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష.. మొత్తం రూ.2.5 లక్షలు సబ్సిడీ కింద అందజేస్తాయని తెలిపారు. ఇంటి నిర్మాణంలో భాగంగా వీజీబీరామ్ జీ పథకం కింద 90 పని దినాలకు వేతనరూపంలో రూ.27 వేలు, స్వచ్ఛభారత్ నిధుల కింద మరో రూ.12 వేలు లబ్ధిదారులకు అదనంగా వస్తాయని తెలిపారు. పేదలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు.

# గజ వాహనంపై అభయమిచ్చిన శ్రీ మలయప్పస్వామి



తిరుమల (చైతన్య రథం): కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆరో రోజైన ఆదివారం రాత్రి శ్రీ మలయప్ప స్వామివారు గజ వాహనంపై భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. వాహనం ముందు గజరాజులు గంభీరంగా నడుస్తుండగా.. మంగళ వాయిద్యాల నడుమ, భక్తజనుల గోవింద నామస్మరణతో తిరుమాడ వీధులు భక్తిపారవశ్యంతో మార్మోగాయి. భక్తబృందాలు భజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తూ ఆధ్యాత్మిక సందడి నెలకొల్పాయి. జీయ్యంగార్ల ప్రబంధ పారాయణంతో వాహనసేవ మరింత వైభవంగా సాగింది. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ శ్రీ మలయప్ప స్వామివారిని దర్శించుకుని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఈ వాహన సేవలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, తితిదే ఈవో ముద్దాడ రవిచంద్ర, పలువురు బోర్డు సభ్యులు, అదనపు ఈవో సీహెచ్. వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్వీబీసీ చైర్మన్ శ్రీధర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటాపై దుష్ప్రచారం వద్దు

(8వ పేజీ తరువాయి)



### నా సర్టిఫికెట్లు ఫేక్ అయితే.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఎలా వచ్చాయి? : ఎం. జగదీష్



చిన్ననాటి నుంచే జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు వివిధ క్రీడా పోటీల్లో పాల్గొని ఎన్నో పతకాలు సాధించానని ఎం.జగదీష్ తెలిపారు. తన క్రీడా ప్రతిభ ఆధారంగా తపాలా శాఖలో ఐదుసార్లు ఉద్యోగానికి ఎంపికయ్యానని చెప్పారు.తన క్రీడా ధ్రువపత్రాలు ఫేక్ అయితే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు తాను ఎలా ఎంపికయ్యానో చెప్పాలని జగదీష్ ప్రశ్నించారు. ఇప్పటివరకు 32 సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నానని, తనలాంటి మరో పది మంది క్రీడాకారులను తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్‌బాల్ జట్టుకు ఐదుసార్లు కెప్టెన్‌గా వ్యవహరించిన తనను ఫేక్ అంటూ ఆరోపించడం దుర్మార్గమన్నారు. తన క్రీడా ధ్రువపత్రాల ఆధారంగానే 2018–19లో జాతీయ క్రీడా సంస్థ డిప్లొమాలో సీటు లభించిందని జగదీష్ తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తమపై నిరాధార ఆరోపణలు చేస్తూ బురదజల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాక్షేత్రంలో ఉన్నవారు ఏదైనా మాట్లాడే ముందు వాస్తవాలను తెలుసుకుంటే మంచిదని సూచించారు.

### 25 ఏళ్ల కష్టానికి 3 శాతం రిజర్వేషన్‌తో ఉద్యోగ అవకాశం : శ్వేతా



2005లో తొలిసారిగా మహిళల ఆసియా కబడ్డీ ఛాంపియన్‌షిప్ గెలిచిన ఆంధ్రప్రదేశ్ జట్టులో తాను సభ్యురాలినని శ్వేతా తెలిపారు. ఒక ప్రభుత్వ ఉద్యోగం సాధించడానికి తనకు 25 ఏళ్లు పట్టిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అమలు చేసిన మూడు శాతం క్రీడా రిజర్వేషన్ వల్లే తనకు ఉద్యోగం పొందే అవకాశం దక్కిందని శ్వేతా తెలిపారు. ఎన్నో ఏళ్లుగా కష్టపడిన తమలాంటి నిజమైన క్రీడాకారులను 'ఫేక్' అంటూ ఆరోపించడం ఏమాత్రం న్యాయం కాదన్నారు. కబడ్డీ సమాఖ్య నుంచి అధికారిక ధ్రువీకరణ పత్రం పొందిన తర్వాతే తనను ఎంపిక చేశారని తెలిపారు. సమాఖ్య నుంచి వచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఉద్యోగానికి ఎంపిక చేశారంటే.. మెగా డీఎస్సీ నియామక ప్రక్రియ ఎంతటి పరిశీలనతో, పారదర్శకంగా జరిగిందో అర్థం చేసుకోవచ్చని శ్వేతా పేర్కొన్నారు. క్రీడాకారుల అర్హతలను, వారి సంవత్సరాల కష్టాన్ని గౌరవించాలని కోరారు.

### నా కంటే తక్కువ స్థాయి పోటీల్లో ఆడిన తమ్ముడి సర్టిఫికెట్ నాకెందుకు? : పెద్ద అప్పలరాజు

బాక్సింగ్‌లో తాను సాధించిన పతకాలతో శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా సుపరిచితుడినని పెద్ద అప్పలరాజు తెలిపారు. తనపై చేస్తున్న అసత్య ప్రచారాలతో రాష్ట్రవ్యాప్తంగా పరువు తీసే ప్రయత్నం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వేరొకరి క్రీడా ధ్రువపత్రాన్ని సమర్పించి ఉద్యోగం పొందానంటూ తనపై పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని అప్పలరాజు ఆరోపించారు. తాను అసలైన బాక్సింగ్ క్రీడాకారుడినని నిరూపించుకుంటున్నప్పటికీ పదేపదే కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు.



చిన్ననాటి నుంచి చెమటోడ్చి క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించిన తమకు నకిలీ ధ్రువపత్రాలు పెట్టుకోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. తన కంటే చిన్న స్థాయి పోటీల్లో పాల్గొన్న తన తమ్ముడి ధ్రువపత్రంతో తాను ఉద్యోగం పొందాల్సిన అవసరం ఏముంటుందని నిలదీశారు. తమ క్రీడా జీవితాన్ని ఇలా మీడియా వేదికలపైకి వచ్చి నిరూపించుకోవాల్సిన పరిస్థితి రావడం అత్యంత బాధాకరమని అప్పలరాజు అన్నారు. తమకు ఆటలు మాత్రమే తెలుసని, రాజకీయాలు తెలియవని పేర్కొన్నారు. క్రీడాకారులపై ఆరోపణలు చేసే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని కోరారు.

### అవమానాలను అధిగమించి.. దేశ గౌరవాన్ని పెంచాను : బలగ గణేష్



ఆర్థిక పరిస్థితులు సరిగా లేక 1999లో కూలీ పనుల కోసం విజయవాడకు వలస వచ్చిన నిరుపేద కుటుంబం తమదని పారా స్విమ్మర్ బలగ గణేష్ తెలిపారు. 2006 నుంచి ఈతనే తన జీవితంగా భావించి కష్టపడుతున్నానని చెప్పారు. 2025లో భారత్ నుంచి శ్రీలంక వరకు ఈది దేశంలోనే 'ఫాస్టెస్ట్ పారా స్విమ్మర్'గా రికార్డు నెలకొల్పానని గణేష్ తెలిపారు. అత్యంత శీతల వాతావరణంలో ఇంగ్లండ్ నుంచి ఫ్రాన్స్ వరకు ఇంగ్లీష్ ఛానల్‌ను విజయవంతంగా ఈదినట్లు చెప్పారు. దేశంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికైన తొలి పారా స్విమ్మర్‌గా నిలిచానన్నారు. మూడు సార్లు ఉపాధ్యాయ అర్హత పరీక్షలోనూ ఉత్తీర్ణత సాధించానని తెలిపారు. గతంలో 'కుంటివాడివి.. నీకు ఆటలు ఎందుకు?' అంటూ ఎన్నో అవమానాలు, ఈసడింపులు ఎదుర్కొన్నానని గణేష్ ఆవేదన వ్యక్తం చేశారు. వాటన్నింటినీ అధిగమించి అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి దేశ గౌరవాన్ని పెంచానన్నారు. ఇన్ని విజయాలు సాధించిన తనలాంటి పారా క్రీడాకారుడిని అవమానించేలా మాట్లాడటం బాధాకరమని పేర్కొన్నారు. పారా క్రీడాకారుల కష్టాన్ని గుర్తించి కూటమి ప్రభుత్వం ప్రతి అడుగులోనూ అండగా నిలిచిందని గణేష్ తెలిపారు. తన కష్టకాలంలో అండగా నిలిచి ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. క్రీడాకారుల విజయాల వెనుక ఉన్న కష్టం, త్యాగాలను గుర్తించాలని కోరారు.

### ఒకే కుటుంబంలో ఇద్దరు క్రీడాకారులైతే తప్పేంటి? : చిల్లా మోహినీ దేవి



అత్యంత నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన తాను పట్టువదలకుండా మూడుసార్లు ఉపాధ్యాయ అర్హత పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించానని చిల్లా మోహినీ దేవి తెలిపారు. ఎన్నో కష్టాలను ఎదుర్కొని క్రీడల్లోనూ, చదువులోనూ ముందుకు సాగామని చెప్పారు. అన్నాచెల్లెళ్లు కలిసి ఒకే క్రీడను ఆడకూడదా? కలిసి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగకూడదా? అని మోహినీ దేవి ప్రశ్నించారు. తాము తోబుట్టువులుగా కష్టపడి దేశానికి, రాష్ట్రానికి పతకాలు సాధించకూడదని ఏ రాజ్యాంగంలో రాశారని నిలదీశారు. ఒకే కుటుంబం నుంచి ఇద్దరు ప్రతిభ కనబరిస్తే అభినందించాల్సింది పోయి అనుమానించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకోకుండా కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం తమపై నిరాధార విమర్శలు చేస్తున్నారని మోహినీ దేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఆధారాలు లేకుండా క్రీడాకారుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా తప్పుడు ప్రచారం చేస్తున్న వారికి ఆ హక్కు ఏమిటని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి తాము పడిన కష్టం, తమ కుటుంబాలు చేసిన త్యాగాలను వేలెత్తి చూపించే నైతిక హక్కు ఎవరికీ లేదన్నారు. రక్తం ధారపోసి సాధించిన విజయాలను రాజకీయాలకు ముడిపెట్టి తమ జీవితాలతో ఆడుకోవద్దని మోహినీ దేవి కోరారు.

# విషపూరిత మద్యంతో ప్రజా ప్రాణాలు బలిగొన్న జగన్

- రూ.3,200 కోట్ల మద్యం కుంభకోణంపై సమాధానం చెప్పాలి
- సత్యప్రసాద్ వెల్లడించిన అంశాలపై జగన్ ఎందుకు స్పందించరు?
- డిజిటల్ చెల్లింపులు తొలగించి నగదు లావాదేవీలు ఎందుకు పెంచారు?
- కూటమి ప్రభుత్వంలో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం
- గృహ నిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి

మంగళగిరి (చైతన్య రథం): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన మద్యం విధానం ద్వారా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమే కాకుండా వేల కోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడ్డారని గృహ నిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి ఆరోపించారు. మద్యం కుంభకోణానికి సంబంధించి దర్యాప్తులో కీలక అంశాలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో గొడ్డలి పార్టీ అధ్యక్షులు జగన్‌రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి కొలుసు మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవస్థలను అనుకూలంగా మార్చుకుని పాలన సాగించారని పార్థసారథి ఆరోపించారు. శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థలు సమన్వయంతో పనిచేయాల్సి ఉండగా, అధికారులను ఒత్తిడికి గురిచేసి తమకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకునేలా చేశారని విమర్శించారు.



### రూ.3,200 కోట్ల ముడుపుల ఆరోపణలపై స్పందించాలి

మద్యం పాలసీలో సుమారు రూ. 3,200 కోట్ల ముడుపులు వసూలైనట్లు రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఓఎస్డీ సత్యప్రసాద్ కోర్టులో ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నట్టు వార్తా కథనాలు వెల్లడిస్తున్నాయని మంత్రి తెలిపారు. తాడేపల్లిలోని అప్పటి ముఖ్యమంత్రి నివాసంలో మద్యం విధానానికి సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు సత్యప్రసాద్ వాంగ్మూలంలో చెప్పినట్లు వార్తలు వచ్చాయని పేర్కొన్నారు. తనకు అనుకూలంగా ఉన్న సమయంలో సత్యప్రసాద్ ఆరోగ్యంగా ఉన్నారని, ఇప్పుడు మద్యం వ్యవహారంలోని వాస్తవాలను వెల్లడిస్తుండటంతో ఆయన మానసిక పరిస్థితిపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారని మంత్రి ఆరోపించారు. నిజాలు బయటపెడుతున్న వ్యక్తులపై ముద్ర వేసి అసలు అంశాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు.

### డిజిటల్ చెల్లింపులపై ప్రశ్నలు

మద్యం విక్రయాల్లో డిజిటల్ చెల్లింపులను ఎందుకు పక్కన పెట్టారో అప్పట్లోనే ప్రశ్నలు తలెత్తాయని పార్థసారథి అన్నారు. భారీ మొత్తంలో నగదు లావాదేవీలు ఎందుకు జరిగాయనే అంశంపై సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త బ్రాండ్ల ప్రవేశం, ఆర్డర్ల కేటాయింపు విధానంలో మార్పులవంటి అంశాలపైనా దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయని తెలిపారు. సత్యప్రసాద్ వాంగ్మూలంలో మద్యం ఆర్డర్ల కేటాయింపులో ఉన్న విధానాన్ని మార్చి మాన్యువల్ విధానం అమలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయని వార్తలు వెల్లడించాయని మంత్రి కొలుసు ప్రస్తావించారు.

### రవాణా వ్యవహారంపైనా ఆరోపణలు

మద్యం రవాణా కాంట్రాక్టులను జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయికి కేంద్రీకరించడంపైనా మంత్రి ప్రశ్నలు లేవనెత్తారు. రవాణా రేట్ల పెంపు ద్వారా అవినీతికి అవకాశం కల్పించారని ఆరోపించారు. మద్యం దుకాణాల్లో సిబ్బంది నియామకాలు, జీతాల చెల్లింపుల వ్యవహారంలోనూ అక్రమాలు జరిగాయని విమర్శించారు. మద్యం వ్యవహారానికి సంబంధించిన ఇతర ఆరోపణలపైనా దర్యాప్తు కొనసాగుతున్నట్టు వార్తా కథనాలు పేర్కొంటున్నాయి.

### ప్రజల ఆరోగ్యంపై బాధ్యత ఉండాలి

2019 ఎన్నికలకు ముందు సంపూర్ణ మద్య నిషేధం అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకొచ్చిన మద్యం విధానంపై ప్రజలు ఆలోచించాలని పార్థసారథి అన్నారు. నాసిరకం, కల్తీ మద్యం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురయ్యారనే ఆరోపణలు ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం విధానాన్ని మార్చలేదని విమర్శించారు.

### కూటమి ప్రభుత్వంలో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం

ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం విక్రయాల్లో పారదర్శకత, నాణ్యతకు ప్రాధాన్యమిస్తోందని మంత్రి తెలిపారు. మద్యం దుకాణాల కేటాయింపులో పారదర్శక విధానాలను అమలు చేస్తున్నామని, గౌడ సామాజిక వర్గానికి 10శాతం దుకాణాలను కేటాయించే విధానాన్ని అమలు చేశామన్నారు. మద్యం నాణ్యతపై వివిధ దశల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని, కల్తీ మద్యాన్ని అరికట్టేందుకు 'ఏపీ ఎక్సైజ్ సురక్ష' మొబైల్ అనువర్తనం తీసుకొచ్చామని తెలిపారు. మద్యం నాణ్యతను నిర్ధారించేందుకు 13 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 2026-27 ఎక్సైజ్ విధానంలో మద్యం విక్రయాలను మరింత పర్యవేక్షించేందుకు డిజిటల్ విధానాలు, దుకాణాల్లో సీసీ కెమెరాలు, నిబంధనల ఉల్లంఘనలపై జరిమానాలువంటి చర్యలను ప్రభుత్వం ప్రకటించినట్టు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. మద్యం విధానానికి సంబంధించిన ఆరోపణలు, దర్యాప్తులో వెలుగుచూస్తున్న అంశాలపై జగన్‌రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని పార్థసారథి డిమాండ్ చేశారు.

---

# పేదల ఆరోగ్య సంరక్షణే కూటమి ప్రథమ ప్రాధాన్యత

- రూ.1.9 కోట్లమేర సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీల పంపిణీ
- పీ-4 విధానంతో పేదరిక నిర్మూలనకు ముఖ్యమంత్రి కృషి
- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి వెల్లడి

టంగుటూరు (చైతన్య రథం): ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పు నాయుడు పాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాంఘిక సంక్షేమ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు మరియు ఎల్‌ఓసీలను లబ్ధిదారులకు అందచేశారు. ఈ పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మంత్రి లబ్ధిదారుల ఆరోగ్య స్థితిగతులు, క్షేమ సమాచారాలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మంత్రి డోలా మాట్లాడుతూ... రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి అత్యుత్తమ వైద్య సేవలు అందించి ప్రాణాలకు భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన సంకల్పమని స్పష్టం చేశారు. ఆర్థిక ఇబ్బందులవల్ల ఏ నిరుపేద కుటుంబం కూడా వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం పెద్దఎత్తున సీఎంఆర్ఎఫ్ నిధులను మంజూరు చేస్తోందని కొనియాడారు. ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రుల్లో చేరిన బాధితులకు తక్షణ అత్యవసర చికిత్సల కోసం ఎల్‌ఓసీలు జారీ చేస్తూ, శస్త్ర చికిత్సల అనంతరం ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల రూపంలో నిధులు అందజేస్తూ ప్రభుత్వం కంటికి రెప్పలా కాపాడుకుంటోందని మంత్రి వెల్లడించారు. ప్రజారోగ్య రంగంలో ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక 'సంజీవని' ప్రాజెక్ట్ గురించి మంత్రి సమగ్రంగా వివరించారు. రాష్ట్రంలోని ప్రతీ పౌరుడికి ఆభా డిజిటల్ హెల్త్ ఐడీలను కేటాయించి, వారి సమగ్ర వైద్య సమాచారాన్ని భద్రపరచడం ద్వారా ముందస్తు రోగ నిర్ధారణ, నివారణ మరియు నాణ్యమైన చికిత్స సేవలను అందిస్తున్నామని తెలిపారు.

సంజీవని వ్యవస్థ ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల ఇంటి వద్దకే ఉచిత ల్యాబ్ పరీక్షలు, ఇ-ఔషధి ద్వారా నాణ్యమైన మందుల పంపిణీ, స్పెషలిస్ట్ వైద్యుల టెలి-కన్సల్టేషన్ సేవలు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. దీనికితోడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పన, ఉచితంగా మందుల సరఫరా మరియు ఎన్టీఆర్ ఆరోగ్య సేవ పథకం ద్వారా ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం ఉచిత శస్త్రచికిత్సలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. ఈ విడత సీఎంఆర్ఎఫ్ సాయంలో భాగంగా కొండపి నియోజకవర్గానికి గత సెప్టెంబర్ 17న రూ. 1.93 కోట్లు మంజూరయ్యాయని మంత్రి వెల్లడించారు. దీనిద్వారా మొత్తం 359 మంది లబ్ధిదారులకు లబ్ధి చేకూరిందని, అందులో అత్యవసర వైద్యం కోసం 21 మందికి ఎల్‌ఓసీలు, అలాగే 338 మంది బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా కొండపి నియోజకవర్గ చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుండి ఇప్పటివరకు రికార్డు స్థాయిలో మొత్తం 2,560 మంది నిరుపేద బాధితులకు రూ. 19.98 కోట్ల విలువైన ఉచిత వైద్య సహాయాన్ని అందించామని మంత్రి వెల్లడించారు. ఇందులో 324 మందికి ఎల్‌ఓసీల ద్వారా ఆసుపత్రుల్లో ప్రాణాపాయ స్థితిలో తక్షణ చికిత్స అందించగా, 2,236 మందికి చెక్కుల రూపంలో ఆర్థిక సాయం అందించామని తెలియజేశారు.

రాష్ట్రంలో పేదరికాన్ని శాశ్వతంగా నిర్మూలించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు పీ-4 నమూనాను అమల్లోకి తీసుకొచ్చారని మంత్రి బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే కాకుండా, ప్రజల శ్రేయస్సు కోసం చెప్పని అనేక సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ పాలనలో పూర్తిగా నిర్వీర్యమై, అభివృద్ధిలో వెనుకబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నేడు అభివృద్ధి, సంక్షేమ రంగాలలో సీఎం చంద్రబాబు నాయుడు వేగంగా పరుగులు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యానికి, సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలందరి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మంత్రి డోలా ఆకాంక్షించారు.



చైతన్యరథం

# రోగుల కష్టాన్ని చూసి చలించిన మంత్రి

- సాలూరు 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రిని మంత్రి సంధ్యారాణి ఆకస్మిక తనిఖీ
- ఒక్కో మంచంపై ఇద్దరు రోగులను చూసి ఆవేదన
- స్వర్గీయ తండ్రిపేరిట 10 మంచాలు ఏర్పాటు చేస్తానని హామీ
- మంత్రి నిర్ణయంతో ముందుకొచ్చిన దాతలు
- పేదల ఆరోగ్య రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి: మంత్రి సంధ్యారాణి



సాలూరు (చైతన్య రథం): సాలూరు 100 పడకల ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను మంత్రి స్వయంగా పరిశీలించారు. వివిధ వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడి.. వారికి అందుతున్న వైద్యం, మందులు, ఇతర సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి తనిఖీల సందర్భంగా ఒక్కో మంచంపై ఇద్దరు రోగులు చికిత్స పొందుతున్న పరిస్థితిని చూసి మంత్రి ఆవేదనకు గురయ్యారు. రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్య మంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన పీ-4 విధానంలో భాగంగా, తన తండ్రి స్వర్గీయ జన్ని ముత్యాలు పేరిట సాలూరు ప్రాంతీయ ఆసుపత్రికి 10 మంచాలు విరాళంగా అందిస్తానని మంత్రి సంధ్యారాణి ప్రకటించారు. మంత్రి ప్రకటనకు స్పందిస్తూ పలువురు దాతలు ముందుకు వచ్చారు. ఇందుపూరి నారాయణ రావు 10 మంచాలు, మాజీ మార్కెటింగ్ చైర్మన్ కేతిరెడ్డి చంద్రరావు 5 మంచాలు అందించేందుకు ముందుకు వచ్చారు. అలాగే సాలూరు ప్రాంతానికి చెందిన వైద్యులు డాక్టర్ గణేశ్వరరావు ప్రాణదాత ట్రస్ట్ ద్వారా 10 మంచాలు అందించేందుకు ముందుకు వచ్చారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు దాతలు చూపిన చొరవకు మంత్రి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రజారోగ్య రక్షణలో అగ్రస్థానంలో నిలవాలి

ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉత్తమ పనితీరు కనబరచాలని మంత్రి సంధ్యారాణి వైద్యారోగ్యశాఖ అధికారులు,వైద్యులు, సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా పేదల ఆరోగ్య రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీల్లో వైద్యసేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని, వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, దిగువస్థాయి సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు అవసరమైన వైద్యసేవలు వేగంగా, నాణ్యంగా అందేలా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

### గర్భిణిలు, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

గర్భిణిలు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులకు అందిస్తున్న ప్రభుత్వ వైద్యసేవల్లో నాణ్యత, వేగాన్ని మరింత పెంచాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా గర్భిణిల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి సమగ్ర వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ చూపాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన సమగ్ర వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. హెచ్‌ఐవీతోపాటు దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పాముకాటు, కుక్కకాటు ఘటనల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తక్షణ వైద్యసేవలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం మరింత పెరిగేలా వైద్యారోగ్యశాఖ పనిచేయాలని మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు.

## ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ గ్లోబల్ సిటీస్ ఇండెక్స్‌లో నెల్లూరుకు గుర్తింపు

**- నెల్లూరు జిల్లాకు గుర్తింపుతో మంత్రి నారాయణ అభినందనలు**

నెల్లూరు (చైతన్య రథం): ప్రపంచంలోని 163 దేశాలకు చెందిన 1,000 నగరాలను సమగ్రంగా విశ్లేషించిన ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ గ్లోబల్ సిటీస్ ఇండెక్స్-2026లో నెల్లూరు నగరం గుర్తింపు పొందడంపట్ల రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి మంత్రి పి. నారాయణ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని నగరాల్లో నెల్లూరు జిల్లాకు స్థానం సాధించడం జిల్లాకు గర్వకారణమని ఆదివారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు, అధికారులకు మంత్రి అభినందనలు తెలిపారు. ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ గ్లోబల్ సిటీస్ ఇండెక్స్-2026లో ఏపీకి చెందిన నగరాల ర్యాంకులను పరిశీలిస్తే, గుంటూరు 739వ ర్యాంకు, విశాఖపట్నం 755వ ర్యాంకు, నెల్లూరు 893వ ర్యాంకు, విజయవాడ 932వ ర్యాంకు సాధించాయి. ఈ ర్యాంకింగ్‌లో నగరాలను ప్రధానంగా ఐదు అంశాల ఆధారంగా విశ్లేషించారు. నెల్లూరు నగరానికి ఆయా విభాగాల్లో నమోదైన ర్యాంకులు క్రింది విధంగా ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థ- 787వ ర్యాంకు, మానవ



మూలధనం -997వ ర్యాంకు, జీవన నాణ్యత -815వ ర్యాంకు, పర్యావరణం -636వ ర్యాంకు, పాలన -415వ ర్యాంకు. ఈ నేపథ్యంలో ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ గ్లోబల్ సిటీస్ ఇండెక్స్-2026లో ఆంధ్రప్రదేశ్‌లో నెల్లూరు నగరానికి స్థానం లభించడంపై మంత్రి నారాయణ అభినందించారు. నగర ఆర్థిక వ్యవస్థ పరిమాణం, భవిష్యత్ ఆర్థిక వృద్ధి, ఉపాధి అవకాశాలు, ఆర్థిక వైవిధ్యం, జనాభా ధోరణులు, విద్యా సంస్థలు, కార్పొరేట్ కార్యకలాపాలు, వ్యక్తి ఆదాయం, జీవన ప్రమాణాలు, గాలి నాణ్యత, పర్యావరణ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాల ముప్పు, రాజకీయ స్థిరత్వంవంటి అనేక అంశాలను సూచికలో పరిగణనలోకి తీసుకుంటారు.

నెల్లూరు నగరానికి లభించిన ఈ గుర్తింపు నగర అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, పారిశ్రామిక మరియు ఆర్థిక కార్యకలాపాల విస్తరణ, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించే దిశగా జరుగుతున్న కృషికి మరింత ప్రోత్సాహాన్నిస్తుందని మంత్రి నారాయణ పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నెల్లూరు నగరాన్ని ఆధునిక, సుస్థిర మరియు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ గుర్తింపు స్ఫూర్తితో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రపంచ స్థాయి నగరాల సరసన నెల్లూరు నగరానికి లభించిన ఈ గుర్తింపు జిల్లా అభివృద్ధికి కొత్త ఉత్సాహాన్ని అందిస్తుందని మంత్రి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## విశాల్‌గున్ని, కాంతిరాణా టాటాలకు పోస్టింగ్

### ఏపీలో 9మంది ఐపీఎస్‌ల బదిలీ

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో 9మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ డీజీపీ హరీశకుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీఎఫ్ డీజీగా ఉన్న సీహెచ్ త్రివిక్రమ వర్మకు ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఏసీబీ డైరెక్టర్‌గా ఉన్న జయలక్ష్మి.. సీఐడీ సైబర్ క్రైమ్స్ ఐజీగా బదిలీ అయ్యారు. ఏపీఎస్పీ బెటాలియన్స్ ఐజీగా ఉన్న బి రాజకుమారి రైల్వే ఐజీగా నియామకమయ్యారు. సీఐడీ ఉమెన్ సేఫ్టీ ఐజీగా రాజకుమారికి అదనపు బాధ్యతలు కల్పించారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న కాంతి రాణా టాటాకు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ సేఫ్టీ ఐజీగా పోస్టింగ్



ఇచ్చారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న విశాల్ గున్నికి ట్రైనింగ్ డీఐజీగా పోస్టింగ్ కల్పించారు. గ్రేహౌండ్స్ డీఐజీగా ఉన్న బాబూజీ అట్టాడ..టెక్నికల్ సర్వీసెస్ డీఐజీగా బదిలీచేశారు.పోలవరం ఓఎస్డీగా ఉన్న



పంకజ్ కుమార్ మీనా మార్కాపురం జిల్లా ఎస్పీగా, సీఎంఎస్ ఎస్పీగా ఉన్న జగదీశ్ అదహళ్లి పల్నాడు జిల్లా ఎస్పీగా బదిలీ అయ్యారు. సీఐడీ ఎస్పీ కె.చక్రవర్తి పోలవరం జిల్లా ఎస్పీగా బదిలీ అయ్యారు.

## స్వర్ణకాంతుల్లో శ్రీ వేంకటాద్రిశుని దివ్య విహారం




- గోవిందనామస్మరణతో మార్మోగిన తిరుమాడ వీధులు
- భక్తిపారవశ్యంలో స్వర్ణరథాన్ని లాగిన మహిళలు
- శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వర్ణరథంపై శ్రీ మలయప్పస్వామి

తిరుమల (చైతన్య రథం): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన ఆదివారం సాయంత్రం స్వర్ణరథోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగింది. సాయంత్రం 4 గంటలకు శ్రీ మలయప్పస్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వర్ణరథంపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్యదర్శనమిచ్చి అనుగ్రహించారు.

### కన్నులపండువగా స్వర్ణరథోత్సవం

మంగళవాయిద్యాల నడుమ స్వర్ణ రథోత్సవం కన్నులపండువగా సాగింది. స్వామివారి దర్శనం కోసం తిరుమాడ వీధులకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు“గోవిందా..గోవిందా..” అంటూ గోవిందనామస్మరణతో భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. స్వర్ణకాంతులతో మెరిసిన రథంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీ మలయప్పస్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకున్న భక్తులు పులకించిపోయారు.

### భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగిన మహిళలు

స్వర్ణరథోత్సవంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రథాన్ని భక్తిశ్రద్ధలతో లాగారు. మహిళల భక్తి, గోవిందనామస్మరణ,మంగళవాయిద్యాలనడుమ స్వర్ణ రథం తిరుమాడ వీధుల్లో ముందుకు సాగడం ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

### శ్రీవారి స్వర్ణరథానికి ఆధ్యాత్మిక విశిష్టత

శ్రీవారి స్వర్ణరథోత్సవానికి ఆధ్యాత్మికంగా విశిష్టస్థానంఉంది. శ్రీదేవిసంపదకు, భూదేవి సమస్త ధాన్యసంపదకు ప్రతీకలుగా భావిస్తారు. శ్రీదేవి,భూదేవి సమేతంగా శ్రీ మలయప్పస్వామివారు స్వర్ణ రథంపై విహరించడం స్వామివారి వైభవం, సార్వభౌమత్వానికి ప్రతీకగా భక్తులు విశ్వసిస్తారు.స్వర్ణ రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో దర్శించుకోవడం ద్వారా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి అనుగ్రహంతో సకల శుభాలు, సుఖసంతోషాలు,ఐశ్వర్యం, ధాన్య సమృద్ధి కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈస్వర్ణ రథోత్సవంలో టీటీడీ ఈవో ముద్దాడ రవి చంద్ర,అదనపు ఈవో సిహెచ్ వెంకయ్యచౌదరి, టీటీడీ బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్లా, ఎస్వీబీసీ చైర్మన్ శ్రీధర్ వర్మ, పలువురు బోర్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# కొత్తమ్మతల్లి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- భక్తులకు అసౌకర్యం లేకుండా సకల సదుపాయాలు
- అధికారులతో త్వరలో ప్రత్యేక సమావేశం: మంత్రి అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి (చైతన్య రథం): ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే దిశగా నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రజలనుంచి రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వినతులు స్వీకరించారు. టెక్కలి నియోజకవర్గంలోని నాలుగు మండలాలతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు స్థానిక నాయకులతో కలిసి క్యాంపు కార్యాలయానికి చేరుకుని తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని పరిశీలించిన మంత్రి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కొత్తమ్మతల్లి ఉత్సవాల నిర్వహణపై ఉత్సవ కమిటీ సభ్యులతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, గతంలోకంటే మరింత విస్తృతంగా, పకడ్బందీ ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.

### భక్తులకు మెరుగైన సౌకర్యాలు

ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, విద్యుత్ వెలుగులు, పార్కింగ్, రవాణా, వైద్య శిబిరాలు, అత్యవసర వైద్య సేవలు, పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని మంత్రి సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రవేశ,నిష్క్రమణ మార్గాలు, క్యూ లైన్లు, వాహనాల పార్కింగ్ ప్రాంతాలను సమర్థవంతంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. అదేవిధంగా భక్తులకు అవసరమైన సమాచారం అందించేందుకు ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు, మహిళలు, వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### మూడు రోజులపాటు వైభవంగా ఉత్సవాలు

అక్టోబరు 13, 14, 15 తేదీల్లో మూడు రోజుల పాటు కొత్తమ్మతల్లి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని మంత్రి తెలిపారు. ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం ఇస్తూనే స్థానిక సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను రూపొందించాలని చెప్పారు. ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద కళారూపాలు, స్థానిక కళాకారుల ప్రదర్శనలు, సంగీత కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు యువతను ప్రోత్సహించే విధంగా వివిధ క్రీడా పోటీలు నిర్వహించాలని సూచించారు. పిల్లలు, యువత, మహిళలు పాల్గొనేలా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించాలని కమిటీ సభ్యులకు తెలిపారు.

### త్వరలో జిల్లాస్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం

ఉత్సవాల నిర్వహణకు సంబంధించి త్వరలోనే జిల్లాస్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి శాఖల వారీగా బాధ్యతలు అప్పగించి, సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. భక్తుల రద్దీ, భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు, విద్యుత్, రహదారులు, పార్కింగ్, ట్రాఫిక్ తదితర అంశాలపై ముందస్తు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేస్తామన్నారు. కొత్తమ్మతల్లి ఉత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించడంతో పాటు, ప్రాంతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచేలా అన్ని శాఖలు, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



---

## క్యాన్సర్‌కు జన్యు పరీక్షలు..

# ఏపీలో కొత్త అధ్యాయం

- గుంటూరు నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో రూ.2.5 కోట్లతో ప్రయోగశాల
- తొలిదశలో రొమ్ము, ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు పరీక్షలు
- రెండేళ్లలో 2 వేల నమూనాల పరీక్ష.. రోగులకు ఉచితంగా సేవలు
- 22న వైద్య మంత్రి సత్యకుమార్ చేతులమీదుగా ప్రారంభం

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా క్యాన్సర్ రోగులకు అధునాతన జన్యు పరీక్షలు అందుబాటులోకి రానున్నాయి. గుంటూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో 2 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.2.5 కోట్ల పెట్టుబడితో ప్రత్యేక జన్యు పరీక్షల ప్రయోగశాలను ఏర్పాటు చేస్తున్నారు. అవసరమైన పరికరాలు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. తొలిదశలో రొమ్ము, ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగులకు పరీక్షలు నిర్వహించనున్నారు. క్యాన్సర్ రోగులనుంచి సేకరించిన నమూనాలను పరీక్షించి కణాల్లోని జన్యు మార్పులను గుర్తిస్తారు. వాటి ఆధారంగా రోగికి ఎలాంటి చికిత్స అవసరమో వైద్యులు నిర్ణయించేందుకు వీలవుతుంది. రోగ నిర్ధారణ నుంచి చికిత్స, తదుపరి పర్యవేక్షణ వరకు ఈ విధానాన్ని ఉపయోగించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆస్ట్రాజెనెకా, స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్ సంస్థల భాగస్వామ్యంతో చేపడుతున్నారు. గుంటూరు నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఏర్పాటు చేస్తున్న ప్రయోగశాలను ఈ నెల 22న వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించనున్నారు.

ప్రస్తుతం సూక్ష్మస్థాయి జన్యు మార్పుల పరీక్షల కోసం కొందరు రోగుల నమూనాలను బెంగళూరు, ముంబయి వంటి నగరాలకు పంపించాల్సి వస్తోందని, ఈ ఇబ్బందిని తొలగించి రాష్ట్రంలోనే అధునాతన పరీక్షలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని మంత్రి తెలిపారు. జన్యు పరీక్షలను రోగులకు ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. బయట ప్రైవేటు కేంద్రాల్లో ఒక్కో పరీక్షకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు, పూర్తి స్థాయి పరీక్షలకు రూ.75 వేల వరకు ఖర్చవుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న ఈ సదుపాయం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో వైద్య రంగంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు.

### రెండేళ్లలో 2 వేల నమూనాల పరీక్ష

గుంటూరు సర్వజన ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న ప్రయోగశాలను స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్ సంస్థ సాంకేతిక సహకారంతో అభివృద్ధి చేయనుంది. రెండేళ్లలో సుమారు 2 వేల నమూనాలను పరీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆస్ట్రాజెనెకా సంస్థ 1,000 మంది రొమ్ము క్యాన్సర్, 1,000 మంది ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగులకు నిర్వహించే జన్యు పరీక్షల ఖర్చును భరిస్తుంది.

### జన్యు మార్పుల ఆధారంగా మందులు

రొమ్ము క్యాన్సర్‌లో బీఆర్‌సీఏ1, బీఆర్‌సీఏ2 తదితర జన్యు మార్పులను, ఊపిరితిత్తుల క్యాన్సర్‌లో ఈజీఎఫ్ఆర్, కేఆర్ఏఎస్, ఎన్ఆర్ఏఎస్, బీఆర్ఏఎఫ్ తదితర మార్పులను పరిశీలిస్తారు. పరీక్షల్లో గుర్తించిన జన్యు మార్పులను బట్టి రోగికి అనుగుణమైన ప్రత్యేక మందుల ఎంపికకు వీలవుతుంది.



### అమరావతి క్వాంటం వ్యాలీలో పూర్తి స్థాయి కేంద్రం

గుంటూరులోని ప్రయోగాత్మక ప్రయోగశాల తర్వాత అమరావతి క్వాంటం వ్యాలీలో పూర్తి స్థాయి జన్యు పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అధిక సంఖ్యలో పరీక్షలు నిర్వహించేలా దీనిని రాష్ట్రస్థాయి కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు. రాష్ట్ర జన్యు సమాచార వ్యవస్థతోనూ అనుసంధానించనున్నారు.

### కృత్రిమ మేధతో జన్యు సమాచార విశ్లేషణ

జన్యు సమాచారం, కృత్రిమ మేధ, ఆధునిక వైద్య పరిశోధనలను అనుసంధానించడం దీర్ఘకాలిక లక్ష్యంగా పేర్కొన్నారు. సేకరించే సమాచారాన్ని భవిష్యత్తులో వ్యక్తికి అనుగుణమైన చికిత్సలు, వైద్య పరిశోధనలు, ఆధునిక ఔషధాల అభివృద్ధికి ఉపయోగించనున్నారు.

### 14 రకాల క్యాన్సర్లను ముందుగానే గుర్తించే దిశగా

భవిష్యత్తులో రక్తంలో కనిపించే కొన్ని మార్పులను గుర్తించడం ద్వారా 14 రకాల క్యాన్సర్లను ముందుగానే గుర్తించే పరీక్షను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. దీనిని పెద్ద సంఖ్యలో ప్రజలకు పరీక్షలు నిర్వహించే స్థాయికి తీసుకెళ్లే అవకాశం ఉంది. రాష్ట్రస్థాయిలో జన్యు సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన కూడా ఉంది. ఆరోగ్యవంతులు, అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వారి జన్యు సమాచారాన్ని సేకరించి భద్రపరచనున్నారు. భవిష్యత్తులో వ్యాధులపై పరిశోధనలు, కొత్త పరీక్షలు, మెరుగైన చికిత్స విధానాల రూపకల్పనకు ఈ సమాచారాన్ని ఉపయోగించనున్నారు.

### రెండేళ్లలో 60 వేల ఛాతీ ఎక్స్‌రేల పరిశీలన

క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించే విధానాన్ని ప్రాజెక్టులో భాగంగా బలోపేతం చేయనున్నారు. రొమ్ము క్యాన్సర్‌కు రొమ్ము పరీక్షా పరికరాలను, ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ఛాతీ ఎక్స్‌రేలను ఉపయోగిస్తారు. ఊపిరితిత్తుల చిత్రాల్లో అనుమానిత మార్పులను కృత్రిమ మేధతో గుర్తిస్తారు. రెండేళ్లలో 60 వేల వరకు ఛాతీ ఎక్స్‌రేలను ఈ విధానంలో పరిశీలించేలా ప్రణాళిక రూపొందించారు. వైద్య విద్య సంచాలకులు ఏ. విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. గుంటూరు సర్వజన ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న జన్యు పరీక్షల ప్రయోగశాల ప్రయోగాత్మక ప్రాజెక్టులో భాగమని తెలిపారు. తొలిదశలో రొమ్ము, ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగులకు పరీక్షలు నిర్వహిస్తామని, క్యాన్సర్ కణాల్లోని జన్యు మార్పులను గుర్తించడం ద్వారా వైద్యులు తగిన చికిత్సను నిర్ణయించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు.

# సీఎం నాయకత్వంలో అభివృద్ధి పథంలో ఏపీ

- అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వైకాపా నుంచి టీడీపీలోకి 28 కుటుంబాలు చేరిక
- మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో జగన్నాథపురం నుంచి భారీ చేరికలు



కోటబొమ్మాళి (చైతన్య రథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రెండేళ్లపాలనలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వైకాపాను వీడి టీడీపీలో చేరుతున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సంతబొమ్మాళి మండలం జగన్నాథపురం పంచాయతీకి చెందిన 28 కుటుంబాలు వైకాపాను వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వ పాలనలో జరుగుతున్న మార్పులు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా గమనించిన ప్రజలు టీడీపీ వైపు వస్తున్నారని అన్నారు. జగన్నాథపురం మాజీ సర్పంచ్ పుక్కళ్ల శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షుడు మెండ అప్పారావు ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. కార్యక్రమంలో సంతబొమ్మాళి మండల టీడీపీ అధ్యక్షుడు సుగ్గు శాంతిస్వరూప్‌రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ టీడీపీ కుటుంబంలోకి చేరిన 28 కుటుంబాలకు స్వాగతం పలికారు. "పార్టీలో చేరిన ప్రతి కుటుంబానికి అండగా ఉంటాం. ఎలాంటి సమస్య వచ్చినా మీకు భరోసాగా నిలుస్తాం. పార్టీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా పనిచేద్దాం" అని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, పేదలు, వృద్ధులకు వివిధ సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రయోజనం కల్పించడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి వైకాపాను వీడి టీడీపీలో చేరుతున్నామని పార్టీలోకి వచ్చిన 28 కుటుంబాల ప్రతినిధులు తెలిపారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

మంత్రి అచ్చెన్న సమక్షంలో అర్జాల బాలరాజు, అర్జాల అప్పలస్వామి, అర్జాల శివ, కోడ గురుమూర్తి, కోడ ధనరాజు, అడ్ల దాలయ్య, చోడిపల్లి మునలయ్య, చోడిపల్లి ధర్మారావు, పి. రామ్మూర్తి, గనగల్ల గురమ్మ, పుక్కళ్ల పొల్లమ్మ, కె. అప్పలస్వామి, భగవాన్ దాస్ చోడిపల్లి, కొడా గురుమూర్తి, అడ్ల లక్ష్మణరావు, కొమర రామారావు, మైలపల్లి లక్ష్మణరావు, ముట్టు లక్ష్మణరావు, అనుపల్లి కామేశ్వరరావు, చోడిపల్లి రమారావు, సాహుకారి వెంకటరావు, అనుపల్లి కామరాజు, లండ సీతారాములు, చోడిపల్లి యర్రయ్య, కె. మునలయ్య, నైనమ్మ గంట, వరది సత్యం, ఎం. నాయనమ్మ తెలుగుదేశం పార్టీలో చేరారు.

## దూండి గణేష్‌ను దర్శించుకున్న హోమ్‌మంత్రి అనిత



- పర్యావరణహిత గణపతి విగ్రహం స్ఫూర్తిదాయకం
- విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన కల్పించాలి

విజయవాడ (చైతన్య రథం): విజయవాడ సితార గ్రౌండ్స్‌లో కొలువుదీరిన ప్రపంచంలోనే ఎత్తైన పర్యావరణహిత గణేశ విగ్రహంగా వరల్డ్ రికార్డు సాధించిన 'దూండి గణేష్ మహా మట్టి గణపతి'ని రాష్ట్ర హోమ్‌మంత్రి వంగలపూడి అనిత ఆదివారం దర్శించుకున్నారు. దూండి గణేష్ సేవా సమితి ఫౌండర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్, సమితి సభ్యులు హోమ్‌మంత్రికి సాదర స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. ప్రపంచంలోనే ఎత్తైన పర్యావరణహిత గణేశ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన దూండి రాకేష్, కమిటీ సభ్యులను అభినందించారు. పర్యావరణానికి ఎటువంటి హాని కలిగించని విధంగా రూపొందించిన మట్టి గణపతిని ప్రతి విద్యార్థి దర్శించేలా చేసి, వారిలో పర్యావరణపరిరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. దూండి గణేష్‌ను దర్శించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పాఠశాల యాజమాన్యాలు తమసొంత బస్సులు, వ్యాన్లలో విద్యార్థులను ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో తీసుకువస్తున్నాయని నిర్వాహకులు తెలిపారు. గణపతిని దర్శించేందుకు వచ్చే ప్రతి విద్యార్థికి పెన్నులు, నోట్ పుస్తకాలు అందజేస్తున్నట్లు చెప్పారు.



**ఘనంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు**

ఉదయం 7.30 గంటలకు ప్రత్యేక పూజ, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు భవానీపురం మహిళల ఆధ్వర్యంలో శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఆదిత్య హృదయం పారాయణం జరిగింది. సాయంత్రం 6 గంటల నుంచి విద్యార్థినులచే భరత నాట్యం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు 11 సార్లు లింగాష్టకం పారాయణం నిర్వహించారు. రాత్రి 9 గంటలకు పండితులచే స్వామివారికి ప్రత్యేక నవహారతులు నిర్వహించారు. వాటి విశిష్టతను పారేపల్లి దీప్తి భక్తులకు వివరించారు. కార్యక్రమంలో దూండి గణేష్ సేవా సమితి కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్, తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి దూండి రాకేష్, కొత్త ముక్తేశ్వరరావు,దరిశి వెంకట సుబ్బారావు, పేర్ల వెంకట రవికుమార్, ఆలపాటి సత్యనారాయణరావు, సామ చైతన్య, నంబూరి నాగేశ్వరరావు, వక్కలగడ్డ పవన్ కుమార్, సి.ఎల్. అరుణ్ కుమార్, ఆత్మకూరు శ్రీవాసరావు, కొల్లూరు లక్ష్మణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

### రాజకీయాల్లో ప్రజాసేవ, నిబద్ధతతోపాటు

## ఓర్పు చాలా అవసరం

- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



- వర్ల రామయ్య, కుమార్ రాజాలకు ఘన సత్కారం..
- ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

పిడుగురాళ్ల (చైతన్య రథం): తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, శాసనమండలి సభ్యులు వర్ల రామయ్య, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాకు శుభాకాంక్షలు తెలుపుతూ గురజాల ఎమ్మెల్యే ఎరపతినేని శ్రీనివాసరావు పిడుగురాళ్ల మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన అభినందన సన్మాన సభకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ లావు మాట్లాడుతూ.. వర్ల రామయ్య తన కెరీర్‌లో పదేళ్ళ సర్వీస్ మిగిలి ఉండగానే పోలీస్ ఉద్యోగానికి రాజీనామా చేసి, అప్పటి సీఎం పిలుపు మేరకు రాజకీయాల్లోకి వచ్చారని గుర్తుచేశారు. నిరంతరం ప్రజలతో మమేకమవుతూ, పార్టీ కోసం శ్రమించే నాయకులను తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని, ముందుకు తీసుకెళ్తుందని చెప్పడానికి రామయ్యే నిదర్శనమన్నారు.

**రాజకీయాల్లో ప్రజాసేవ, నిబద్ధతతోపాటు ఓర్పు అవసరం**

రాజకీయాల్లో ఆశించే యువతకు, నాయకులకు "ఓర్పు, క్రమశిక్షణ" చాలా అవసరమని ఎంపీ పిలుపునిచ్చారు. 1999లో ఉద్యోగానికి రాజీనామా చేసిన రామయ్య ఎమ్మెల్సీ అయ్యేందుకు 2026 వరకు ఓర్పుతో పార్టీకి సేవ చేశారని, వారి కుమారుడు కుమార్ రాజా కూడా క్రమశిక్షణతో పనిచేసి ఎమ్మెల్యేగా గెలిచారని తెలిపారు. తొందరపాటు లేకుండా నిలకడగా ఉండేవారికే రాజకీయాల్లో భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు. అభినందన సభను అత్యంత ఘనంగా ఏర్పాటు చేసిన గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావుకి, హాజరైన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు, రామయ్య కుటుంబ సభ్యులకు ఎంపీ లావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యాదాత కొల్లి యిల్లయ్య మాస్టర్ విగ్రహావిష్కరణ

## పాల్గొన్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి




నరసన్నపేట (చైతన్యరథం): కోమర్తి గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాల ఆవరణలో సరస్వతి దేవి విగ్రహం, ప్రముఖ ఉపాధ్యాయులు దివంగత కొల్లి యిల్లయ్య మాస్టర్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, నరసన్నపేట శాసనసభ్యుడు బగ్గు రమణమూర్తి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బగ్గు అర్చన హాజరై విగ్రహాలను ఆవిష్కరించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ పాఠశాల పిల్లల భవిష్యత్తు, వారి అభ్యున్నతే తన జీవిత పరమావధిగా భావించి సేవ చేసిన కొల్లి యిల్లయ్య మాస్టార్ అందరికీ ఆదర్శప్రాయులు. విద్యార్థులకు జ్ఞానాన్ని అందించే సరస్వతి దేవి విగ్రహాన్ని, విద్యను అందించిన గురువు విగ్రహాన్ని ఒకే ప్రాంగణంలో ఆవిష్కరించుకోవడం అభినందనీయమని కొనియాడారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని యిల్లయ్య మాస్టార్ లాంటి మహనీయుల ఆశయాలను నేటి తరం ఉపాధ్యాయులు, విద్యార్థులు ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ?టిడిపి కార్యనిర్వహక కార్యదర్శి బగ్గు అర్చన మాట్లాడుతూ విద్యా రంగానికి, పాఠశాలల మౌలిక వసతుల కల్పనకు తమ వంతు సహాయ సహకారాలు నిరంతరం ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామ ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన మత్స్యకార మార్కెటింగ్ సొసైటీల సభ్యులు

కోటబొమ్మాళి (చైతన్యరథం): నియోజకవర్గంలో కొత్తగా ఏర్పాటు చేసిన నాలుగు నూతన ఇన్‌లాండ్ మార్కెటింగ్ మత్స్యకార సొసైటీల సభ్యులు నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. కోటబొమ్మాళి మండలం కన్నెవలస పంచాయతీ పరిధిలోని చుట్టిగుండం, సంతబొమ్మాళి మండలం నరసాపురం, పెద్దతుంగం, వడ్డీతాండ్ర ప్రాంతాలకు చెందిన సొసైటీ సభ్యులు మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు

# మంత్రి కొండపల్లి సమక్షంలో భారీ చేరికలు

గజపతినగరం (చైతన్యరథం): గజపతినగరం మండలం పురిటిపెంట గ్రామానికి చెందిన 50 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరడం సంతోషంగా ఉంది. గజపతినగరం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించినట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీ వైపు అడుగులు వేస్తున్నారన్నారు. టీడీపీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, ప్రాధాన్యత కల్పిస్తూ నియోజకవర్గ అభివృద్ధి కోసం అందరినీ కలుపుకుని ముందుకు సాగుతామని వెల్లడించారు.




# గిన్నిస్ బుక్ హోల్డర్ గంటా జిష్ణు ప్రతిభ

విశాఖపట్నం (చైతన్యరథం): గిన్నిస్ రికార్డు హోల్డర్, భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు మనవడు 9 ఏళ్ల గంటా జిష్ణు ఆర్యన్ ఆక్స్‌ఫర్డ్ టెడ్ ఎక్స్ ఒన్స్ వేదికపై తొలి ప్రసంగం చేసి చిన్న వయసులో అరుదైన ఖ్యాతి దక్కించుకున్నాడు. గోల్డెన్ రేషియోలోని 216 దశాంశ స్థానాలను కేవలం నిమిషంలోపు చెప్పిన జిష్ణు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ టైటిల్ సాధించిన విషయం తెలిసిందే. తాజాగా అంతర్జాతీయ వేదికపై తన ఆలోచనలను పంచుకుని అబ్బురపరిచాడు. ఫుట్ బాల్‌పై ఆసక్తిని ప్రస్తావిస్తూ.. తన భవిష్యత్ తానే నిర్దేశించుకుంటానని పేర్కొన్నాడు. జీవితంలో గెలుపు ఓటములకు.. భయాలకు కుంగిపోకుండా ముందుకు సాగాలని స్ఫూర్తిమంతమైన ప్రసంగం చేశాడు. ఆత్మవిశ్వాసం, పట్టుదల గురించి చిన్న వయసులోనే మాట్లాడడం అందర్నీ ఆకర్షించింది. జిష్ణు తల్లిదండ్రులు గంటా రవితేజ, శరణి పొంగూరు నారాయణ గ్రూప్ డైరెక్టర్లుగా ఉన్నారు.





# 'సంజీవని'తో డోలీ మోతలకు చెల్లుచీటీ

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు డాక్టర్ కొండారెడ్డి నరహరి వరప్రసాద్

అమరావతి (చైతన్యరథం): మారుమూల గిరిజన ప్రాంతాల్లో అత్యవసర వైద్యం కోసం రోగులను డోలీలపై మోసుకెళ్లాల్సిన పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రహదారులు, రవాణా, వైద్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు డా. కొండారెడ్డి నరహరి వరప్రసాద్ అన్నారు. గిరిజన ప్రాంతాలకు రహదారి సౌకర్యం, అత్యవసర వైద్య రవాణా, ఆరోగ్య కేంద్రాలు అందుబాటులోకి వస్తే డోలీలపై ఆధారపడే పరిస్థితులను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ దిశగా 'సంజీవని' వంటి కార్యక్రమాలు అత్యవసర వైద్య సేవలను మారుమూల ప్రాంతాలకు చేరువ చేయడంలో కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

"గిరిజన ప్రాంతాల్లో ఒక కుటుంబానికి అత్యవసర వైద్యం అవసరమైనప్పుడు ఆసుపత్రి దూరం ఒక్కటే సమస్య కాదు. రోగిని ఎంత వేగంగా ఆసుపత్రికి తరలించగలమన్నదే ప్రాణాలను కాపాడటంలో కీలకం. అందుకే రహదారి, అంబులెన్స్, వైద్య కేంద్రం, ఈ మూడు వ్యవస్థలు సమన్వయంతో పనిచేయాలి" అని డా. నరహరి వరప్రసాద్ అన్నారు. 2014- 19 మధ్య కాలంలో లోకేష్ బాబు పంచాయతీ, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి గా కొన్ని వేల కిలోమీటర్ల రోడ్లు వేశారని అన్నారు.

### మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి

2019--24 మధ్య గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, రహదారులు, వైద్య సేవల పరిస్థితి అత్యంత దారుణంగా తయారయ్యాయని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గిరిజన ప్రాంతాల అభివృద్ధిలో రహదారి కనెక్టివిటీ, ఆరోగ్య సేవలు, విద్య, తాగునీరు వంటి ప్రాథమిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. "గిరిజనుల జీవన ప్రమాణాలను పెంచాలంటే గ్రామానికి రహదారి, విద్యార్థికి నాణ్యమైన విద్య, రోగికి సకాలంలో వైద్యం, అత్యవసర సమయంలో అంబులెన్స్ చేరుకునే రవాణా వ్యవస్థ అవసరం. అభివృద్ధి అంటే కేవలం భవనాలు నిర్మించడం కాదు.. అత్యవసర సమయంలో ప్రజలకు సేవలు ఎంత వేగంగా అందుతున్నాయన్నదే అసలు కొలమానం" అని ఆయన పేర్కొన్నారు.

### ఆరోగ్య మౌలిక వసతుల లోటుపాట్లు కాగ్ నివేదికలోనూ బట్టబయలు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారోగ్య మౌలిక సదుపాయాలు, వైద్య సేవలపై కాగ్ నిర్వహించిన పనితీరు ఆడిట్‌లో నిధులు, మౌలిక వసతులు, మానవ వనరులు, మందులు, పరికరాలు, అత్యవసర వైద్య సేవలను పరిశీలించింది. అలాగే 2021, 22లో ట్రైబల్ సబ్ ప్లాన్ కు సంబంధించిన రూ.129.58 కోట్ల కేంద్ర వాటా ల్యాప్స్ అయినట్లు కాగ్ నివేదికలో నమోదైంది. గిరిజన సంక్షేమానికి కేటాయించిన నిధులను సకాలంలో, పూర్తిస్థాయిలో వినియోగించడంపై మరింత కఠినమైన పర్యవేక్షణ అవసరమని డా. నరహరి వరప్రసాద్ అన్నారు. కాగ్ ప్రజారోగ్య ఆడిట్ ప్రకారం గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అవసరమైన పీ. హెచ్. సీ లతో పోలిస్తే కొరత కూడా నమోదైంది. ఈ నేపథ్యంలో మారుమూల ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. "గిరిజనుల కోసం కేటాయించిన ప్రతి రూపాయి వారికే చేరాలి. నిధులు అందుబాటులో ఉండి కూడా సకాలంలో వినియోగించకపోతే చివరికి నష్టపోయేది గిరిజన కుటుంబాలే. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా పారదర్శకత, పర్యవేక్షణతో నిధుల వినియోగం జరగాలి" అని ఆయన అన్నారు.

### హెల్త్ వాలంటీర్ల వ్యవస్థ బలోపేతం

మారుమూల గిరిజన గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య సేవలను మరింత చేరువ చేసేందుకు హెల్త్ వాలంటీర్ల వంటి వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. వైద్య సిబ్బంది కొరత, అత్యవసర రవాణా సమస్యలు, ఆరోగ్య కేంద్రాలకు దూరం వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా సమగ్ర ప్రణాళికతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. ప్రతి గిరిజన కుటుంబానికి అవసరమైన సమయంలో ప్రాథమిక వైద్యం, అత్యవసర రవాణా అందేలా వ్యవస్థను రూపొందించాలన్నారు.

### డోలీ నుంచి అంబులెన్స్ వరకు..

గత వైసీపీ ప్రభుత్వం గిరిజనులను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసింది. వారి ప్రాథమిక హక్కులైన రహదారి, వైద్యం, విద్య, తాగునీటిపై గత ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. ఐదేళ్ల పాలనలో పరిష్కరించాల్సిన సమస్యలను అలాగే వదిలేయడం వల్లే నేడు అనేక ప్రాంతాల్లో డోలీలపై రోగులను తరలించే దుస్థితి కనిపిస్తోందని నరహరి ప్రసాద్ వైసీపీ పాలనను దుయ్యబట్టారు. "గిరిజన ప్రాంతాల అభివృద్ధిని ప్రకటనలతో కాకుండా ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పుతో కొలవాలి. గర్భిణిని సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్లగలుగుతున్నామా ? ప్రమాద బాధితుడికి వెంటనే అంబులెన్స్ అందుతున్నదా? విద్యార్థి రహదారి సౌకర్యంతో పాఠశాలకు చేరుతున్నాడా? ప్రతి గ్రామానికి అన్ని కాలాల్లో రహదారి ఉందా? అనే ప్రశ్నలకు సమాధానం రావాలి. డోలీ నుంచి అంబులెన్స్ దిశగా గిరిజన ప్రాంతాలను తీసుకెళ్లడం, ప్రతి గ్రామానికి రహదారి కల్పించడం, ప్రతి కుటుంబానికి అందుబాటులో ఆరోగ్య సేవలు అందించడం, ఇదే నిజమైన గిరిజన అభివృద్ధికి కొలమానం. ఆ దిశగా చంద్రబాబు నాయుడి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం గణనీయమైన ప్రగతి సాధిస్తోందని అన్నారు. గతంలో మిగిలిపోయిన మౌలిక వసతుల లోటుపాట్లను సరిదిద్దుతూ గిరిజన ప్రాంతాలకు శాశ్వత పరిష్కారాలు చూపాల్సిన అవసరం ఉంది" అని అన్నారు.

జోన్ - 2 (కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)

చైతన్యరథం

# మహిళలను కించపరిచే కిరాతక గొడ్డలి పార్టీ నేతలను నిలదీయండి



## పాలకొల్లు అభివృద్ధికి కష్టపడి నిధులు తీసుకొస్తున్నా ... ఒకే రోజు రూ 3.79 కోట్లతో 31 పనులకు మంత్రి నిమ్మల

పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలబెట్టేందుకు అహర్నిశలు శ్రమించి నిరంతరం నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఈ రెండేళ్లలో రూ. 1170 కోట్లు తీసుకువచ్చానని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు పట్టణంలో ఆదివారం ఒకే రోజు రూ. 3.79 కోట్ల వ్యయంతో 31 సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు తదితర అభివృద్ధి పనులకు కూటమి నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు. అన్ని వార్డుల్లో జరిగిన ఈ కార్యక్రమాలకు మంత్రి నిమ్మల మోటార్ సైకిల్ పై పర్యటించారు. ఆయా వార్డుల్లో ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా 26 వార్డు లో జరిగిన బహిరంగ సభలో మంత్రి నిమ్మల మాట్లాడుతూ గత ఐదేళ్లు అభివృద్ధి సంక్షేమాన్ని పట్టించుకోలేని గొడ్డల పార్టీ నాయకులు అబద్ధాలు అసత్యాలతో రౌడీలుగా, గుండాలుగా చలామణి అవుతున్నారని, అటువంటివారు రాజకీయాల్లో అవసరమా అంటూ ప్రశ్నించారు.

గత ఐదేళ్లలో పాలకొల్లు అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలోనూ అప్పటి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ. 15 కోట్లతో తాగునీటి సమస్య పరిష్కారానికి 18, 25 వార్డుల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు, మున్సిపల్ వాటర్‌వర్క్స్‌లో ఫిల్టర్ బెడ్, సంప్‌ల నిర్మాణం చేపట్టామని గుర్తుచేశారు. సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం విజ్జేశ్వరం నుంచి గోదావరి జలాలను తీసుకొచ్చే మంచినీటి పథకానికి రూ. 200 కోట్ల నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించామని తెలిపారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పథకాన్ని నిలిపివేసి ప్రజల తాగునీటి హక్కులను దెబ్బతీశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విజ్జేశ్వరం, పాలకొల్లు గోదావరి జలాల పథకాన్ని పునరుద్ధరించి వేగంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. ఈ పథకం పూర్తయితే వేసవికాలంలోనూ తాగునీటి ఇబ్బందులు ఉండవని, కలుషితం లేని సురక్షిత నీరు ప్రజలకు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో గృహాలను 70 నుంచి 100 శాతం వరకు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధం చేశామని మంత్రి తెలిపారు. అనంతరం అధికారంలోకి వచ్చిన గొడ్డల పార్టీ ప్రభుత్వం అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసేందుకు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదన్నారు. లబ్ధిదారుల పేరుతో ఇళ్లను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి 160 కోట్లు అప్పులు తెచ్చి నిధులను ఇతర అవసరాలకు మళ్లించారని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం టిడ్కో గృహాల పూర్తి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టిందని, మరో రెండు నెలల్లో చివరి లబ్ధిదారుడికి కూడా ఇల్లు అందేలా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పాలకొల్లు 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందేలా తీర్చిదిద్దుతున్నామని మంత్రి చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో ఆసుపత్రి భవనానికి రూ. 12.60 కోట్లు మంజూరు మంజూర అయిందని తరువాత అధికారంలోకి వచ్చిన గొడ్డల పార్టీ సంవత్సరంలో పూర్తి చేయాల్సి ఉన్న పూర్తి కాలేదన్నారు. నిర్మాణం పూర్తికాకముందే భవనం మరమ్మతులకు గురయ్యే పరిస్థితి నెలకొనడం గత పాలన నిర్లక్ష్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఆసుపత్రి పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

దళిత కాలనీల అభివృద్ధికి కోటి రూపాయల ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను వినియోగిస్తూ రోడ్లు, డ్రెయిన్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో దళితులను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుని, తరువాత వారి సమస్యలను గొడ్డలి పార్టీ పట్టించుకోలేదన్నారు.

ప్రజల మధ్య తిరిగి సమస్యలు పరిష్కరించలేని వారు ఇప్పుడు అబద్ధాలు, అసత్యాలు, విష ప్రచారాలతో రాజకీయ మనుగడ కోసం ప్రయత్నిస్తున్నారని రామానాయుడు అన్నారు. అభివృద్ధి గురించి పట్టించుకోలేని గొడ్డలి పార్టీ నాయకులు మహిళలపై అసభ్య, అవహేళన వ్యక్తిగత దూషణలు, సోషల్ మీడియా దాడులనే రాజకీయంగా మార్చుకున్నారని విమర్శించారు. మహిళలపై అవమానకర పోస్టులు పెట్టి కుటుంబ వ్యవస్థను కించపరుస్తున్న వారిని మహిళా లోకమే నిలదీయాలన్నారు.

ప్రజల తీర్పుతో తిరస్కరించబడిన వారు ఆత్మపరిశీలన చేసుకోవాల్సింది పోయి అహంకారంతో వ్యవహరిస్తున్నారని అభివృద్ధిని అడ్డుకోవడం, అసత్య ప్రచారం చేయడం తప్ప ప్రజలకు చెప్పుకోదగ్గ పని వారి ఖాతాలో లేదన్నారు. పాలకొల్లులో అభివృద్ధి రథాన్ని ఎవరు అడ్డుకున్నా ఆగదని, ప్రజల ఆశయాలే తమ అజెండా, అభివృద్ధియే తమ లక్ష్యమని మంత్రి రామానాయుడు స్పష్టం చేశారు.



# స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యం

## విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పిలుపు

విజయనగరం (చైతన్యరథం): పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు ఆధ్వర్యంలో, పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున అధ్యక్షతన పార్లమెంటరీ ప్రజా ప్రతినిధులతో ఆత్మీయ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, శాసనసభ్యుడు కిమిడి కళా వెంకటరావు, కోండ్రు మురళీమోహన్, అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఆర్.వి.ఎస్.కె.కె. రంగారావు (బేబీ నాయన), ఎచ్చెర్ల నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ లంక శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు. విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమం, పార్టీ బలోపేతం, కూటమి పార్టీల సమన్వయం తదితర అంశాలపై చర్చించి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సమష్టి కృషితో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని నిర్ణయించారు. అనంతరం ఏర్పాటుచేసిన ఆత్మీయ విందులో పార్లమెంటరీ ప్రజాప్రతినిధులతో పాటు స్థానిక ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావు, ఎచ్చెర్ల నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ విశ్వక్సేన్, ముఖ్య నాయకులతో కలిసి ఆత్మీయ విందులో పాల్గొన్నారు.

# పున్నమి ఘాట్‌లో పరిశుభ్రత అందరి బాధ్యత

## పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ బుద్ధా వెంకన్న



విజయవాడ (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని పున్నమి ఘాట్‌లో నిర్వహించిన స్వచ్ఛభారత స్వచ్ఛ సేవ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్, జాతీయ పార్టీ ఉపాధ్యక్షుడు బుద్ధా వెంకన్న గారు పాల్గొని పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా బుద్ధా వెంకన్న గారు మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు పరిశుభ్రత ఎంతో ముఖ్యమని అన్నారు. స్వచ్ఛ భారత్ అనేది కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగంగా చేసుకోవాల్సిన బాధ్యత అని పేర్కొన్నారు. పున్నమి ఘాట్ వంటి ప్రముఖ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా విజయవాడ నగరానికి మంచి గుర్తింపు తీసుకురావచ్చున్నారు. “పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజానికి పునాది. మన ఇల్లు ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో, మన వీధులు, మన ప్రాంతాలు, మన నగరాన్ని కూడా అంతే బాధ్యతతో పరిశుభ్రంగా ఉంచుకోవాలి. స్వచ్ఛత విషయంలో ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది” అని బుద్ధా వెంకన్న గారు అన్నారు. పున్నమి ఘాట్‌కు ప్రతిరోజూ అనేక మంది ప్రజలు, భక్తులు, పర్యాటకులు వస్తుంటారని, అందువల్ల ఇక్కడ పరిశుభ్రతను నిరంతరం కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా, చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయాలని సూచించారు. స్వచ్ఛత కార్యక్రమాలు ఒక్కరోజుకే పరిమితం కాకుండా నిరంతరం కొనసాగాలని, ప్రజలు, యువత, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక నాయకులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రజలు తమ ప్రాంతాల్లో స్వచ్ఛత కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని, “స్వచ్ఛమైన విజయవాడ -- ఆరోగ్యకరమైన విజయవాడ” లక్ష్యంగా అందరూ కలిసి ముందుకు సాగాలని బుద్ధా వెంకన్న గారు పిలుపునిచ్చారు. పున్నమి ఘాట్ లో ఫిష్ ఆంధ్ర షాపులకు కొత్త కరంట్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలి: బుద్ధా వెంకన్నగారువిజయవాడ: పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ఫిష్ ఆంధ్ర షాపులకు కొత్త కరంట్ కనెక్షన్లు ఏర్పాటు చేసే విషయంపై పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ బుద్ధా వెంకన్న గారు రాంరాజ్ నగర్ ఏఈ గారితో మాట్లాడారు. షాపుల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన కనెక్షన్లు 7 రోజులో మంజూరు చేయాలని ఆయన కోరారు. సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని బుద్ధా వెంకన్న గారు సూచించారు. ఈ కార్యక్రమంలో సురభి బాలు, చినసుబ్బయ్య, శివశర్మ, పత్తి నాగేశ్వరావు, బడుగు గణేష్ పితాని పద్మ, బొబ్బురి నారాయణ స్వామి, డి సత్తి బాబు, బొబ్బురి శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్‌లో సమస్యల సత్వర పరిష్కారం

## ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వెల్లడి

విజయనగరం(చైతన్యరథం): పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు విజయనగరం టిడిపీ పార్టీ కార్యాలయంలో ప్రజల సమస్యలపై పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుండి వచ్చిన వినతలను స్వీకరించి తక్షణ పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ, ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, ఈరోజు వచ్చిన అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులు వాటిని ఒకటి రెండు వారాల గడువులో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.



జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)
చైతన్యరథం

# పరిమితులు చెరిపేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

## ఆడపిల్లలకు గుంటూరు ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపు, స్కాలర్‌షిప్‌లు, దుప్పట్లు, బ్యాగుల పంపిణీ



గుంటూరు (చైతన్యరథం): అరండల్‌పేట 11/2 లైన్‌లోని రజక భవన్‌లో ఆదివారం ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, దుప్పట్లు, బ్యాగుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... ఒకప్పుడు విద్య, ఉద్యోగాల్లో ఆడపిల్లలకు అవకాశాలు పరిమితంగా ఉండేవని, కానీ నేడు పరిస్థితులు పూర్తిగా మారిపోయి అన్ని రంగాల్లో మహిళలు తమ ప్రతిభను చాటుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల్లో అధిక సంఖ్యలో బాలికలు కనిపించడం ఆనందంగా ఉందని, ఇది సమాజంలో వచ్చిన సానుకూల మార్పుకు నిదర్శనమని పేర్కొన్నారు. చదువు కోసం కుటుంబాలను, స్వగ్రామాలను విడిచి వసతి గృహాల్లో ఉంటూ విద్యను అభ్యసించడం సాధారణ విషయం కాదని అన్నారు. అయితే వసతి గృహ జీవితం ద్వారా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులతో కలిసిమెలిసి ఉండే అవకాశం లభిస్తుందని, తద్వారా భిన్న ఆలోచనలు, సంస్కృతులు, జీవన విధానాలను తెలుసుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. జీవితంలో విస్తృత దృక్పథాన్ని పెంపొందించుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి తన జీవితానికి ఒక గొప్ప లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ఆ లక్ష్యం సాధించే వరకు పట్టుదలతో శ్రమించాలని సూచించారు. కేవలం చదువుతో సరిపెట్టుకోకుండా సమాజంలో నాయకత్వ పాత్రలు కూడా పోషించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా ఆడపిల్లలు రాజకీయ రంగంలోకి కూడా రావాలని, సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. చదువే జీవితాన్ని మార్చగల శక్తివంతమైన సాధనమని, తనను ఈ స్థాయికి తీసుకొచ్చింది కూడా విద్యేనని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, కొత్త విషయాలు నేర్చుకోవాలనే తపనతో, లక్ష్యంపై పూర్తి ఏకాగ్రతతో ముందుకు సాగితే ఎలాంటి అడ్డంకులనైనా అధిగమించి విజయాన్ని అందుకోవచ్చుని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘ నాయకులు, వసతి గృహ నిర్వాహకులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత

## పెనమలూరు ఎమ్మెల్యే ఎమ్మెల్యే బోడే ప్రసాద్ వెల్లడి

తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని పోరంకి గ్రామంలో 64.3 లక్షల సాధారణ నిధులతో పోరంకి చిగురుపాటి విజయలక్ష్మి రోడ్డు, నందనవం అపార్ట్మెంట్ వరకు రోడ్డు నిర్మాణ పనులకు పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు బోడే ప్రసాద్ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ...పెనమలూరు నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు,మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో గత 27 నెలల కాలంలో కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి వివిధ అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశామని,ప్రజల అవసరాలకు అనుగుణంగా రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో మంత్రి నారా లోకేష్ సహకారంతో తాడిగడప మున్సిపాలిటీని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ఎక్కడా రాజీ లేకుండా పనిచేస్తామని, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు,అధికారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ సేవలు అభినందనీయం

## తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు మాదల చైతన్య కితాబు



గుంటూరు (చైతన్యరథం): యువతలో క్రీడా స్ఫూర్తితో పాటు సామాజిక బాధ్యత, సేవాభావాన్ని పెంపొందించేందుకు రోటరీ క్లబ్ వంటి స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మాదల చైతన్య అన్నారు. గుంటూరు నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో నిర్వహించిన 'రోటోఫెస్ట్ 2026' ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాదల చైతన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తమ ప్రతిభను కేవలం వ్యక్తిగత అభివృద్ధికే పరిమితం చేయకుండా సమాజ అభివృద్ధిలోనూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. మాదల చైతన్య మాట్లాడుతూ, క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానానికి దోహదపడతాయని పేర్కొన్నారు. అదే విధంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సమాజం పట్ల బాధ్యత, మానవతా విలువలు పెంపొందుతాయని అన్నారు. "యువతే దేశానికి భవిష్యత్ శక్తి. వారి ప్రతిభకు సరైన వేదికలు కల్పించడంతో పాటు, ఆ శక్తిని సమాజ సేవ వైపు మళ్లించడం కూడా మనందరి బాధ్యత" అని మాదల చైతన్య పేర్కొన్నారు. క్రీడలు, సేవా కార్యక్రమాలను సమన్వయం చేస్తూ యువతను ప్రోత్సహించే రోటరీ క్లబ్ కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ, యువతను క్రీడలు సామాజిక సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు సమాజం పట్ల బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. గుంటూరు నగరంలో నిర్వహించిన 'రోటోఫెస్ట్ 2026' ద్వారా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సేవా భావన వంటి అంశాలను ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యూ జనరేషన్ డిస్ట్రిక్ట్ చైర్మన్ అనే రత్నప్రభాకర్, కె వి భాస్కర్. సెక్రెటరీ తుమ్మల శ్రీనివాసరావు, ట్రెజరర్ కొల్లి అరవిందు కుమార్, కే . స్. రమేష్, రోటరాక్ట్ డైరెక్టర్స్ సంఘవి, పిఎస్ కార్తికేయన్ కె వి సుబ్బారావు, చెరుకూరి శ్రీనివాసరావు, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, షేక్ కాజా, శోభనంద్, జగదీష్, తిరుపతిరావు, వేణూ గోపాలరావు పాల్గొన్నారు.

# "అభినవ ప్రకాశం పంతులు" రంగసాయి

## బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ చైర్మన్ కె. బుచ్చిరామప్రసాద్ అభినందన

భీమవరం (చైతన్యరథం): ప్రజాసేవను జీవితంలో భాగంగా చేసుకుని నాలుగు దశాబ్దాలుగా సామాజిక సేవ చేస్తున్న చెరుకువాడ రంగసాయిని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కె. బుచ్చిరామప్రసాద్ ఘనంగా సత్కరించారు. గునుపూడి శ్రీ విద్యా గణపతి స్వామి 23వ వార్షికోత్సవాల్లో భాగంగా శ్రీ ఉమాసోమేశ్వర గునుపూడి భీమవరం బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి చైర్మన్ బుచ్చిరామప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై, రంగసాయికి "అభినవ ప్రకాశం పంతులు" బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రతిఫలం ఆశించకుండా ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయమని, సేవా కార్యక్రమాలకు పట్టుదల, దీక్ష, సహనం అవసరమని అన్నారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు నీతి, నిజాయితీ, దేశభక్తి, ప్రజా ఉద్యమాలకు ప్రతీకగా నిలిచారని, ఆయన స్ఫూర్తితో రంగసాయి చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ప్రకాశం చౌక్‌లో ప్రకాశం పంతులు విగ్రహం ఏర్పాటు కోసం రంగసాయి సుదీర్ఘకాలం చేసిన కృషిని చైర్మన్ బుచ్చిరామప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. చారిత్రక వ్యక్తుల సేవలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలకమన్నారు. అనంతరం చైర్మన్ బుచ్చిరామప్రసాద్ చేతుల మీదుగా రంగసాయిని "అభినవ ప్రకాశం పంతులు" బిరుదు, దుశ్శాలువ, పూలమాల, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు బ్రహ్మజ్యోస్యుల సుబ్రహ్మణ్యం (సుబ్బయ్య), బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు చెరుకుపల్లి సంతోష్, పీవీ ఫణికుమార్, సమాఖ్య ప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



# టీడీపీ కార్యాలయంలో కొలువుదీరిన గణనాథుడు


## దర్శించుకున్న మాజీమంత్రి దేవినేని ఉమా

నందిగామ (చైతన్యరథం): వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నందిగామ రైతుపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాన్ని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు దర్శించుకున్నారు. స్థానిక పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని విఘ్నేశ్వరుడికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యాలయంలో భక్తి వాతావరణం నెలకొంది. గణనాథుడి దర్శనానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని దేవినేని ఉమ ఆకాంక్షించారు.

చైతన్యరథం

# జోన్-4

(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)



## శ్రీవారి బ్రహ్మోత్సవ సేవకులకు వస్త్ర బహుమానం

**5 వేల మందికి వేమిరెడ్డి దంపతులచే పంపిణీ, శ్రీవారిపై నిశ్చల భక్తికి నిదర్శనమని ఈవో ముద్దాడ రవిచంద్ర ప్రశంస**

తిరుమల (చైతన్యరథం): శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో స్వామివారి సేవలో నిమగ్నమై భక్తిశ్రద్ధలతో విధులు నిర్వహిస్తున్న సుమారు 5 వేల మంది టీటీడీ సిబ్బందికి ఎంపీ వేమిరెడ్డి దంపతులు ఆదివారం వస్త్ర బహుమానం నిర్వహించారు. శ్రీవారి బ్రహ్మోత్సవ సేవకులను గౌరవిస్తూ వేమిరెడ్డి దంపతులు చేపడుతున్న ఈ సేవ గత 8 ఏళ్లుగా నిరంతరంగా కొనసాగుతోంది. నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు, కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తిరుమలలోని వైభవోత్సవ మండపంలో జరిగిన కార్యక్రమంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, చేతుల మీదుగా సిబ్బందికి వస్త్రాలను పంపిణీ చేశారు. అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి కూడా ఉన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల నిర్వహణలో భాగంగా స్వామివారి సేవలో భాగస్వాములవుతున్న ఆలయ అర్చకులు, పోటు సిబ్బంది, వాహన బేరర్లు, మంగళవాయిద్య (మేళం) బృందం, కల్యాణకట్ట సిబ్బంది, ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికులు, ఎలక్ట్రిసిటీ విభాగం ఉద్యోగులు తదితరులతో పాటు టీటీడీకి అనుసంధానంగా వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న సిబ్బంది అందరికీ వస్త్ర బహుమానం జరిగింది.

బ్రహ్మోత్సవాల నిర్వహణలో తమవంతు బాధ్యతను నిర్వర్తిస్తున్న సిబ్బందిని గౌరవించి, వారిని ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ వస్త్ర బహుమానాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర మాట్లాడుతూ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు శ్రీవారి సేవకులకు వస్త్ర బహుమానం అందించడం అభినందనీయమన్నారు. స్వామివారి సేవలో నిరంతరం భాగస్వాములవుతున్న సిబ్బందిని గౌరవిస్తూ, వారిని ప్రోత్సహించడం ప్రశంసనీయమన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) ఎలాంటి అవసరం వచ్చినా, ఏదైనా సహాయం కోరినా వేమిరెడ్డి దంపతులు వెంటనే స్పందించి అండగా నిలుస్తారని ఈవో వెల్లడించారు. శ్రీ వేంకటేశ్వర స్వామివారిపై వారికి ఉన్న భక్తికి, సేవానిరతికి ఈ సేవ ఒక నిదర్శనమని పేర్కొన్నారు. శ్రీవారి కృపాకటాక్షాలు వేమిరెడ్డి దంపతులకు, వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

## వాళ్ళు చదువుకున్న అజ్ఞానులు

**వైసీపీ నేతల చెత్త ఆరోపణలపై విరుచుకుపడిన మంత్రి నారాయణ**




నెల్లూరు (చైతన్యరథం): వైసీపీ నేతలు చేస్తున్నవి చెత్త ఆరోపణలని మంత్రి నారాయణ మండిపడ్డారు. చెత్తను కాలుస్తున్నారంటూ అవివేకంగా మాట్లాడుతున్నారని, డంపింగ్ యార్డుల్లో చెత్త కుళ్లే సమయంలో బయోగ్యాస్, అందులోని మిథేన్ కారణంగా మంటలు చెలరేగుతాయని తెలిపారు. మంటలు ఎందుకు వస్తాయో తెలుసుకుని మాట్లాడితే మంచిదని హితవు పలికారు.నెల్లూరు సిటీ లో పర్యటించిన మంత్రి మీడియా అడిగిన ప్రశ్నలకు స్పందించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే వైఎస్ఆర్సీపీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. తనపై అవినీతి ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు.డబ్బే కావాలనుకుంటే నారాయణ విద్యాసంస్థలను చూసుకుంటే చాలన్నారు.2019లో రూ.2,500 కోట్లుగా ఉన్న టర్నోవర్‌ను 2024 నాటికి రూ.6,500 కోట్లకు పెంచి తన పిల్లలకు అప్పగించానని చెప్పారు.. పేదరికం నుంచి వచ్చిన తనకు పేదల కష్టాలు తెలుసని, ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. పేద పిల్లలకు విద్యను ఆస్తిగా అందించాలనే లక్ష్యంతో నెల్లూరు ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నానన్నారు. భగత్‌సింగ్ కాలనీ, సర్వేపల్లి కాలువకట్ట వాసులకు శాశ్వత పట్టాలు వచ్చేలా చేసినా ఓర్వలేకున్నారని మండిపడ్డారు.

ప్రజలకు అన్నీ తెలుసని, ఎవరు ఏం చేస్తున్నారో గమనిస్తున్నారన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే ప్రజల ఛీత్కారానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

## మంత్రి లోకేష్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**రాప్తాడులో పలు ప్రాంతాలను పరిశీలించిన ఎస్పీ జగదీష్**

**పాల్గొన్న ఎమ్మెల్యే సునీత, జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజు, పరిటాల శ్రీరామ్**

రాప్తాడు (చైతన్యరథం): ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాప్తాడు పర్యటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ జగదీష్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈనెల 22న ఎన్టీఆర్, పరిటాల రవి కాంశ్య విగ్రహాల ఆవిష్కరణకు మంత్రి నారా లోకేష్ రానున్నారు. ఈ నేపథ్యంలోజిల్లా ఎస్పీ జగదీష్ రాప్తాడులోని పలు ప్రాంతాలను పరిశీలించారు. రాపాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్, శ్రీ సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎంఎస్ రాజులతో ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. విగ్రహాల ఆవిష్కరణ, కార్యకర్తల సమావేశ ప్రాంగణం, భోజన ఏర్పాటు, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.?ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ మంత్రి పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కార్యక్రమానికి భారీగా ప్రజలు, పార్టీ శ్రేణులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రాకపోకలకు ఆటంకం కలగకుండా ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, ఎమ్.ఎస్.రాజు మాట్లాడుతూ విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవాన్ని దిగ్విజయం చేసేందుకు అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా కార్యకర్తలు, అభిమానులు తరలిరానున్న నేపథ్యంలో అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



## కలియిక సేవలకు స్వర్గపురిలో స్థలం కల్పించండి

**బుద్ధా వెంకన్నను కలిసి కోరిన ఎన్జీవో ప్రతినిధులు**

విజయవాడ (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గం మల్లికార్జునపేట బుద్ధా వెంకన్న గారి కార్యాలయం వద్ద నగర ప్రజలకు సేవా దృక్పథంతో కలయిక టీం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తున్న ఫ్రీజర్ బాక్సులు, వ్యాన్, ఫ్రీజర్ బాక్స్ వ్యాన్‌లను స్వర్గపురిలోనే భద్రపరిచేందుకు అనుమతి కల్పించాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, చందన సురేష్ (మామ ) పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ బుద్ధా వెంకన్న గారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2017లో అప్పటి మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో కలయిక ఆర్గనైజేషన్ సేవా కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. అప్పట్లో ఫ్రీజర్ బాక్సులు, వ్యాన్, ఫ్రీజర్ బాక్స్ వ్యాన్‌లను స్వర్గపురిలో ఉంచుకునేందుకు అనుమతి కూడా ఇచ్చారని వివరించారు. ఎవరినుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా, మరణించిన వారి కుటుంబాలకు అవసరమైన సమయంలో ఫ్రీజర్ బాక్సులు, వ్యాన్ సేవలను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ సేవలను విజయవాడ నగరవాసులు సద్వినియోగం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. పస్తుతం ఫ్రీజర్ బాక్సులు, వాహనాలను స్వర్గపురి బయట ఉంచాల్సి వస్తే సంఘ విద్రోహ శక్తుల వల్ల వాటికి నష్టం కలిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండేలా వాటిని స్వర్గపురిలో భద్రంగా ఉంచుకునేందుకు అనుమతి కల్పించాలని పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ బుద్ధా వెంకన్న గారిని కోరారు. ప్రజలకు ఉపయోగపడే ఇటువంటి సేవా కార్యక్రమాలకు సహకరించి, ఫ్రీజర్ బాక్సులు, వ్యాన్, ఫ్రీజర్ బాక్స్ వ్యాన్‌లను స్వర్గపురిలో ఉంచుకునేందుకు తగిన అనుమతులు ఇప్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గుర్రంకొండ, దనాల శ్రీను, పెద్ది రమేష్ పోతినేడి లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు



# ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధికి ప్రాధాన్యత

## రూ.40 లక్షలతో రామాలయ నిర్మాణానికి మంత్రి సవిత భూమిపూజ



సోమందేపల్లి (చైతన్యరథం): పెనుకొండ నియోజకవర్గంలో ఆధ్యాత్మిక, ధార్మిక క్షేత్రాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. సోమందేపల్లి మండల కేంద్రంలో టీటీడీ నిధులతో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న అయోధ్య రామ మందిరానికి ఆదివారం మంత్రి సవిత భూమిపూజ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం సాకారం కావడం దేశ ప్రజలందరికీ గర్వకారణమన్నారు. అదే స్ఫూర్తితో పెనుకొండ నియోజకవర్గంలోనూ ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా టీటీడీ నిధులతో నాలుగు మందిరాలు మంజూరయ్యాయని, అందులో భాగంగా సోమందేపల్లిలో రూ.40 లక్షలతో రామ మందిర నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు తెలిపారు.10 సెంట్ల స్థలంలో రామ మందిరం నిర్మాణం చేపడుతున్నామని, టీటీడీ ద్వారా రామ మందిర నిర్మాణానికి భూమిపూజ నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. అదేవిధంగా టీటీడీ ద్వారా త్వరలో 16 భజన మందిరాలకు అనుమతులు రానున్నాయని, అనుమతులు వచ్చిన వెంటనే వాటి నిర్మాణాలను పూర్తి చేస్తామని చెప్పారు.నియోజకవర్గంలోని పలు ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు మంత్రి వివరించారు. పరిగి వెంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.1.08 కోట్లు, వడిగేపల్లి అమ్మవారి గోపురం నిర్మాణానికి రూ.20 లక్షలు, మరువపల్లి ఆంజనేయస్వామి ఆలయానికి రూ.20 లక్షలు, పెనుకొండ ఐముఖేశ్వర స్వామి దేవాలయానికి రూ.3 కోట్లు, వానవోలు రంగనాథ స్వామి దేవాలయానికి రూ.2 కోట్లు, రాగిమేకలపల్లి ఆంజనేయస్వామి ఆలయానికి రూ.80 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. సోమందేపల్లి మండల కేంద్రంలో మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని, త్వరలో రూ.3 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేస్తామని మంత్రి సవిత తెలిపారు. అదేవిధంగా చాలకూరు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిను నవంబర్ నాటికి అంతా పూర్తి చేసి ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## రూ.2.10 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

పరిగి (చైతన్యరథం): మండలంలోని ఊటుకూరు రోడ్డు నుంచి పైడేటి మీదుగా ఎర్రగుంట, తిరుమలదేవరపల్లి గ్రామాల వరకు రూ.2.10 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవితమ్మ భూమిపూజ చేశారు. ఎర్రగుంట క్రాస్ వద్ద ఆర్డీటీ ఇళ్ల సమీపంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. బీటీ రోడ్డు నిర్మాణంతో పైడేటి, ఎర్రగుంట, తిరుమలదేవరపల్లి గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. రైతులు, విద్యార్థులు, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బీటీ రోడ్డు నిర్మాణానికి



రూ.2.10 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మంత్రి సవితమ్మ తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



# రింగ్‌రోడ్డుతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

## రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె (చైతన్యరథం): రింగ్ రోడ్డు నిర్మాణ పనులను రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాయిబాబా ఆలయం నుంచి రవ్వలకొండ వరకు కొనసాగుతున్న రింగ్ రోడ్డు పనులను పరిశీలించిన మంత్రి.. పనుల పురోగతి, ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రింగ్ రోడ్డు నిర్మాణ పనులు ఇప్పటికే దాదాపు 80 శాతం పూర్తయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. రూ.56 కోట్ల అంచనా వ్యయంతో 10.68 కి.మీ. పొడవున నిర్మిస్తున్న ఈ రింగ్ రోడ్డు పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. మిగిలిన పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తయితే బనగానపల్లె పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా భారీ వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులోకి రావడంతో పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని పేర్కొన్నారు. అనంతరం మంత్రి బనగానపల్లె పట్టణంలోని ప్రధాన కూడళ్లను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీకి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలు, వాహనాల రాకపోకల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. బనగానపల్లె పట్టణ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రింగ్ రోడ్డు పూర్తితో పట్టణానికి మెరుగైన రహదారి అనుసంధానం ఏర్పడటంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ట్రాఫిక్ నిర్వహణ మరింత సులభతరం కానుందని పేర్కొన్నారు.

# ఫిబ్రవరిలో కొండ బిట్రగుంట స్వామి కుంభాభిషేకం

## మంత్రి ఆనంను ఆహ్వానించిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

కావలి (చైతన్యరథం): కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి ఆదివారం నెల్లూరులోని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు విచ్చేసిన కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థాన చైర్మన్, అధికారులు, ప్రధాన అర్చకులు మంత్రికి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం, వచ్చే ఫిబ్రవరి నెలలో అత్యంత వైభవంగా నిర్వహించతలపెట్టిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థాన "కుంభాభిషేకం" మహోత్సవ వివరాలను ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మంత్రికి వివరించారు. దీనితో పాటు, ప్రస్తుతం దేవస్థానంలో వేగవంతంగా జరుగుతున్న అభివృద్ధి పనులను, రాబోయే రోజుల్లో ఆలయ పరిధిలో చేపట్టబోయే వివిధ సంక్షేమ,ఆధ్యాత్మిక అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో సమగ్రంగా చర్చించారు.?ఈ కార్యక్రమంలో కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) రాధాకృష్ణ, దేవస్థానం చైర్మన్ శ్రీరామ్ మాలాద్రి, దేవస్థాన ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



# తిరుపతి అభివృద్ధికి అడ్డంకులు సృష్టించొద్దు



తిరుపతి (చైతన్యరథం): తిరుపతి అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునేలా రాజకీయ ప్రకటనలు చేయడం సరికాదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ ఓబెరాయ్ హోటల్‌కు స్థల కేటాయింపు తదితర అభివృద్ధి అంశాలపై మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను ప్రస్తావించారు. తిరుపతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చేయడంతో పాటు పర్యాటకం, పరిశ్రమలు, మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అభివృద్ధిపై అభ్యంతరాలుంటే సూచనలు ఇవ్వాలని, కానీ అడ్డంకులు సృష్టించేలా వ్యవహరించవద్దని కోరారు. గత ప్రభుత్వ హయాంలో టీటీడీ, మద్యం రవాణా తదితర అంశాలపై వచ్చిన ఆరోపణలను కూడా నరసింహ యాదవ్ ప్రస్తావించారు. వాటిపై దర్యాప్తు సంస్థలు, న్యాయస్థానాల్లో వెలువడే ఆధారాల ఆధారంగానే వాస్తవాలు తేలాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తిరుపతిలో ప్రశాంత వాతావరణాన్ని కాపాడుతూ భక్తులు, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధికి అందరూ సహకరించాలని నరసింహ యాదవ్ కోరారు.



మద్దిలపాలెంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు పొందినందుకు కృతజ్ఞతగా, 10వ వార్డుకు చెందిన లబ్ధిదారులు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబును ముఖీపీ కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రవాసాంధ్ర

NRI TDP

చైతన్యరథం



## ఆసియా క్రీడల్లో భారత్ అథ్లెట్లకు వసతి సమస్య...

# ఎన్నారైల ఆపన్న హస్తం

**జపాన్:** సరైన గదులు, వసతి ఏర్పాట్లు లేకపోవడంతో ఆసియా క్రీడల కోసం జపాన్ వెళ్లిన భారత్ అథ్లెట్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మన దేశ బృందంలోని దాదాపు 35 మందికి నిర్వాహకులు బస ఏర్పాటు చేయక పోవడం సమస్యగా మారింది. ఇంకా మరికొందరు భారత క్రీడాకారులు కూడా జపాన్‌కు చేరుకోవాల్సి ఉంది. ఈ క్రమంలోనే మన అథ్లెట్లకు ఆశ్రయమిచ్చేందుకు జపాన్‌లోని 2 వేల మంది ఎన్నారైలు ముందుకొచ్చారు. వసతి లేకపోవడంతో భారత క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారని, వారికి ఆశ్రయమివ్వాలని కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ.. నగోయాలోని ప్రవాస భారతీయ సమాజాన్ని కోరింది. దీంతో ఎన్నారైలు తమ ఆపన్నహస్తాన్ని అందించడానికి ముందుకు వచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో అథ్లెట్లకు గదులు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మన అథ్లెట్ల తొలి బృందం ఇక్కడకు చేరుకున్న తర్వాతే..వసతి కేటాయింపు జాబితా నుంచి సుమారు 35 మంది పేర్లను తొలగించిన విషయం తనకు తెలిసిందని భారత చెఫ్ డి మిషన్ సహదేవ్ యాదవ్ వెల్లడించారు. "భారత్ నుంచి ఊహించిన దానికంటే ఎక్కువ మంది క్రీడాకారు లు వచ్చారని ఐచీ- నగోయా ఆసియా క్రీడల నిర్వాహక కమిటీ పేర్కొంది. అందువల్లే వసతి కల్పించడం ఇబ్బందిగా మారిందని అంటోంది. కానీ ముందుగా పంపిన జాబితా ప్రకారమే మన అథ్లెట్ల సంఖ్య ఉంది. అయినప్పటికీ ఎటువంటి సమాచారం ఇవ్వకుండా నిర్వాహకులు 35 మంది అథ్లెట్ల పేర్లను వసతి కేటాయింపు జాబితా నుంచి తొలగించారు. దీంతో సొంతంగా బయటి హోటళ్లను ఆశ్రయించాల్సి వచ్చింది. రాబోయే రోజుల్లో మరికొందరు అథ్లెట్లు కూడా పోటీలకు రానున్న నేపథ్యంలో నగోయాలోని ఎన్నారైల సాయం తీసుకుంటున్నాం. ఈ సమస్యలు క్రీడాకారుల ఆటపై ప్రభావం చూపించకుండా చర్యలు తీసుకోవడానికి కృషి చేస్తున్నాం" అని సహదేవ్ యాదవ్ పేర్కొన్నారు.

### తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్ ఆధ్వర్యంలో

# ఆరోగ్య సేవల్లో మరో ముందడుగు

### సుఖీభవ శిబిరానికి విశేష స్పందన




**టెక్సాస్:** తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్ (టీఏఎన్‌టీఏఎక్స్), టెక్సాస్ ఇండో-అమెరికన్ ఫిజిషియన్స్ సొసైటీ (టీఐపీఎస్) భాగస్వామ్యంతో నిర్వహించిన సుఖీభవ ఉచిత ఆరోగ్య విజయవంతంగా జరిగింది. ఈ ఆరోగ్య శిబిరానికి కమ్యూనిటీ సభ్యుల నుంచి విశేష స్పందన లభించింది. ఫ్రిస్కోలోని రిజాయిస్ లూథరన్ చర్చిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొని అవసరమైన వైద్య సూచనలు అందించారు. ఈ శిబిరంలో ఇంటర్నల్ మెడిసిన్ ఫ్యామిలీ ప్రాక్టీస్, కార్డియాలజీ, న్యూట్రిషన్, ఎండో క్రైనాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, రుమటాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, స్లీప్ మెడిసిన్ తదితర వైద్య విభాగాలకు చెందిన నిపుణులు సేవలందించారు. ఫ్రిస్కో మేయర్ మార్క్ హిల్ ఆరోగ్య శిబిరాన్ని సందర్శించారు. ట్యాన్‌టెక్స్, టిప్స్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కమ్యూనిటీ సేవా కార్యక్రమాన్ని అభినందించారు. ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్ బృందం, 135 వైద్యులు-వాలంటీర్లను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా ట్యాన్‌టెక్స్ అధ్యక్షురాలు మాధవి లోకిరెడ్డి మాట్లాడుతూ సమాజంలోని ప్రతిఒక్కరికీ ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, అవసరమైన వారికి వైద్య నిపుణుల సలహాలను అందుబాటులోకి తీసుకురావడం మా లక్ష్యం. ఆరోగ్యానికి కమ్యూనిటీ సభ్యుల నుంచి లభించిన స్పందన ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన వైద్యులు, స్పాన్సర్లు, వాలంటీర్లు, మీడియా భాగస్వాములకు కృతజ్ఞతలు తెలిపారు.








# ఎన్ఆర్ఐ కేంద్ర కమిటీ సభ్యులకు సన్మానం



**- టీడీపీ మెల్‌బోర్న్ ఆధ్వర్యంలో కార్యక్రమం**

**- చంద్రబాబు అక్రమ అరెస్టుకు మూడేళ్లు పూర్తి.. సంఘీభావంగా నిజం గెలిచింది పోస్టర్ల ప్రదర్శన**

**మెల్‌బోర్న్:** ఇటీవల ఎన్ఆర్ఐ టీడీపీ కేంద్ర కమిటీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన నర్మద జొన్నలగడ్డ, గోపి నంబళ్లని టీడీపీ మెల్‌బోర్న్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమ అరెస్టుకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయనకు సంఘీభావం తెలుపుతూ "నిజం గెలిచింది" అనే సందేశంతో పోస్టర్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మెల్‌బోర్న్ సభ్యులు రవి కోసరాజు, శ్రీకాంత్ కొణిదెన, సుమ తాటిన, రాజీవ్ చౌదరి కొత్తూరు, సుమన్ దాసరి, ప్రకాష్ సూరపనేని, రాజా రమేష్‌రెడ్డి, మురళి అచంట, నితిన్ కళ్యాణ్ విప్పర్ల, సుబ్బారావు నడింపల్లి, సుస్మిత కోట, వెంకట్ జొన్నలగడ్డ, శ్రీనాథ్ కనగాల, స్నేహ వడ్లపట్ల, రమ్య బాచిన, శ్రీకాంత్ చావా, శ్రీకాంత్ సరిపూడి, అరవింద్ మాడినీడి, జగదీష్ గద్దె, ఆర్.కే.రామారావు, చైతన్య నెలవల్లి పాల్గొన్నారు.

# కమింగ్‌లో మిన్నంటిన గణేష్ ఉత్సవాలు



**అమెరికా:** జార్జియాలోని కమింగ్ నగరంలో బెల్హర్స్ట్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో 5వ వార్షిక గణేష్ చతుర్థి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక నివాసితులు, భారతీయ కుటుంబాలు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విందు కమ్యూనిటీలో ఐక్యతను పెంచింది. సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలతో ఈ ఉత్సవాలు అత్యంత ఉత్సాహభరితంగా సాగాయి. అందంగా అలంకరించిన వేదికలు, సంప్రదాయ వేడుకలు, రంగు రంగుల అలంకరణలు పండుగ శోభను మరింత పెంచాయి. ఈ వేడుకల్లో సుమారు 120 కుటుంబాలు పాల్గొన్నాయి. అందమైన భారతీయ సంప్రదాయ దుస్తులు ధరించిన కమ్యూనిటీ సభ్యులు, భక్తిశ్రద్ధలతో ఉత్సాహంతో గణేశుడిని పూజించి గణేష్ చతుర్థి వేడుకలను జరుపుకున్నారు. ఈ వేడుకల్లోని ముఖ్య ఆకర్షణలలో ఒకటి "భిన్నత్వంలో ఏకత్వం" అనే భావన. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఉత్తర భారతదేశం వంటి వివిధ ప్రాంతాలకు చెందిన నిర్వాహకులు, కుటుంబాలు కలిసి ఈ ఉత్సవాలను నిర్వహించడం విశేషం. ఈ ఉత్సవాలు భారతదేశపు గొప్ప సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రదర్శించడంతో పాటు నివాసితుల మధ్య ఉన్న బలమైన స్నేహ, సంఘభావ బంధాలను కూడా చాటింది. అక్కడి భారతీయ కుటుంబాలు తమ ఇంట్లో తయారుచేసిన రకరకాల



భారతీయ వంటకాలను తీసుకురావడంతో అందరూ కలిసి భోజనం చేయడం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేశీ డిస్ట్రిక్ట్ రెస్టారెంట్ అందించిన రుచికరమైన ఆహారం, సాంస్కృతిక ప్రదర్శనలు, భక్తి కార్యక్రమాలు, ఆత్మీయ స్వాగతం ఈ వేడుకలను చిరస్మరణీయంగా మార్చాయి. ఈ ఉత్సవాన్ని విజయవంతం చేయడానికి తమ సమయాన్ని, శ్రమను వెచ్చించిన నిర్వాహకులు, వాలంటీర్లు, కుటుంబాలు, పాల్గొన్న వారందరికీ సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. వరుసగా ఐదు సంవత్సరాలుగా ఈ ఆదరణీయమైన సంప్రదాయాన్ని కొనసాగించడంలో సహాయపడిన ప్రతి ఒక్కరికీ సంఘం సమష్టిగా కృతజ్ఞతలు తెలిపింది.









## తేజస్‌లు నడిపిన భారత్, జపాన్ వాయుసేన అధిపతులు

భారత్‌కు చెందిన తేలికపాటి యుద్ధవిమానం తేజస్‌లో జపాన్ ఎయిర్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ (జేఏఎస్‌డీఎఫ్) అధిపతి జనరల్ టకెహిరో మొరిటా ప్రయాణించారు. ఆయనతో పాటు భారత వాయుసేన చీఫ్ అమర్ ప్రీత్ సింగ్ కూడా తేజస్‌లో ప్రయాణించారు. ఆదివారం ఉదయం భారత్-జపాన్ ద్వైపాక్షిక వాయుసేన సంయుక్త విన్యాసాలు వీర్ గార్డియన్-2026లో భాగంగా జోధ్‌పూర్ ఎయిర్‌ఫోర్స్ కేంద్రంలో నిర్వహించారు. తొలుత వాయుసేన స్థావరానికి వచ్చిన వీరు తమకు కేటాయించిన తేజస్ విమానాల వద్దకు చేరుకొన్నారు. భారత పైలట్‌తో కలిసి జపాన్ వాయుసేన అధిపతి విమానం నడపగా.. ఐఏఎఫ్ చీఫ్ స్వయంగా మరో తేజస్ విమానాన్ని నడిపారు. ఈ విన్యాసాల్లో భారత్-జపాన్ యుద్ధ వ్యూహాలను కూడా పంచుకొన్నాయి. ఈ విన్యాసాల్లో భారత్ సుఖోయ్-30 ఎంకెఐ, రఫేల్ ఫైటర్ జెట్, ఎల్సీఏ తేజస్ విమానాలు భారత్ నుంచి పాల్గొనగా.. జేఏఎస్‌డీఎఫ్ నుంచి ఎఫ్-2ఏ ఫైటర్ జెట్ పాల్గొంది.

## పాము నోట్లో నోరు పెట్టి.. ప్రాణాలు కాపాడి!



గుజరాత్లోని వల్సాడ్ జిల్లా వాపీ పారిశ్రామిక ప్రాంతంలో ఆశ్చర్యకర ఘటన చోటుచేసుకుంది. అక్కడ ఉన్న ఒక కంపెనీ ప్రాంగణంలో విషరహిత పాము ఒకటి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గుర్తించి రెస్క్యూ చేశారు. ఆ సమయంలో ఆ పాము శరీరంలో ఎలాంటి కదలికలు లేకపోవడంతో పాటు దాని పరిస్థితి విషమంగా మారింది. సాధారణంగా పాము కనిపిస్తే భయంతో దూరంగా పరుగులు తీసే పరిస్థితుల్లో, అక్కడ జరిగిన విషయం అందరినీ ఆశ్చర్యపరిచింది.

అపస్మారక స్థితిలో ఉన్న పామును చూసిన జంతు ప్రేమికుడు సంజయ్ పవార్ వెంటనే స్పందించారు. మూగజీవి ప్రాణాన్ని కాపాడేందుకు ఆయన వెంటనే దానికి సీపీఆర్ (కార్డియోపల్మోనరీ రిససిటేషన్) ప్రక్రియను ప్రారంభించారు. తన నోటితో ఆ పాము నోట్లోకి గాలిని ఊదుతూ కొంత సమయం పాటు నిరంతరం శ్వాస అందించే ప్రయత్నం చేశారు. ఆయన ప్రయత్నం ఫలించి, కాసేపటికి పాము శరీరంలో మెల్లగా కదలికలు మొదలయ్యాయి.

సంజయ్ పవార్ అందించిన అత్యవసర సాయంతో పాము ప్రాణాపాయం నుంచి బయటపడటంతో అక్కడున్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలను అక్కడి వ్యక్తులు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయగా, అది కాస్తా వైరల్ గా మారింది. కేవలం మనుషులకే కాకుండా, మూగజీవుల పట్ల కూడా కరుణ, ప్రేమను ప్రదర్శించవచ్చని నిరూపించిన సంజయ్ పవార్‌ను నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

# ఫేక్ ఇన్‌స్టా ఖాతా, చాట్ జీపీటీ వినియోగం

### - కేతన్ అగర్వాల్ హత్య కేసులో ఛార్జిషీట్ దాఖలు

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ కేసులో పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేశారు. శనివారం పుణె కోర్టులో 5,053 పేజీల ఛార్జిషీట్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా హత్య పథక రచన నుంచి అమలు వరకు జరిగిన అన్ని అంశాలను వివరించారు. పోలీసుల ఛార్జిషీట్ ప్రకారం.. కేతన్ అగర్వాల్ (25)కు సియా గోయల్ (20)తో వివాహం జరగాల్సి ఉంది. వీరికి ఈ ఏడాది ఫిబ్రవరిలో నిశ్చితార్థం జరగగా.. నవంబర్‌లో జైపూర్ వేదికగా అంగరంగ వైభవంగా వివాహం జరగాల్సి ఉంది.



అయితే కేతన్ అగర్వాల్‌ను వివాహం చేసుకోవడం సియా గోయల్‌కు ఇష్టం లేదని పోలీసులు తెలిపారు. ఈ కారణంగానే అతన్ని హత్య చేయాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ చౌదరి, రితేష్ హంగే అనే మరో నిందితుడు పథకం రచించినట్లు వెల్లడించారు.

నిందితులు కేతన్‌ను లోహగఢ్ కోటకు తీసుకువెళ్లడానికి అనేక ప్రయత్నాలు చేశారన్నారు. అక్కడి వెళ్లడానికి కేతన్ ఒప్పుకోకపోయినా సియా పట్టుబట్టి మరీ తీసుకువెళ్లిందని పేర్కొన్నారు. మొదట కోట వద్దకు రానని కేతన్ చెప్పడంతో అతడిని ఎలాగైనా ఒప్పించాలనే ఆలోచనతో 'మహి' అనే పేరుతో సియా ఓ ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా క్రియేట్ చేసింది. ఇందుకు ఈ కేసులో మూడో నిందితుడైన రితేశ్ హింగే ఆమెకు సహకరించాడు. మహి, కేతన్ స్నేహితురాలు కావడంతో ఆమె మెసేజ్ చేస్తోందనుకొని ఇన్‌స్టాలో వాట్ చేసేవాడు. సియా పుట్టిన రోజున సర్‌ప్రైజ్ ఇవ్వడానికి లోహగఢ్ కోటకు తీసుకువెళ్లమని.. అక్కడ వ్యూ చాలా బాగుంటుందని అతడిని ఒప్పించడానికి ప్రయత్నించారు. హత్య అనంతరం పోలీసులకు దొరకకుండా ఉండేందుకు ఆ నకిలీ ఖాతాను తొలగించారు.

కేతన్‌ను అంతమొందించాలని నిర్ణయించుకున్న తరువాత.. సియా, చేతన్.. హత్యలకు సంబంధించిన అనేక సినిమాలు చూశారు. పోలీసులకు దొరక్కుండా ఎలా బయటపడాలో తెలుసుకోవడానికి చాట్ జీపీటీని ఉపయోగించారు. అనేక పాడ్‌కాస్ట్‌లను విన్నారు. అదే సమయంలో రాజా రఘువంశీకి సంబంధించిన మేఘాలయ హనీమూన్ హత్య కేసును కూడా పరిశీలించారు. ఆనంతరం కేతన్ హత్యకు ప్లాన్ వేశారు. గతేడాది మార్చిలో లోహగఢ్ కోటలోని వ్యూ పాయింట్ నుంచి ఓ మహిళ కిందపడి, ప్రాణాలు కోల్పోవడంతో.. అదే సరైన స్పాట్ అని నిర్ణయించుకున్నారు. అక్కడి నుంచి కేతన్‌ను తోసేసినా ప్రమాదశాత్తు పడిపోయాడని నమ్మించవచ్చని అనుకున్నారు.

జూన్ 18న సియాను ఆ యువ వ్యాపారవేత్త అక్కడికి తీసుకెళ్లగా.. నిందితులు కోట పైనుంచి తోసి హత్య చేశారని పోలీసులు వెల్లడించారు. జూన్ 14న కూడా అదే ప్రాంతంలో హత్యకు ప్లాన్ చేసి విఫలమయ్యారని చెప్పుకొచ్చారు. ఈ మేరకు సియా, చేతన్, రితేష్ హంగేను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. కాగా, ఈ కేసు ఛార్జిషీట్‌లో ఐదుగురు ప్రత్యక్ష సాక్షులతో సహా 100 మందికి పైగా వ్యక్తుల వాంగ్మూలాలను పోలీసులు పొందుపరిచారు. నిందితుల మొబైల్ ఫోన్ డేటా, వాట్సాప్ చాట్‌లు, ఫొటోలు, కాల్ రికార్డులు వంటివి కోర్టుకు సమర్పించారు.

# స్టాండ్-అప్ కమెడియన్‌గా మారిన రాహుల్

### - మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ ఎద్దేవా

ఇండోర్‌లో తాజాగా జరిగిన 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీని అనుకరిస్తూ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో కమెడియన్ పుల్కిత్ మణి చేసిన (మిమిక్రీ) వ్యాఖ్యలపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీ స్టాండ్-అప్ కమెడియన్‌గా మారితే మంచి ఉపాధి లభిస్తుందని, ఇప్పటికే కాంగ్రెస్ పార్టీని ఆయన ఓ నిరుద్యోగిగా మార్చేశారని ఎద్దేవా చేశారు.

ముంబైలో ఆదివారం మీడియాతో మాట్లాడిన సీఎం దేవేంద్ర ఫడ్నవీస్.. 'రాహుల్ గాంధీకి ఇప్పుడు మిగిలిన ఏకైక పని ఇదే. ఆయన స్టాండ్-అప్ కమెడియన్ అవతారం ఎత్తి మిమిక్రీ చేస్తే మంచి ఉద్యోగం లభిస్తుంది. పొలిటికల్ పార్టీకి ఎలాగూ పనేమీ లేదు కదా అని వ్యాఖ్యానించారు.



బీహార్ బీజేపీ అధ్యక్షుడు సంజయ్ సారావోగి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు, చేష్టలు ఆయన రాజకీయ అపరిపక్వతను, స్థాయి దిగజార్చే ప్రవర్తనను తెలియజేస్తున్నాయని విమర్శించారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత స్థానంలో ఉండి ప్రధాని మాతృమూర్తిని అవమానించేలా ప్రవర్తించడం సభ్యసమాజం అంగీకరించదని పేర్కొన్నారు.

మరోవైపు కాంగ్రెస్ నేత రషీద్ అల్వీ.. రాహుల్ గాంధీకి మద్దతుగా నిలిచారు. అది కేవలం ఒక సాధారణ 'మిమిక్రీ' మాత్రమేనని, అందులో అభ్యంతరకరమైనది ఏమీ లేదని స్పష్టం చేశారు. సభలోని మహిళలు, ప్రజలు నవ్వుకున్నారని, నిజమైన అవమానం అంటే గతంలో సోనియా గాంధీపై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలేనని ఆయన తిప్పికొట్టే ప్రయత్నం చేశారు.


ఇండోర్ ఈవెంట్‌లో రాహుల్ గాంధీ, కమెడియన్ పుల్కిత్ మణితో కలిసి చేసిన వ్యాఖ్యలు/చేష్టలు ప్రధానిని, ఆయన తల్లిని ఉద్దేశించి గేలి చేసేలా ఉన్నాయని బీజేపీ ఆరోపించడంతో ఈ రాజకీయ వివాదం రాజుకుంది.

# బ్రిడ్జిపై నుండి పడిన కారు: ముగ్గురు మృతి

మితిమీరిన వేగంతో ప్రయాణిస్తోన్న ఓ విలాసవంతమైన కారు వంతెనపై నుంచి పడి ముగ్గురు మృతి చెందిన ఘటన ముంబయిలో చోటు చేసుకొంది. ముంబైలోని కోస్టల్ రోడ్డుపై ఆదివారం తెల్లవారుజామున వేగంగా వెళ్తున్న బ్లాక్ బీఎండబ్ల్యూ కారు అదుపుతప్పి బ్రిడ్జి గోడను ఢీకొట్టి కిందపడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, మరో 20 ఏళ్ల యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని నాయర్ ఆసుపత్రిలోని ట్రామా వార్డులో చికిత్సకు తరలించారు.

పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, బీఎండబ్ల్యూ కారు మెరైన్ డ్రైవ్ నుంచి హాజీ అలీ వైపు కోస్టల్ రోడ్డుపై ప్రయాణిస్తోంది. లొటస్ జెట్టీ సమీపంలో కారు అదుపు తప్పి బ్రిడ్జి సరిహద్దు గోడను ఢీకొట్టింది. అనంతరం బ్రిడ్జిపై నుంచి కిందకు పడిపోయింది. ప్రమాదం ఆదివారం ఉదయం సుమారు 5:20 గంటలకు జరిగినట్లు కోస్టల్ రోడ్ కంట్రోల్ రూమ్ తెలిపింది. కారులో ఉన్న నలుగురినీ నాయర్ ఆసుపత్రికి తరలించారు. అయితే వారిలో ముగ్గురు ఆసుపత్రికి తీసుకువచ్చే సమయానికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు.

ప్రమాద తీవ్రతకు కారు దెబ్బతిన్న తీరు అద్దం పడుతోంది. బ్రిడ్జిపై ఉన్న సూచిక బోర్డును కారు ఢీకొట్టడంతో అది కూడా దెబ్బతింది. బీఎండబ్ల్యూ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. విండ్‌షీల్డ్ పగిలిపోయింది, పైకప్పు లోపలికి వంగిపోయింది. బంపర్ ఊడిపోవడంతో కారు అంతర్గత భాగాలు బయటకు కనిపించే స్థాయిలో వాహనం దెబ్బతింది. అతి వేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.





## గణనాథుడికి రోబో హారతి

దేశవ్యాప్తంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్న వేళ.. గుజరాత్లో రెండు రోబోలు స్వామి సేవలో పాల్గొని భక్తులను ఆకట్టుకుంటున్నాయి. రాజ్‌కోట్‌లోని కేపీఎస్ క్లబ్ ఆధ్వర్యంలో వినాయక మండపంలో రోబోలను ఏర్పాటు చేశారు. అందులో ఒకటి గణనాథుడికి హారతి ఇస్తుండగా.. మరొకటి గంట మోగిస్తోంది. చిన్నారులకు, వృద్ధులకు ఆధునిక సాంకేతికతపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ తరహా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గణేషుడి దర్శనంతో పాటు రోబోలను చూసేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు.



చైతన్యరథం

# అమెరికా ఆధిపత్యం ముగిసింది

- ఆ దేశం హామీలు నెరవేర్చేవరకు హోర్ముజ్ మూసే ఉంటుంది
- పార్లమెంట్ స్పీకర్ ఘాలిబాఫ్ స్పష్టీకరణ



పశ్చిమాసియా ప్రాంతంపై అమెరికా ఆధిపత్యం ముగిసిపోయిందని, ఈ ప్రాంతంలోని ఇస్లామిక్ దేశాలే నూతన వ్యవస్థను నిర్మించాలని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగేర్ ఘాలిబాఫ్ అన్నారు. హోర్ముజ్ జలసంధిపై తమ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, అమెరికా గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకూ జలసంధి మూసే ఉంటుందని స్పష్టం చేశారు. ఇరాన్ పార్లమెంట్‌ను ఉద్దేశించి మాట్లాడిన ఆయన, గతంలో కుదిరిన అవగాహన ఒప్పందాన్ని అనుసరించిఇచ్చిన మాట కు అమెరికా కట్టుబడి ఉండాల్సిందేనని అన్నారు. తాము చెప్పదలుచుకున్నది స్పష్టంగా అమెరికాకు మధ్యవర్తుల ద్వారా చేరవేశామని చెప్పారు. 'మోసం, ఏకపక్ష ధోరణులకు కాలం చెల్లిందని శత్రువుకు అర్థమైపోయింది. మాకు ఇచ్చిన హామీ లకు కట్టుబడి ఉండే వరకూ, ఇరాన్ హక్కులను గుర్తించే వరకూ హోర్ముజ్ మూసే ఉంటుంది. చర్చలకూ అవకాశం ఉండదని స్పష్టం చేశారు.

గత ఏడు నెలలుగా శత్రువులకు ఇరాన్ తగిన రీతిలో జవాబు ఇస్తోందని, అమెరికా ఆధిపత్యం కుప్పకూలిందని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహసేన్ రెజాయ్ కూడా స్పందిస్తూ.. అమెరికాతో చర్చలు ప్రారంభించాలంటే ఇరాన్ విధించిన 7 షరతులను వాషింగ్టన్ అంగీకరించాల్సిందేనని స్పష్టం చేశారు.

అమెరికాతో దౌత్య సంబంధాలు, ప్రాంతీయ ఉద్రిక్తతల నడుమ ఇరాన్ సైనిక సిద్ధతను, వివేకవంతమైన వ్యూహాలను సమతుల్యం చేసుకుంటూ ముందుకెళ్తుందని ఖాలిబాఫ్ పునరుద్ఘాటించారు.

అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఇరాన్ అమెరికా ముందు పలు డిమాండ్స్ పెట్టింది. ఇరాన్ పోర్టుల చుట్టూ దిగ్బంధనం తొలగింపు, ఆంక్షల ఎత్తివేత, విదేశాల్లోని ఇరాన్ ఆస్తుల విడుదల, ఇరాన్‌పై బెదిరింపులకు ముగింపు పలకడం, అన్ని రకాల మిలిటరీ చర్యలను కట్టిపెట్టడంపై జూన్‌లో ఒప్పందం ప్రకారం మాట నిలబెట్టుకోవాలని యూఎస్‌ను డిమాండ్ చేసింది.

అణుకార్యక్రమం సహా పలు అంశాలపై కూలంకషంగా చర్చించేందుకు అమెరికా, ఇరాన్ మధ్య జూన్‌లో ఈ అవగాహన ఒప్పందం కుది రింది. కాల్పుల విరమణ నేపథ్యంలో ఇరు దేశాలు ఒప్పందానికి అంగీకరించాయి. ఆ తరువాత 60 రోజుల్లో పూర్తిస్థాయి శాంతి ఒప్పందం కుదుర్చు కోవాలని నిర్ణయించుకున్నాయి. అయితే, హోర్ముజ్ పై భేదాభిప్రాయాల నేపథ్యంలో ఒప్పందం కథ ముగిసినట్లేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ జులై 7న ప్రకటించారు. ఒప్పందాన్ని పక్కన పెట్టే సినట్టు ఆ మరుసటి వారం ఇరాన్ కూడా ప్రకటిం చింది. ఆ తరువాత ఇరాన్, అమెరికాలు పరస్పర దాడులకు దిగడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ పతాకస్థాయికి చేరుకున్నాయి.

# పశ్చిమాసియా దేశాల్లో అప్రమత్తంగా ఉండండి

## - తమ పౌరులకు అమెరికా భద్రతా హెచ్చరిక



పశ్చిమాసియాలో తాజాగా పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా కీలక భద్రతా హెచ్చరిక జారీ చేసింది. ఈ ప్రాంతంలోని భద్రతా పరిస్థితి సంక్లిష్టంగా ఉందని, పరిస్థితులు చాలా త్వరగా మారిపోయే అవకాశం ఉందని అమెరికా విదేశాంగ శాఖ హెచ్చరించింది. అమెరికన్లు అప్రమత్తంగా ఉండాలని, ఈ ప్రాంతానికి వెళ్లే లేదా అక్కడి నుంచి ప్రయాణించే వారు విమాన సర్వీసులు, విమానాశ్రయాల తాజా సమాచారాన్ని గమనించాలని సూచించింది.

పశ్చిమాసియా దేశాల్లో ఉన్న అమెరికన్లు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆ దేశ విదేశాంగ శాఖ సూచించింది. విమానాల రద్దు, గగనతల మూసివేత, ఇతర ప్రయాణ అంతరా యాలు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించింది. పశ్చిమాసియా వెలుపల ఉన్న అమెరికన్లు ఆ ప్రాంతానికి వెళ్లాలనుకున్నా లేదా ఈ ప్రాంతం మీదుగా ప్రయాణించాలనుకుంటున్నా పునరాలో చించాలని అమెరికా సూచించింది.సౌదీ అరేబియా రాజధాని రియాద్‌పై యెమెన్‌కు చెందిన హౌతీలు క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసినట్లు ప్రకటించిన నేపథ్యంలో అమెరికా తాజాహెచ్చరిక వెలువడింది.

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణల ప్రభావం అమెరికా పౌరులు, వ్యాపార సంస్థలు, దౌత్య కార్యాలయాలపై కూడా పడే అవకాశం ఉందని అమెరికా విదేశాంగ శాఖ పేర్కొంది. ఇరాన్ లేదా దానికి మద్దతు ఇచ్చే గ్రూపులు అమెరికా ప్రయోజనాలను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని హెచ్చరించింది. అందువల్ల అమెరికన్లు తమ పరిసరాలపై అప్రమత్తంగా ఉండాలని, స్థానిక అధికారుల సూచనలు పాటించాలని కోరింది.

అమెరికా తాజాగా జారీ చేసిన హెచ్చరిక పశ్చిమాసియాలోని పలు దేశాలను కవర్ చేస్తోంది. బహ్రెయిన్, ఈజిప్ట్, ఇరాన్, ఇరాక్, ఇజ్రాయెల్, జోర్డాన్, కువైట్, లెబనాన్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, సిరియా, యూఏఈ, యెమెన్ తదితర ప్రాంతాల్లో ప్రయాణించే అమెరికన్లు తాజా భద్రతా సమాచారాన్ని గమనించాలని సూచించారు. సౌదీ అరేబియాకు సంబంధించి అమెరికా ప్రస్తుతం 'రీకన్సిడర్ ట్రావెల్' (ప్రయాణించే ముందు ఆలోచించండి) స్థాయి హెచ్చరికను కొనసాగి స్తోంది. యెమెన్‌కు మాత్రం 'డూ నాట్ ట్రావెల్' (ప్రయాణం వద్దు) స్థాయి హెచ్చరిక ఉంది.

# సౌదీకి అండగా ఉంటాం: తుర్కియే

సౌదీపై హౌతీల దాడులతో పరిస్థితి అంతకంతకూ ఉద్రిక్తంగా మారుతున్న వేళ తుర్కియే స్పందించింది. సౌదీకి అవసరమైన సైనిక సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేసింది. ఇప్పటికే పాకిస్థాన్‌తో కలిసి సౌదీలో రక్షణ ఒప్పందం చేసుకున్న తుర్కియే ఇప్పుడు సైనిక-సాంకేతిక సాయం చేస్తామని ప్రకటించడం పశ్చిమాసియాలో కొత్త ఉద్రిక్తతలకు తెరలేపింది. సౌదీకి అవసరమైన సైనిక సహాయం అందించేందుకు తుర్కియే సిద్ధంగా ఉందని ఆ దేశ విదేశాంగ మంత్రి హకాన్ ఫిడాన్ ప్రకటించారు. ముఖ్యంగా సైనిక సాంకేతిక అవసరాలను తీర్చేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. ఈ పరిణామం ఇటీవల తుర్కియే, సౌదీ, పాకిస్తాన్ మధ్య కుదిరిన మక్కా సంయుక్త రక్షణ ఒప్పందంపై మరోసారి దృష్టిని మళ్లించింది.

సౌదీ రాజధాని రియాద్ సహా పలు ప్రాంతాలపై హౌతీలు దాడులు చేస్తున్నారు. శనివారం రియాద్ లోని కీలక ప్రాంతాలను క్షిపణులు, డ్రోన్లతో లక్ష్యంగా చేసుకున్నట్లు హౌతీలు వెల్లడించారు. ఇదే సమయంలో రియాద్ నగరంలోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో మంటలు, భారీగా పొగ కనిపించింది. సౌదీ అధికారులు రియాద్ వైపు వచ్చిన. బాలిస్టిక్ క్షిపణిని అడ్డుకున్నట్లు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ప్రాణనష్టం జరిగినట్లు వెల్లడించలేదు. అయితే, హౌతీల దాడులు కేవలం రాజధాని రియాద్‌కు మాత్రమే పరిమితం కావడం లేదు. ఇంధన మౌలిక వసతులు, నగ రాలు, సముద్ర రవాణా మార్గాలపైనా దాడుల ముప్పు పెరిగింది. దీంతో ప్రపంచ చమురు సరఫరా, ఎర్ర సముద్ర వాణిజ్య మార్గాలపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.


ఈ పరిస్థితుల్లో తుర్కియే విదేశాంగ మంత్రి హకాన్ ఫిడాన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సౌదీ అరేబియా ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వంపై తీవ్రమైన దాడులు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. సౌదీకి కొన్ని సైనిక అవసరాలు, ముఖ్యంగా సాంకేతిక రంగంలో అవసరాలు ఉండొచ్చని.. వాటిని తీర్చేందుకు తుర్కియే సిద్ధం గా ఉందని చెప్పారు. ఇదే సమయంలో యుద్ధాన్ని మరింత విస్తరించకుండా దౌత్యపరమైన పరిష్కారం కోసం కూడా తుర్కియే ప్రయత్నిస్తున్నట్లు ఫిడాన్ తెలిపారు.





## త్వరలో అమెరికాకు
# ఇరాన్ అధ్యక్షుడు

ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ మరికొన్ని రోజుల్లో అమెరికాకు వెళ్లనున్నారు. ఇందుకు సంబంధించి ఇరాన్ మీడియా సంస్థ తస్నీమ్ ఓ కథనాన్ని ప్రచురించింది. న్యూయార్క్‌లో ఐక్యరాజ్య సమితి సమావేశాల్లో పాల్గొనేందుకు ఆయన వెళ్లనున్నట్లు వెల్లడించింది. అధ్యక్షుడితో పాటు, విదేశాంగ శాఖ మంత్రి అరాగ్చీ, వారి బృందంలోని ఇతర సభ్యులందరికీ ఇప్పటికే వీసాలు కూడా మంజూరు అయినట్లు వెల్లడించింది. సెప్టెంబర్ 22 – 29 మధ్య ఐక్యరాజ్య సమితి సమావేశాలు జరగనున్నాయి.



యూఎస్ వీసాలు మంజూరు అయినప్పటికీ ఇరాన్ బృందంపై పలు ఆంక్షలు ఉన్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అమెరికాలో పర్యటనలపై పరిమితులు, విలాసవంతమైన వస్తువుల కొనుగోళ్లపై ఆంక్షలు విధించినట్లు సమాచారం. ప్రస్తుతం ఇరాన్, అమెరికాల మధ్య ఉద్రిక్తతలు పతాకస్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే. దీంతో, అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పతాకస్థాయికి చేరుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఇంధన భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. మరోవైపు, ఇరాన్ విషయంలో ఐక్యరాజ్య సమితిలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్‌పై ఆంక్షల విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనను ఇప్పటికే రష్యా, చైనాలు వీటో చేశాయి.

## రష్యాపై వెయ్యి డ్రోన్లతో
# విరుచుకుపడ్డ ఉక్రెయిన్



రష్యా-ఉక్రెయిన్ మధ్య దాడులు తీవ్రస్థాయిలో కొనసాగుతున్నాయి. శనివారం రాత్రి ఉక్రెయిన్ దళాలు రష్యాపై ఏకంగా వెయ్యికిపైగా డ్రోన్లతో విరుచుకుపడ్డాయి. మాస్కోలోని పలు ప్రదేశాలు లక్ష్యంగా దాడులు చేపట్టినట్లు ఉక్రెయిన్ సైన్యం వెల్లడించింది. మాస్కో ఆయిల్ రిఫైనరీకి సమీపంలోనూ ఈ దాడులు జరగడంతో అక్కడ పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. భారీగా పొగ వ్యాపించింది. యుద్ధం మొదలైనప్పటి నుంచి దేశ రాజధానిపై ఈ స్థాయిలో గగనతల దాడులు చేపట్టడం ఇదే మొదటిసారని మాస్కో మేయర్ అభివర్ణించారు. మరో 450 ఉక్రెయిన్ డ్రోన్లను తమ దళాలు కూల్చివేశాయన్నారు.

పలు డ్రోన్లు మాస్కోలోని కీలక ఆయిల్ రిఫైనరీలు సహా నాలుగు భవనాలను తాకినట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు క్రిమియా పైనా ఉక్రెయిన్ పెద్ద ఎత్తున దాడులు కొనసాగిస్తోంది. సైనిక సరఫరాలను, విద్యుత్తు వ్యవస్థల్ని స్తంభింపజేసేలా తాజా దాడులు జరిపింది. వీటి కారణంగా మాస్కోలోని ప్రధాన విమానాశ్రయాలు తాత్కాలికంగా మూతపడ్డాయి. దీంతో పలు విమానాలు రద్దుకాగా.. మరికొన్ని ఆలస్యంగా నడిచాయి. రష్యాలో త్వరలో పార్లమెంటరీ ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఉక్రెయిన్ మాస్కోపై దాడులు తీవ్రం చేయడం గమనార్హం.

ఈ దాడులపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ మాట్లాడుతూ.. శనివారం రాత్రి మాస్కోలోని అనేక ప్రాంతాలను మా దళాలు లక్ష్యం చేసుకున్నాయి. రష్యాకు చెందిన ఓ కీలక చమురు కర్మాగారం ధ్వంసమైంది. ఇందుకుగానూ మా భద్రతా దళాలు, గూఢచార విభాగం, ప్రత్యేక దళాలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ఇకనైనా మాస్కో యుద్ధాన్ని ముగించి.. శాంతిని ఎంచుకోవాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు.

# దేశానికే గర్వకారణం

**- భారత షూటర్లకు ప్రధాని మోదీ అభినందనలు**



జపాన్ వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడల్లో సత్తా చాటిన భారత షూటర్లను ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్, వ్యక్తిగత విభాగాల్లో భారత్‌కు రెండు రజత పతకాలు దక్కాయి. టీమ్ ఈవెంట్‌లో ఎలావెనిల్ వలరివన్, సోనం ఉత్తమ్ మాస్కర్, విదర్భ వినోద్ రజతం సాధించగా.. వ్యక్తిగత విభాగంలోనూ వలరివన్ మరో సిల్వర్ మెడల్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.

ఒకే రోజు రెండు రజత పతకాలు సాధించిన ఎలావెనిల్ వలరివన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేకంగా అభినందించారు. భారత షూటర్లు దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారని పేర్కొంటూ.. ఎలావెనిల్ సాధించిన రెండో పతకం ఈరోజును మరింత ప్రత్యేకంగా మార్చిందని అన్నారు. టీమ్ ఈవెంట్‌లో రజతం సాధించిన వలరివన్, సోనం ఉత్తమ్ మాస్కర్, విదర్భ వినోద్‌లను కూడా ప్రధాని అభినందించారు. వారి కృషి, టీమ్‌వర్క్ అద్భుత ఫలితాన్ని అందించాయని పేర్కొన్నారు. వారి విజయం రాబోయే రోజుల్లో మరెంతో మంది క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందని అన్నారు.



# ఎలావెనిల్ వలవరిన్ అద్భుతం

**- ఆసియా క్రీడల షూటింగ్‌లో భారత్‌కు రెండు పతకాలు**



2026 ఆసియా క్రీడల్లో భారత యువ షూటర్ ఎలావెనిల్ వలవరిన్ అద్భుతంచేసింది. టీమ్ విభాగంలో రజతం సాధించిన ఆమె.. వ్యక్తిగత విభాగంలోనూ పతకం సొంతం చేసుకుంది. 10 మీటర్ల రైఫిల్ విభాగంలో రజత పతకం సాధించింది. జపాన్‌కు చెందిన హినట టైచి 253పాయింట్లు సాధించి స్వర్ణం కైవసం చేసుకుంది. వలవరిన్ 252.4 పాయింట్లతో సిల్వర్ మెడల్‌ను దక్కించుకుంది.సౌత్ కొరియా షూటర్ బాన్ హ్యోజిన్ (230.4) మూడో స్థానంలో నిలిచి కాంస్యం అందుకొంది.

**టీమ్ ఈవెంట్లోనూ..**

అంతకుముందు ఆసియా క్రీడల్లో భారత్‌కు తొలి పతకం షూటింగ్ విభాగంలో వరించింది. ఎలావెనిల్ వలరివన్, సోనం, విదర్భ వినోద్‌ల త్రయం అద్భుత ప్రదర్శనతో రెండో స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకుంది. ఈ విభాగంలో చైనా స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది.

# స్మృతి అరుదైన ఘనత

భారత మహిళల క్రికెట్ స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన మరో అరుదైన ఘనత సాధించింది. మహిళల టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధికపరుగులు చేసిన బ్యాటర్‌గా స్మృతి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఆసియా క్రీడల్లో భాగంగా ఆదివారం బంగ్లాదేశ్‌తో జరిగిన సెమీఫైనల్‌లో ఈ మైలురాయిని అందుకుంది. న్యూజిలాండ్ మాజీ స్టార్ సుజీ బేట్స్‌ను అధిగమించి ఈ రికార్డును తన పేరిట లిఖించుకుంది. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌కు ముందు మహిళల టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన రికార్డు సుజీ బేట్స్ (4,758 పరుగులు) పేరిట ఉండేది. అయితే బంగ్లాపై 37 పరుగులు చేసిన స్మృతి.. 4,765 పరుగులు నమోదు చేసి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ జాబితాలో టీమిండియా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్(4,287 పరుగులు) మూడో స్థానంలో కొనసాగుతోంది.

# షెఫాలీ ఊచకోత!

- **ఆసియా కప్ మహిళల క్రికెట్ సెమీస్‌లో బంగ్లాను చిత్తుచేసిన భారత్**
- **రేపు శ్రీలంకతో ఫైనల్ పోరు**



ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో పతకం ఖాయమైంది. క్రికెట్లో భారత మహిళా జట్టు ఫైనల్‌కు చేరుకుంది. సెమీస్ లో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. దీంతో శ్రీలంకతో తుది పోరులో తలపడనుంది. మంగళవారం ఫైనల్ జరగనుంది. ఇక కాంస్య పతకం కోసం పాకిస్థాన్, బంగ్లాదేశ్ తలపడతాయి.

టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ (100 నాటౌట్: 49 బంతుల్లో 3 ఫోర్లు, 9 సిక్సులు) శతకంతో విజృంభించింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ (40), స్మృతి మంధాన (37) రాణించారు. అనంతరం లక్ష్య ఛేదనలో బంగ్లాదేశ్ 15.4 ఓవర్లలో 81 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ దిలారా అక్తెర్ (27) టాప్ స్కోరర్. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3, నందని శర్మ 3. శ్రీ చరణి 2.. క్రాంతి గౌడ్, శ్రేయాంక పాటిల్ చెరో వికెట్ తీశారు.

**షఫాలీ వీరబాదుడు**

ఆసియా కప్ నుంచి మంచి ఫామ్‌లో ఉన్న షఫాలీ వర్మ.. ఇప్పుడు ఆసియా గేమ్స్ లోనూ అదే ఊపు కొనసాగిస్తోంది. సెమీస్ లో బంగ్లా బౌలింగ్‌ను ఊచకోత కోసింది. ఓపెనర్‌గా వచ్చి చివరి ఓవర్ వరకూ క్రీజ్లో ఉండిపోయిన ఆమె.. సిక్సర్ల వర్షం కురిపించింది. స్మృతి మంధానతో కలిసి తొలి వికెట్కు 72 పరుగుల భాగస్వామ్యం నిర్మించింది. గుణాలన్ కమలిని (3) విఫలమైనా.. హర్మన్ తో కలిసి షఫాలీ మరింత దూకుడుగా ఆడింది. 94 పరుగులు జోడించింది. ఆఖర్లో రిచా ఘోష్ (9 నాటౌట్) సిక్స్ కొట్టడంతో భారత్ స్కోరు 190 దాటేసింది. బంగ్లా బౌలర్లలో మరుఫా, షానిదా, రెబయా, నహిదా తలో వికెట్ తీశారు.

# సింధు బృందం శుభారంభం

**- ఆసియా క్రీడల క్వార్టర్స్‌కు మహిళల బ్యాడ్మింటన్ జట్టు**



జపాన్ వేదికగా జరుగుతున్న ఆసియా గేమ్స్ 2026లో భారత మహిళల బ్యాడ్మింటన్ జట్టు శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన రౌండ్ ఆఫ్ 16 (ప్రీక్వార్టర్స్) పోరులో భారత్ 3-0తో కజకిస్థాన్‌ను చిత్తు చేసి క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. ఈ మ్యాచ్లో భారత షట్లర్లు పీవీ సింధు, ఉన్నతి హుడా, తన్వి శర్మలు అద్భుత ప్రదర్శనతో ప్రత్యర్థి జట్టును ఓడించారు. వీరి ధాటికి కజకిస్థాన్ ఆటగాళ్లు చేతులెత్తేశారు.

మొదటి సింగిల్స్‌లో కామిలా స్మాగులోవాపై 21-7, 21-9 తేడాతో పీవీ సింధు ఘనవిజయం సాధించింది. అనంతరం రెండో సింగిల్స్‌లో అలెస్యా కులేషోవాను 21-7, 21-10 తేడాతో ఉన్నతి హుడా ఓడించి భారత ఆధిక్యాన్ని 2-0కి పెంచింది.

ఇక మూడో సింగిల్స్‌లో దయానా నమేసోవాపై 21-5, 21-10 తేడాతో తన్వి శర్మ విజయం సాధించి 3-0తో క్లీన్ స్వీప్ పూర్తి చేసింది. ఈ భారత త్రయం కేవలం 65 నిమిషాల్లోనే ప్రత్యర్థులను ఓడించటం విశేషం. మంగళవారం జరిగే క్వార్టర్ ఫైనల్లో ఆతిథ్య జపాన్ జట్టుతో భారత బృందం తలపడనుంది. మొదటి రౌండ్లో 'బై' పొందిన జపాన్, క్వార్టర్స్‌లో భారత జట్టుకు గట్టి పోటీనిచ్చేందుకు సిద్ధంగా ఉంది.

# న్యూజీలాండ్‌లో టీమిండియా బిజీ షెడ్యూల్

- **వన్డే సిరీస్ ముగిసిన మూడు రోజులకే టెస్ట్ మ్యాచ్‌లు**
- **డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలంటే ఈ సిరీస్ కీలకం**
- **దీంతో చివరి రెండు వన్డేలకు గిల్ సహా కీలక ఆటగాళ్లకు విశ్రాంతి**

వచ్చే నెలలో భారత క్రికెట్ జట్టు న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనుంది. అక్కడ 5 టీ20లు, 5 వన్డేలు, 2 టెస్ట్ సిరీస్‌లు ఆడనుంది. అక్టోబర్ 22 నుంచి డిసెంబర్ 1 వరకు సుదీర్ఘంగా సాగే ఈ టూర్‌కు ముందు టీమిండియాకు కొత్త సమస్య వచ్చి పడింది. షెడ్యూల్ బిజీగా ఉండటంతో చివరి రెండు వన్డేలకు పలువురు కీలక ప్లేయర్లకు విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా వన్డే సిరీస్ ముగిసిన మూడు రోజులకే టెస్టు సిరీస్ ప్రారంభం కానుండటం టీమిండియా మేనేజ్‌మెంట్‌కు సవాలుగా మారనుంది.

శుభ్‌మన్ గిల్, జస్‌ప్రీత్ బుమ్రా, కేఎల్ రాహుల్, నితీశ్ కుమార్ రెడ్డి, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్ వంటి ఆటగాళ్లు వన్డేతో పాటు టెస్టు జట్లలోనూ ఆడే అవకాశం ఉంది. దీంతో వారి పనిభారాన్ని దృష్టిలో ఉంచుకుని.. న్యూజిలాండ్‌తో చివరి రెండు వన్డేలకు విశ్రాంతి ఇవ్వాలని టీమిండియా భావిస్తున్నట్లు సమాచారం. బిజీ షెడ్యూల్‌ను సమర్థంగా నిర్వహించేందుకు భారత కోచింగ్ సిబ్బందిని కూడా రెండు బృందాలుగా విభజించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్, అసిస్టెంట్ కోచ్ సితాన్షు కోటక్, ఫీల్డింగ్ కోచ్ శుభదీప్ ఘోష్.. ఈ నలుగురిలో ఇద్దరు వన్డే జట్టుతో ఉండనున్నారు. మిగిలిన ఇద్దరు టెస్టు జట్టును పర్యవేక్షించే అవకాశం ఉంది.

**డబ్ల్యూటీసీలోనూ కీలకమే..**

రెండు టెస్టుల ఈ సిరీస్ ప్రస్తుత ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) సైకిల్‌లోనూ కీలకం కానుంది. న్యూజిలాండ్ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో ఉండగా.. భారత్ ఐదో స్థానంలో కొనసాగుతోంది. నవంబర్ 19 నుంచి 23 వరకు వెల్లింగ్టన్‌లో తొలి టెస్టు, నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు క్రైస్ట్‌చర్చ్‌లో రెండో టెస్టు జరగనుంది.


టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలు సజీవంగా నిలుపుకోవాలంటే ఈ సిరీస్ అత్యంత కీలకం కానుంది. పరిమిత ఓవర్ల క్రికెట్ మ్యాచ్‌లతో పోలిస్తే ఈ టూర్లో టెస్టు సిరీస్ భారత్‌కు అత్యంత కీలకం. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో నిలవాలంటే టీమిండియా కచ్చితంగా కివీస్‌ను ఓడించాల్సి ఉంది. ఇందుకోసం టీమ్ మేనేజ్మెంట్ ప్రత్యేక వ్యూహాలను సిద్ధం చేస్తోంది.

చివరి వన్డే ముగిసిన కేవలం మూడు రోజులకే మొదటి టెస్టు ప్రారంభం కానున్న నేపథ్యంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు టెస్టు జట్టుకు ఎంపికైన ముఖ్య ఆటగాళ్లకు చివరి రెండు వన్డేల నుంచి విశ్రాంతి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. వీరంతా వెల్లింగ్టన్‌లో జరిగే మొదటి టెస్టు కోసం ముందుగానే రెడ్-బాల్ ప్రాక్టీస్ ప్రారంభించనున్నారు.

గిల్ గైర్హాజరీలో చివరి రెండు వన్డేలకు భారత జట్టు నాయకత్వ బాధ్యతలను శ్రేయస్ అయ్యర్ చేపట్టే అవకాశం ఉంది. గిల్‌తో పాటు జస్ప్రీత్ బుమ్రా, కేఎల్ రాహుల్, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ వంటి ఆటగాళ్లు న్యూజిలాండ్‌తో చివరి రెండు వన్డేలకు దూరమయ్యే ఛాన్స్ ఉంది.

# ఆసియా క్రీడల్లో భారత్‌కు ఎదురుదెబ్బ

**అనారోగ్యంతో వైదొలగిన అథ్లెట్**



ఆసియా క్రీడల్లో భారత్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఏ)లో పురుషుల 77 కేజీల విభాగంలో బరిలోకి దిగాల్సిన భారత అథ్లెట్‌వరుణ్ సన్యాల్ పోటీ నుంచి తప్పుకున్నాడు. జపాన్ వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడల్లో భాగంగా ఆదివారం తన బస చేస్తున్న క్రూయిజ్ షిప్‌లో అతడు స్పృహ తప్పి పడిపోయినట్లు ఎంఎంఏ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు నిఖిల్ కుందేరా వెల్లడించారు.

నేపాల్‌కు చెందిన అథ్లెట్ ఒకరు వరుణ్ సన్యాల్‌ను గమనించి.. సమాచారం ఇవ్వడంతో ఆస్పత్రికి తరలించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగానే ఉంది. పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్‌తో లేకపోవడంతో వరుణ్ సన్యాల్ క్వార్టర్ ఫైనల్ నుంచి డిస్‌క్వాలిఫై అయినట్లు సమాచారం.

**ఆసియా ఛాంపియన్‌షిప్‌లో పతకం**

భారత్ నుంచి ఆసియా క్రీడల ఎంఎంఏ జట్టులో ఎంపికైన ఇద్దరు క్రీడాకారుల్లో వరుణ్ సన్యాల్ ఒకడు. 2026 జనవరిలో చైనాలో జరిగిన ఆసియా ఎంఎంఏ ఛాంపియన్‌షిప్‌లో వరుణ్ కాంస్య పతకం సాధించాడు. దీంతో ఆసియా క్రీడల్లో అతడిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే అనూహ్యంగా అనారోగ్య కారణాలతో పోటీ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.

# భారత్‌కు మరో పతకం ఖాయం

జపాన్‌లోని నగోయాలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో (2026) భారత్‌కు మరో పతకం ఖాయమైంది. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఏ)లో మహిళల-60 కేజీల విభాగంలో భారత క్రీడాకారిణి సుచిక తరియల్ సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నారు. క్వార్టర్ ఫైనల్స్‌లో మంగోలియాకు చెందిన అల్తాన్‌చెమెగ్ బైగల్మా‌ను 2-0 తేడాతో ఓడించి, సుచిక కాంస్య పతకాన్ని ఖాయం చేసుకున్నారు. సుచిక ఫైనల్‌కు చేరేందుకు సింగపూర్‌కు చెందిన హుయ్ హూన్ టియో లేదా ఇరాన్‌కు చెందిన అరెజౌ సలీమిఘలేహ్సొల్లో ఒకరితో తలపడనున్నారు.





# 'కదిరి కాళిదాస్'గా మెగాస్టార్

చిరంజీవి కథానాయకుడిగా బాబీ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కాకా'. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ మూవీ సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల చిరు పుట్టినరోజు సందర్భంగా టైటిల్‌తో పాటు, గ్లింప్స్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. తన సినిమాలకు సంబంధించి చిరంజీవి ముందే లీక్ ఇస్తుంటారు. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన 'కాకా'లో తన పేరు వెల్లడించారు. ఇందులో ఆయన 'కదిరి కాళిదాస్'గా నటిస్తున్నట్లు చెప్పారు. అయితే, ఈసారి చిరు లీక్ వెనుక బిగ్‌బాస్ బ్యూటీ, యాంకర్ స్రవంతి చొక్కారపు ప్రధాన కారణంగా నిలవడం విశేషం. తాజాగా జరిగిన ఓ ఈవెంట్‌లో స్టేజ్‌పై మాట్లాడుతున్న చిరంజీవి వద్దకు మైక్ పట్టుకుని యాంకర్ స్రవంతి చొక్కారపు వచ్చింది. తన ఊరు కదిరి అని, తనది అనంతపురం జిల్లా అని చెబుతూ చిరంజీవితో ముచ్చటించింది.

స్రవంతి మాటలు విన్న వెంటనే మెగాస్టార్‌లోని సరదా కోణం బయటకు వచ్చింది. ఆమె వైపు చూపిస్తూ.. తన ఊరి పేరునే నా సినిమాలో నా క్యారెక్టర్‌కి పెట్టాము..అంటూ పక్కనే ఉన్న వారిని, ఆడియన్స్‌ను సస్పెన్స్‌లో పడేశారు. అంతటితో ఆగకుండా అందరూ ఆశ్చర్యపోయేలా తన క్యారెక్టర్ పేరు 'కదిరి కాళిదాస్' అని ఒక్కసారిగా రివీల్ చేసేశారు. దీంతో ఆడిటోరియం మొత్తం ఫ్యాన్స్ విజిల్స్, కేకలతో దద్దరిల్లిపోయింది.చిరు లీక్‌తో స్రవంతి మురిసిపోతుంటే..,పక్కన ఉన్నవారంతా నవ్వుతూ ఆనందంతో చప్పట్లుకొట్టారు. "అంతా స్రవంతి వల్లే జరిగింది.. ఆమె తన ఊరి పేరు చెప్పేసరికి చిరు ఇలా లీక్ చేసేశారు" అంటూ నెటిజన్లు ఈ వీడియో క్లిప్‌ను తెగ షేర్ చేస్తున్నారు. ప్రస్తుతం ఇది సామాజిక మాధ్యమాల్లో ట్రెండ్ అవుతోంది.

## 'జడల్'.. కథలోనుంచి
# పుట్టిన క్యారెక్టర్



తనకు ఏ స్టార్‌డమ్ ట్యాగ్‌లు, బాక్సాఫీస్ రికార్డులతో పనిలేదని, తెలుగు ప్రేక్షకులు గర్వంగా చెప్పుకునే చిత్రాలు తన నట జీవితంలో ఉండాలని న్యాచురల్ స్టార్ నాని అన్నారు. ఆయన కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్'. కయాదు లోహర్ కథానాయిక మోహన్‌బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి, తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఎస్.ఎల్.వి.సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ సెప్టెంబరు 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ.. ఈ కథలో ఏదో ప్రత్యేకంగా కనిపించాలని జడలు వేసుకోలేదు. కథలో నుంచి పుట్టిన క్యారెక్టర్ ఇది 'జడల్' సొసైటీలో సాధారణ వ్యక్తిలాంటివాడు కాదు. వాడికి చిన్నప్పటి నుంచే ఓ పిచ్చి ఉంటుంది. అదేంటో మీరు తెరపై చూడాలన్నారు. మాస్ ఆడియన్స్ నాడి తెలిసిన దర్శకుడు శ్రీకాంత్ ఓదెల. 'ప్యారడైజ్' అతని విజన్'. ఇందులో మేమంతా సవారీలు అనే తెగకు సంబంధించిన వాళ్లుగా కనిపిస్తాం. వాళ్లకు ఎలాంటి గుర్తింపూ ఉండదు. వాళ్ళు ఎవరిని చంపినా కేసు ఉండదు. వాళ్లను చంపినా ఎవరూ పట్టించుకోరు. అసలు ఉనికి లేని ఒక జాతి తమ ఉనికి కోసం చేసే తిరుగుబాటు. దీని నేపథ్యంగా మునుపెన్నడూ చూడని 80వ దశకం నాటి ఒక కొత్త ప్రపంచాన్ని దర్శకుడు శ్రీకాంత్ అతడి టీమ్ సృష్టించింది. ఇందులో మోహన్ బాబు సికంజా మాలిక్ అనే పాత్ర పోషిస్తున్నారు. తెరపై చాలా క్రూరంగా ఉంటుంది.

కథ వినగానే ఆయన ఎంతో ఉత్సాహం చూపించారు. 'జడల్' పాత్ర కోసం మేకప్ వేసుకోవడానికి నాకు గంటన్నర సమయం పట్టేది. జడల వల్ల రోజంతా వెనక్కి అనుకోవడానికి కూడా ఉండేది కాదు. ఎక్కడున్నా నిటారుగా కూర్చోవాల్సి వచ్చేది. కొన్నిసార్లు ఏకధాటిగా 30 గంటల పాటు షూట్ చేశాం తలంతా ఎర్రబడి గాయాలయ్యాయి. ఈ సినిమాలో హీరోని బురదలో, నిప్పుల్లో, వర్షంలో ఎంత కష్టపెట్టారో.. తల్లి పాత్ర పోషించిన సోనాలి కులకర్ణిని కూడా అంతే ఇబ్బంది పెట్టారు. ఒక్కసారి కూడా కంప్లైంట్ చేయకుండా ఆవిడ పడ్డ కష్టం రిలీజ్ తర్వాత అందరి ప్రశంసలు అందుకుంటుందని నాని అన్నారు.

# రవితేజకు జోడీగా ప్రియాంక

'ఇరుముడి' విజయంతో మంచి జోష్‌లో ఉన్నారు మాస్ మహారాజా రవితేజ. ప్రస్తుతం తదుపరి సినిమాలతో బిజీ అయ్యే పనిలో ఉన్నారు. త్వరలోనే దర్శకుడు వివేక్ ఆత్రేయతో కొత్త సినిమాను ప్రారంభించనున్నారు.

ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. రవితేజతో పాటు నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. తాజాగా ఈ చిత్రంలో కథానాయికగా తమిళ భామ ప్రియాంక అరుళ్ మోహన్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం.

అక్టోబర్‌లో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. 2027 సమ్మర్‌లో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. లక్ష్మణ్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. వివేక్ ఆత్రేయ ఇప్పటికే ఈ సినిమా కోసం కథను సిద్ధం చేసినట్లు సమాచారం. రవితేజ ఇమేజ్‌కు తగ్గట్టుగా, భారీ స్థాయిలో ఈ ప్రాజెక్టును రూపొందించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

# ఈ సారి గుజరాత్‌లో...
# జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానం

కొన్ని దశాబ్దాలుగా ఢిల్లీలోనే జరుగుతున్న నేషనల్ ఫిలిమ్ అవార్డ్స్ ఫంక్షన్‌ను ఈ సారి గుజరాత్‌లో నిర్వహించనున్నారు. మధ్యలో రెండు సార్లు మద్రాసు వేదికగా జరగటం మినహా ఈ అవార్డులు మొదలైన తరువాత ఢిల్లీ దాటి బయటిప్రాంతంలో ప్రదానోత్సవం జరపలేదు. మళ్ళీ ఇన్నాళ్లకు ఢిల్లీ నుంచి జాతీయ చలనచిత్ర అవార్డుల వేడుక మారడం విశేషంగా మారింది.

1954లో మొదలైన 'నేషనల్ ఫిలిమ్ అవార్డ్స్' ప్రదానం ఈ నాటికీ కొనసాగుతూనే ఉండడం విశేషం. 1954 నుండి ఢిల్లీ వేదికగానే జాతీయ చలనచిత్ర పురస్కారాల సంబరం సాగుతోంది. అయితే మధ్యలో అంటే 1970, 1971లో మాత్రం మద్రాసు వేదికగా జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం సాగింది. మళ్ళీ ఇన్నాళ్ళకు అంటే దాదాపు 56 ఏళ్ళకు ఢిల్లీని వీడి 'నేషనల్ ఫిలిమ్ అవార్డ్స్' వేడుక గుజరాత్ లో జరగనుంది. సెప్టెంబర్ 22వ తేదీన గుజరాత్ లోని కేవడియా- ఏక్తానగర్ లో ఈ వేడుక సాగనుంది. ఈ సారి జరగబోయే వేడుక 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలకు సంబంధించినది. ఈ అవార్డుల ఫలితాలను జూలై 18న ప్రకటించారు. ఇప్పుడు గుజరాత్ లో ప్రదానం చేయబోతున్నారు. ఈ ఏడాది దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుకు ప్రఖ్యాత కన్నడ నటుడు అనంత్ నాగ్‌ను ఎంపిక చేశారు. అనంత్ నాగ్ కొన్ని తెలుగు చిత్రాలలోనూ నటించి ఆకట్టుకున్నారు. ఈ సారి ఉత్తమ నటుడు కేటగిరీలో మళయాళం 'భ్రమయుగం' నుండి మమ్ముట్టి, 'చందు ఛాంపియన్' నుండి కార్తిక్ ఆర్యన్ ఎన్నికయ్యారు. 'ఆర్టికల్ 370'లో నటించిన యామీ గౌతమ్ ఉత్తమ నటిగా అవార్డు అందుకోనున్నారు...



**భిన్నస్వరాలు...**

జాతీయ చలన చిత్ర పురస్కారాల ప్రదానోత్సవం దేశ రాజధాని ఢిల్లీ నుండి గుజరాత్ కు మార్చడంపై భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. దేశ ప్రధానమంత్రి, హోమ్ మంత్రి ఇద్దరూ గుజరాత్ కు చెందినవారు కావడంతో అక్కడకు నేషనల్ ఫిలిమ్ అవార్డ్స్ వేడుకను మళ్ళించారనీ కొందరు అంటున్నారు. కొందరయితే జాతీయ చలనచిత్ర అవార్డులు కాబట్టి దేశరాజధాని ఢిల్లీలోనే జరపాలనీ చెబుతున్నారు. నటుడు పరేశ్ రావెల్ లాంటివారు ఇలా ఢిల్లీ నుండి వేరే ప్రదేశాలలో నేషనల్ ఫిలిమ్ అవార్డ్స్ వేడుకను నిర్వహించడాన్ని స్వాగతించారు. ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెడుతూ కేంద్ర సమాచార- ప్రసార శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. ఇకపై జాతీయ చలన చిత్ర అవార్డులను దేశంలోని పలు నగరాల్లో నిర్వహిస్తామన్నది ఆ ప్రకటన సారాంశం.



# ముందు మీ మోహం అద్దంలో చూసుకోండి

## - ట్రోలర్లకు సల్మాన్ వార్నింగ్

ప్రసవానంతరం బరువుపెరిగిన బాలీవుడ్ నటి కత్రినా కైఫ్‌పై సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్‌ను స్టార్ హీరో సల్మాన్ ఖాన్ తీవ్రంగా ఖండించారు. 'బిగ్ బాస్-20'లోని ఓ ఎపిసోడ్‌లో ఆయన ఈ విషయం పై స్పందిస్తూ..ఇతరులను కించపరిచే ట్రోలర్లపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.గర్భందాల్చిన తర్వాత బరువు పెరగడం అనేదివెరికైనా చాలా సహజం. ఒక మహిళను బరువు గురించి ట్రోల్‌చేయడం సరికాదు.కత్రినా ప్రస్తుతం తన కుటుంబంతో సమయం గడపాలను కుంటోంది. ఆమె మళ్ళీ షూటింగ్స్‌లో పాల్గొనే సమయానికి కచ్చితంగా మును పటి ఆకృతిలోకి వస్తుంది. ఇలాంటి ట్రోల్స్‌ను ఆమె అస్సలు పట్టించుకోకూడదని అని సల్మాన్ అసహనం వ్యక్తం చేశారు.

ఇలాంటి ఆన్‌లైన్ విమర్శలు,నెగెటివిటీపై ఇతరుల అభిప్రాయాలతో పనిలేకుండా..పూర్తి ఆత్మవిశ్వాసంతో ఎలా బతకాలో చాటిచెబుతూ సల్మాన్ ఖాన్‌చేసిన పని ఇప్పుడు నెట్టింట సంచలనం సృష్టిస్తోంది. షో రన్నింగ్ లో ఉండగానే ఒక్కసారిగా తన చొక్కా విప్పేసిన సల్మాన్ ఖాన్.. సిక్స్ ప్యాక్, అదిరిపోయే ఫిజిక్‌ను చూపిస్తూ ట్రోలర్లకు గట్టి సవాలు విసిరారు. "రండి.. నన్ను ట్రోల్ చేయాలనుకుంటున్నారా? చేయండి! క్లోజప్ తీసుకోండి..నా బాడీపై ఏమైనా మేకప్ ఉందేమో తుడుచుకుని మరీచూపిస్తా" అంటూ తన క్రూమెంబర్‌ని పిలిచి ఒంటిపై ఉన్న చెమటను టవల్‌తో తుడిపించి మరీ తన నేచురల్ బాడీని చూపించారు. ఆ సమయంలో వేదికపై ఉన్న కంటెస్టెంట్లు సల్మాన్ డెడికేషన్, ఫిట్‌నెస్‌ను చూసి షాక్ అయిపోయి ఈలలు, చప్పట్లతో ప్రశంసల వర్షం కురిపించారు.

అనంతరం ట్రోలర్లకు గట్టి క్లాస్ ఇస్తూ, సల్మాన్ ఖాన్‌ఘాటైనవ్యాఖ్యలుచేశారు.ఎదుటివారిపై కామెంట్లు చేసే ముందు.. అసలు మీమొహం అద్దంలో చూసుకోండి! మీ శరీరం ఎలా ఉందో చూసుకోండి.. ఆ తర్వాత మాట్లాడండి. అంతకంటే ముందు మీ ఇంట్లో ఉన్న తల్లిదండ్రుల గురించి ఆలోచించండి, వాళ్ల ఆరోగ్యాన్ని పట్టించుకోండి.. ఆ తర్వాతే ఇతరులపై పడి ఏడవండి,.'భాయ్..మీరు బరువుతగ్గారా? పెరిగారా?' అని ఆందోళనతో అడిగితే అర్థం ఉంటుంది.. కానీ పనిగట్టుకుని ట్రోల్ చేసేవాళ్లకు నేను సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదు" అంటూ ముఖం మీదే తేల్చిచెప్పేశారు.